


# వేర్లు

కేతు విశ్వనాథరెడ్డి

మీదిపెంట్లకు వుత్తరాన ఫర్లాంగు దూరంలోని హరిజనవాడ ఇళ్లు చెట్టుమీది కాకిగూళ్ళలా వున్నాయి.

వాడ మధ్యలో రాముల గుడికి కొంచెందూరంలో, కొట్టం బయట వేపచెట్టు కింద కుక్కిమంచంలో పడుకొని వెంకట్రాముడు యిప్పటికి నాలుగుమార్లు చదివి అయిదోమారు చదువుతున్న పాత నవలను పక్కన పెట్టి చెట్టుకొమ్మలోంచి

జారుతున్న నీరెండను చూస్తూ గాలి మోసుకొచ్చే శబ్దాలు వింటూ 'పనీ పాటా లేకుండా యిట్లా వుండడం యెంత నరకం' అనుకొంటూ ఆలోచనలో పడ్డాడు—

యిక్కడ తాను చెయ్యగల పని యేదీ లేదు. ఎం. ఎ. చదివిన తాను తండ్రి మాదిరి కులవృత్తి చెయ్యలేడు. చదువు అబ్బని తమ్ముళ్ళ మాదిరి రైతుల యిళ్ళల్లో పేడకళ్లు తియ్యలేడు ; గంజు యెత్తలేడు; గొడ్లు కాయలేడు. యిన్నేళ్ళూ చదివి ఆ పనులేవీ చేయలేడు. తల్లి, చెల్లెళ్ళ మాదిరి ముగ్గురాళ్ళ గ్రేడింగ్‌కు తాను వెళ్ళలేడు. యే పనీ లేకుండా, స్కూలుకు పోకుండా, అల్లరి చిల్లరగా తిరిగే పదేళ్ళ తమ్ముని మాదిరి వాడు చేసే పనులూ చెయ్యలేడు. వున్న పనులేవో చేయలేక, తాను చేయదగ్గ పనులేవో అందుబాటులో లేని తన చదువు ఫస్ట్‌క్లాస్ వస్తుందనుకుంటే వచ్చిన సెకండ్ క్లాస్ ఎం.ఎ. డిగ్రీ చదువు మీద వెంకట్రాముని‌కి కోపం వచ్చింది.

రిసర్చిలో సీటు రాలేదు. యూనివర్సిటీలోనూ, రెండు మూడు కాలేజీలేవో వాటిలోనూ తప్ప లేని తన సబ్జక్టుకు యే కాలేజీలోనూ లెక్చరర్ వుద్యోగం రాదు. ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ నుంచి రెన్యూ చేసుకోమనే కార్డులు తప్ప వుద్యోగం రాదు. ఏ యింటర్వ్యూలూ రావు. వస్తే గిస్తే ఆ మధ్య రాసిన గ్రూప్ వన్ పరీక్షల్లో పాస్ అయి యింటర్వ్యూలో ఆ రిజర్వుడు వేకెన్సీల కింద వుద్యోగం రావాలి. అంతవరకు వేపచెట్టుకింద వొంటరితనం తప్పదు.

రోడ్డుమీద బస్సు ఆగిన శబ్దం, రెండు మూడు నిముషాలు బస్సు హారన్ వెంకట్రామునికి వినిపించేయి.

'టపాల్ బస్సు' వచ్చింది. రోజూ మాదిరే తన వుద్యోగం మొదలయింది వూళ్ళో పోస్టాఫీసుకు వుత్తరాల కోసం వెళ్ళే వుద్యోగం మొదలయింది. దేవదానం తెప్పించే హిందూ వాంటెడ్ కాలమ్స్ చీకట్లో వెదుకులాట వుద్యోగం మొదలయింది.

తలుపుకు చిలుకు తగిలించి వెంకట్రాముడు వూళ్ళోకి బయలుదేరాడు.

వాడ పొలిమేరల్లో కాలిబాట పక్క మొరపు నేలలో నలుగురైదుగురు చచ్చిన గొడ్డును కోస్తున్న దృశ్యం వెంకట్రాముడు చూసేడు.

వెంకట్రామునికి కడుపులో దేవినట్లయింది. కసరు వాసన వెంకట్రాముడు భరించలేకపోయేడు. దబ్బెం, యెర్రటి దొమ్మ, గుండెకాయలు చూపులకు బీభత్సంగా వున్నాయి. కుంటికుక్క అరుపులు, కాకుల గోల వెంకట్రాముని చెవులకు భరించరాకుండా వున్నాయి. వాళ్ళు నిర్వికారంగా గొడ్డును కోసే

దృశ్యం, వెంకట్రామునికి గతంలో అనుభవానికి రాని యెన్నో వికారాలు కలుగచేసింది. ఆ వాతావరణంలో యిమిడిపోయి యేదో యజ్ఞాన్ని తిలకిస్తూ ఆనందిస్తున్న మునిబాలకునిలా వున్న తమ్ముని లాగి తందామనుకున్నాడు. అప్రయత్నంగా 'రేయ్' అని కేకవేశాడు. వాడు జడుసుకొని వాడవైపు పరుగెత్తి పోయేడు.

గొడ్డును కోస్తున్న వాళ్ళలో ఒకడు పని ఆపి నవ్వుతూ అన్నాడు:

"అరేయ్ రాముడూ! నీ అరుపుకు మేం కూడా అదిరిపోయినాం. వాడినెందుకు అర్సినావు? నీ మాదిరి సదువు రాదు. ఆ పున్నెం వాడు సేసుకోలేదు. యేదో యిట్లాంటిదన్నా నేర్సుకుంటాడు."

వాళ్ళమీద, ఆ వాతావరణం మీద జుగుప్సతో వెంకట్రాముడు మాట్లాడలేక పోయేడు. జమ్మిచెట్టు బాట పక్కన సాగిపోతూ, చెట్టుకింద పడివున్న తాగుబోతు నుంచి వస్తున్న సారాయి, మురికి వాసనకు వెంకట్రాముడు తట్టుకోలేకపోయేడు. అస్యహించుకుంటూ ముందుకు సాగిపోతున్న వెంకట్రాముని చూచి వాళ్ళల్లో వొకడన్నాడు—

"పిల్లప్పుడు యీడూ గొడ్డు సియ్యాలని యెగబడినోడే. సదువుకొని మారిపోయినాడు."

మరొకడు సమాధానంగా అన్నాడు—

"యెంత సదివినా వాడు మనోడే. రెడ్డేరి బిడ్డ అయితాడా?"

వూళ్ళోకి వెళ్తున్న వెంకట్రామునికి ఆ మాటల్లో వాస్తవం రుచించలేదు. వాళ్ళ పిలుపులూ, చర్యలూ, వ్యాఖ్యానాలూ, వెంకట్రామునికి చీదరింపుగా వున్నాయి. అయితే యిన్నేళ్ళూ అలవాటయిన మనుషులు తన కెందుకు తలకిందుగా కన్పిస్తున్నారో, వాళ్ళ మాటలు తనకెందుకు రోతగా వున్నాయో, బుద్ధి తెలిశాకే యింటువంటి దృశ్యాల్ని చూచినా జుగుప్స చెందని మనస్సు యెందుకు జుగుప్స చెందుతూందో వెంకట్రామునికి యెంత ఆలోచించినా అర్థంకాలేదు. యీ మురికి ప్రపంచంనుంచి తాను వేరైపోయాడు అనుకున్నాడు.

యీ దుర్భర పరిసరాల్లో తాను యిమడలేక పోతున్నాడు. కనీసం యింట్లో కూడా తనకూ తనవాళ్ళకూ మధ్య యేదో అంతరం అనుభవానికి వస్తోంది. డబ్బు అంటూ చేతిలో వుంటే వెంకటమ్మ సారాయి అంగట్లో తాగి చీకటి పడ్డాక కొంప చేరుకునే తండ్రి అంటే రోతగా వుంది. పైగా రాముల గుడి దగ్గర నలుగుర్నీ పోగుచేసుకొని అర్ధరాత్రిదాకా పాతకాలం గొప్పలు చెప్పుతుంటాడు.

ముగ్గురాళ్ళ లారీల్లో వూరేగే అన్న అన్నాకూడా యేదో చిరాకు। చిరిగి మాసిక లైన మురికి కట్టుకోకా, రవికతో ముగ్గురాళ్ళ గ్రేడింగుకు వెళ్ళే తల్లికూడా యేదో పరాయిదానిమాదిరి కన్పిస్తోంది. ముగ్గురాళ్ళ పనికే వెళ్ళే యెదిగిన చెల్లెలిని చూస్తే తన క్లాస్‌మేట్స్ అమ్మాయిలు జ్ఞాపకానికి వస్తున్నారు.

వెంకట్రాముడు పోస్టాఫీసు చేరేటప్పటికి, అప్పటికే పదిమంది వరకూ పోగై వున్నారు. పోస్ట్ టైంలో ఆ వూరికి ఆ ప్రదేశం వొక మఠం. మీదిపెంట్ల పోస్ట్‌మాస్టరు, యింట్లో ఎందుకు లెమ్మని వీధి అరుగుమీదనే ఆఫీసు తెరచి, ముద్రలు గుద్దుతూ వుత్తరాల బట్వాడా కార్యక్రమంలో వున్నాడు. అరుగుమీద వొక పక్క పెద్దిరెడ్డి కొడుకు రోశిరెడ్డి 'ఆ వుత్తరం మీది కాద'ని పోస్ట్‌మాస్టరు అంటున్నా నవ్వుకుంటూ యె:రికో వచ్చిన కార్డును చదువుతున్నాడు.

'బ్రూట్। దేవర దున్నపోతు।' అని మనసులో రోశిరెడ్డిని వెంకట్రాముడు అసహ్యించుకున్నాడు.

పోస్ట్‌మాస్టరు వెంకట్రామునికి హిందూ అందిస్తూ "నీకీ రోజు వుత్తరాలు లేవు" అన్నాడు. వెంకట్రాముడు నిలబడుకునే హిందూ చూస్తున్నాడు. రాబోయే యెన్నికల్లో యేయే పార్టీల బలాబలాలు యెంతెంత వుండేది వుపన్యాసం రోశిరెడ్డి మొదలుపెట్టేడు. జోరు హెచ్చింది. వెంకట్రాముని వైపు తిరిగి అన్నాడు;

"పల్లె పల్లెలోని రైతుల వోట్లు యెవరెవరికి పడతాయో చెప్పమంటే చెప్తాను. పల్లె పల్లెకూ ధగళ్ళ మాదిరి వుండే యీ హరిజనిండ్ల సంగతే...."

వెళ్ళబోతున్న వెంకట్రాముని చూచి, నోటినుంచి రాబోతున్న తిట్లను యెలాగో ఆపుకొని "మీ అమాసగాణ్ణి మా నాయన రమ్మన్నాడని చెప్పు, పులివెందుల నుంచి వస్తూనే" అని అన్నాడు.

వెంకట్రాముడు కక్కా లేక మింగా లేక తలూపి రోడ్డుమీదికి వెళ్ళే దారి పట్టేడు.

రోశిరెడ్డి మాటలు వెంకట్రాముని చీకటీగల్లా, దోమల్లా బాధించటం మొదలుపెట్టాయి—

రైతుల నోళ్ళలో తిట్టు పదమైన తమ కులంపేరు యెంత ఆత్మన్యూనతను పెంచిందో వెంకట్రాముడు ఆలోచించటం మొదలుపెట్టాడు. తనలాంటి చదువుకున్నవాడికి జీవితం యీ రకం రాక్షస గడియలలోనే గడుస్తుందా అని వెంకట్రాముడు క్రుంగిపోయేడు.

తన వేదు జ్ఞాపకాల తుట్టెను రేపిన రోశిరెడ్డి మీద వెంకట్రామునికి కోపం వచ్చింది. తన అనుభూతులను నిశితం చేసిన చదువుమీద మంట పుట్టింది.

తనెందుకు రోశిరెడ్డిగాని మాటకు మాట అంటించలేకపోయాడు. బి.ఏ. మూడుసార్లు తప్పిన నా కొడుకు.... తండ్రి ముల్లె వుందని, ముగ్గురాళ్ళ గని లీజేదో వచ్చిందని యేవో కూతలు!

అమాసగాడట.... యింకెమి అమ్మా అబ్బడు పెట్టిన పేర్లు లేనట్లు! నాం నిశానీ లేని ఛండాలపు బతుకులు! తాముండే వూరికి పేరులేదు! పిలుపులో కనీస మర్యాదలు లేవు. వుండేది మాదిగిండ్లయితే అందులోని వాళ్ళ పేర్లన్నీ వురఫ్‌లే- రైలు బొగ్గులోడు వురఫ్ చెన్నుగాడు, మిలటరీ కుంటోడు వురఫ్ పుల్లిగాడు గూబిల్లిగాడు వురఫ్ ఓబులుగాడు, సంగటోడు, వురఫ్....యాల పొద్దుగాడు వురఫ్....వురఫ్....గాడు....గాడు! తన అన్న నల్లగా వున్నాడు కాబట్టి అమాసగాడు.. ఈ రోశిరెడ్డిగాడు రైలుబొగ్గుకంటే హీనంగా బర్రె గొడ్డు మాదిరి వున్నాడు.... వీన్ని అట్లానే మారుపేరుతో పిలిస్తే....!

తాను పిలువలేడు. తనవాళ్ళెవ్వరూ పిలువలేరు. పిలవాలనుకున్నా పిలవలేరు. తమవి అస్తిత్వం లేని జీవితాలు.

తాను ఆర్.డి.వో. అవ్వాల. రోశిరెడ్డిలాంటి వాళ్ళపని పట్టాల. ఆ గాడిద 'సార్....సార్' అంటూ బూట్లు నాకుతాడు, అప్పుడు. ఆ రోజువరకే తన ఎదట యీ పిలుపులు....

కనీసం తనను జొన్నకంకులోడు అని యెవ్వరూ పిలవడంలేదు. దానికైనా సంతోషించాలి. తెలిసీ తెలియని వయసులో పైర్ల కాలంలో తాను జొన్న పిసుకుళ్ళకోసం జొన్న కంకుల్ని విరిచినందుకు దెబ్బలు.... తిట్లు!

ఆ దృశ్యం వెంకట్రాముని కళ్ళల్లో మెదిలింది. దాదాపు యింటర్ వరకూ ఆ పేరుతో పిలుస్తూ వుండేది జ్ఞాపకం వచ్చింది.

దాంతో ఆత్మన్యూనతను గుర్తుకు తెచ్చే సన్నివేశాలు, యూనివర్సిటీలో కూడా అగ్రకుల విద్యార్థులు లోలోపల యేడుస్తూ బయటికి నవ్వుతూ గవర్నమెంటు దత్తపుత్రులు" అని తమకిచ్చిన ముద్దుపేరు వెంకట్రాముని స్మృతిలో మెదిలేయి.

యీ విషయంలో యేమీ పట్టించుకోకపోతే అదేదో కథలో మాదిరి పేరు మరచిపోయిన యీగలాగా తయారు కావలసి వుంటుంది అనుకున్నాడు. యీ విషయం యే విధంగా పట్టించుకోవాలో వెంకట్రామునికి దిక్కు తోచలేదు.

రోడ్డుమీది కొచ్చేక వెంకట్రాముని కి టీ తాగుదామనిపించింది. రోడ్డు మీదున్న రెండు టీ బంకుల దగ్గర, వూళ్ళో కాస్త స్థితిమంతులైన అసాములు బెంచీలమీద కూచుని కబుర్లలో వున్నారు. వెంకట్రాముడు టీ తాగే ఆలోచనను మానుకున్నాడు. కడపవైపు వెళ్ళే రోడ్డులో కాస్త దూరం నడచి మాలిండ్ల ద్వారా యిల్లు చేరితే బావుంటుందనుకున్నాడు.

మాలిండ్ల దారిలో వెళ్తూంటే, వెనుకవైపునుంచి దేవదానం వెంకట్రాముని భుజం తట్టి పలకరించేడు.

"రెండుసార్లు పిలిచినా పలకలేదు నువ్వు. కొంపదీసి యే కలల్లో వున్నావు"

"అవొకటే తక్కువ.... స్కూలు లేదా?"

"వుంది. కడపకు వెళ్లాలని లీవు పెట్టినా. యిప్పుడే నీ దగ్గరకు వద్దామనుకుంటున్నా. నువ్వే కనిపించినావు. నువ్వూ రారాదా కడపకు? పోయొస్తాం. పనేముంది?"

"యెందుకు?"

"జిల్లా కుల నిర్మూలన సమితి అన్యువల్ కాన్ఫరెన్సు. యెగ్జిక్యూటివ్ మెంబర్ని. ఆ సంగతే మర్చిపోయినా. మా కార్యదర్శి వుత్తరం రాసినాడు— యీవాళ తప్పకుండా రమ్మని. పోకపోతే బాగుండదు. పైగా హైదరాబాదు నుంచి రాష్ట్ర అధ్యక్షుడు సచ్చిదానందం గారని సర్వీస్ కమీషన్ మెంబరు వస్తున్నారు. జిల్లా సంఘం గౌరవాధ్యక్షులు ఓబయ్య వస్తారు. ఆయన మన డి. ఆర్. వో. అధ్యక్షులు పెంచలయ్య అని రిజర్వుడు యం. యల్. ఏ. ఓబయ్యా, పెంచలయ్యా మీ వాళ్ళే. నాలుగు పరిచయాలవుతాయి. మంచిదే కదా?"

"ఆ సంఘం సంగతి నువ్వెప్పుడూ నాతో అనలేదే?"

"మన పల్లెల్లో అట్లాంటివి జ్ఞాపకమున్నా వస్తాయా?"


"మీ సంఘం యేం చెయ్యాలని...?"

"కడపకు రారాదా నాతో? నీకే తెలుస్తుంది."

వెంకట్రాముని మౌనాన్ని దేవదానం అర్థంచేసుకున్నాడు. కలుపుగోలుగా అన్నాడు.

"చార్జీలకు నా దగ్గర డబ్బులున్నాయిలే. ఫరవాలేదు. పదకొండు గంటల బస్సుకు పోదాం. పన్రెండు కల్లా కడప చేరొచ్చు."

"మెంబర్లు కానివాళ్ళు రావచ్చా?"




"సంఘంలో యెవరు మెంబరో, యెవరు కాదో నాకే తెలియదు. యిదేమన్నా రాజకీయ సంఘమా- పెద్ద పెద్ద రూల్సు వుండటానికి?... పోనీ అబ్జర్వరుగా రా."

"సరే వస్తాను."

"భోంచేసి బయలుదేరుదాం."

"యింటికి వెళ్లి బట్టలు మార్చుకొని వస్తా. యెవరితోనో వొకరితో మాయమ్మకు చెప్పి అంపిస్తే సరిపోతుంది."

దేవదానాన్ని వదలి, మాలిండ్లు దాటి అరఫర్లాంగు దూరంలోవున్న మాదిగిండ్ల వైపు వెంకట్రాముడు నడిచేడు. తన గడ్డురోజుల్లో యెండిపోతున్న పైరు కొనప్రాణాలను నిలబెట్టే తుంపరలాంటి దేవదానం స్నేహం పట్ల వెంకట్రాముని మనసు ఆర్ద్రితతో నిండిపోయింది. రోజూ సాయంత్రం స్కూలు వదిలేక రోడ్డుమీద కలుస్తూ మైలో, రెండు మైళ్లో, తనతోపాటూ నడిచే దేవదానం వొక్కడే యీ వూళ్ళో తనకిష్టమైన వ్యక్తి అనుకున్నాడు. తనకు వుద్యోగం రాకుండా, దేవదానానికి వున్నట్లుండి ట్రాన్స్ఫరువస్తే తన గతి యింతకంటే అధ్వాన్నమవుతుందని వెంకట్రామునికి అనిపించింది. దేవదానం పట్ల కృతజ్ఞతాభావంలాంటి భావం వెంకట్రామునికి కలిగింది.

కుల నిర్మూలన సంఘం యేం చేస్తుందని ఆలోచిస్తూ యింటికి చేరేడు. యేం చేసినా చేయకపోయినా, నలుగురు పెద్దల పరిచయం తనకు కలుగుతుంది.

ముఖ్యంగా సర్వీస్ కమీషన్ మెంబరుః యెవడు చూసొచ్చినాడు? ముందు ముందు వాళ్ళు తనకు సహాయం చెయ్యవచ్చు.

కడపలో తనకు కలుగబోయే పరిచయాలను వెంకట్రాముడు వూహించు కున్నాడు. ఆ వూహా చిత్రం వెంకట్రామునికి మనోజ్ఞంగా కన్పించింది. యిన్నాళ్ళూ అయోమయంగా, అర్థరహితంగా, ఆందోళనగా కన్పించిన భవిష్యత్తు ఆశావహంగా కన్పించింది.

## 2

కడప బస్‌స్టాండులో దిగతూనే దేవదానం అన్నాడు-

"ముందుగా వాసుగారని- కుల నిర్మూలన సంఘం కార్యదర్శి- అయన్ను చూద్దాం. యిక్కడికి వాళ్ళ యిల్లు దగ్గరే. నువ్వు ఆయన్ను చూడాల. చాలా మంచి మనిషి. అనంతపురంలో మా లెక్చరర్...."

వెంకట్రాముడు, దేవదానం మాట్లాడుకుంటూ నాగరాజుపేటవైపు బయలు దేరేరు.

వెంకట్రాముడు అడిగేడు-

"లెక్చరరా?"

"ఆ"

"యే డిపార్ట్‌మెంట్?"

"హిస్టరీ. గొప్ప టీచరు. ఆయన చెప్పిన చరిత్ర నేనింకా మరిచిపోలేదు- కాలేజీ వదిలి యెనిమిదేండ్లయినా. పాఠం మధ్యలో పొరపాటున కులం ప్రస్తావన వచ్చిందనుకో ఆ గంటంతా కులాలవల్ల దేశానికి జరిగిన అన్యాయాల్ని యేకి పారేసేవాడు. పెద్దకులాలవాళ్ళను చించి చెండాడేవాడు- ముఖ్యంగా బ్రాహ్మల్ని.

"ఆయనది యే కులం?"

"బ్రాహ్మడే. జంధ్యం పిల్లప్పుడే తెంచి పారేసినాడటః అయినవాళ్ళందరినీ కాదని వర్ణాంతర వివాహం కూడా చేసుకున్నాడు."

"ఆమెది యే కులం?"

"నాకు సరిగా తెలియదు. బోయ అని విన్నా. ఆమె విజయవాడలో ఆయన స్టూడెంటేనంట. యెవరో సెక్రటేరియట్లో పెద్ద వుద్యోగి కూతురు. అంత బాగుండదు. మంచిగానే కన్పిస్తుంది."

"ఆయన కడపకొచ్చి యెన్నాళ్ళయింది? నేను బి. ఎస్. సి. లో వున్నప్పుడు లేడే?"

"రెండేండ్లయిందనుకుంటా."

సంభాషణను యే విధంగా కొనసాగించాలో ఆ తర్వాత వెంకట్రాముడికి తోచలేదు. గొణుగుతున్నట్లు అన్నాడు–

"దేశమంతా మారినా మన పల్లెల్లోవాళ్ళు మారలేదు."

"పల్లెల్లో మార్పు కష్టం."

"యెందుకనో?"

యెందుకో దేవదానం చెప్పలేక "మనుషుల్లో మార్పు రావాల" అన్నాడు.

"నాకూ అట్లానే అన్పిస్తుంది. కానీ మార్పెట్లా రావాలో అర్థంకాదు."

"వాసు సారుతో తీరిగ్గా చర్చిద్దాంలే. యిదో! యింటి దగ్గరకొచ్చినాం."

వెంకట్రాముడు, దేవదానం గేటు తీసుకొని కాంపౌండులోకి వెళ్ళేరు. వరండాలో యెవరో అమ్మాయి దీక్షగా చదువుకుంటోంది. ఆమెను యెక్కడో చూసినట్లు అన్పించింది వెంకట్రాముడికి.

దేవదానం బొడిదగ్గు దగ్గేడు. ఆ అమ్మాయి తలెత్తి చూచి లోపలికి అహ్వానించింది. ఆమె ఎం. ఏ. లో తన క్లాస్‌మేట్ చంద్రావతి అని వెంకట్రాముడు గుర్తించేడు. ఆశ్చర్యం, సంకోచం, భయం వెంకట్రాముని మనసును ఆవహించేయి.

వాళ్ళిద్దరూ కూచున్నాక ఆమె వెంకట్రాముని వైపు తిరిగి అడిగింది–

"మీరెప్పుడొచ్చారు?"

"యిప్పుడే." సమాధానించటంలో వెంకట్రాముడు తడబడ్డాడు.

"వీరు?" దేవదానం వైపు చూస్తూ ప్రశ్నించింది.

"దేవదానం. మా వూరి స్కూల్లో బి. యిడి. అసిస్టెంట్. నాకెంతో కావలసినవారు."

ఆమె నమస్కరించింది. దేవదానం విస్తుపోతూ ప్రతినమస్కారం చేశాడు. ఆమె వెంకట్రాముని కెలా పరిచయమో దేవదానం వూహించుకుంటున్నాడు.

ఆమె నవ్వుతూ "వెంకట్రాముడుగారు నన్ను పరిచయం చేయలేదు" అంది.

వెంకట్రాముడు యిబ్బందిపడుతూ చంద్రావతిని దేవదానానికి పరిచయం చేసేడు–

"చంద్రావతిగారు. ఎం. ఏ. లో మా క్లాస్‌మేట్."

చంద్రావతి చొరవనుచూసి యిద్దరూ అవస్థపడుతున్నారు. వాసుకు చంద్రావతి యే రకం బంధువో, యెన్నడూ చూసినట్లు గుర్తులేదు అని దేవదానం ఆలోచనలో పడ్డాడు.

చంద్రావతి అంది-

"మీ సభలేవో వున్నట్లుంది యివాళ. మిత్రులొస్తే తను వచ్చేవరకూ కూచోమని చెప్పేరు బావ. తొందర్లోనే వస్తానని వెళ్లేరు. అందాకా యీ పత్రికలు చూస్తూ వుండండి- యిప్పుడే వస్తాను."

చంద్రావతి యింటోకి వెళ్లి పోయింది.

వెంకట్రాముని గుచ్చి గుచ్చి చూస్తూ దేవదానం మెల్లిగా అన్నాడు-

"బాగా సోషల్‌గా మాట్లాడుతుంది. ఎం. ఏ. చదివినాననే గర్వంలేదు. వీళ్ళది బాగా డబ్బున్న కుటుంబమని విన్నాను. యెంత సాదా దుస్తులు వేసుకుందో చూడు! సోగ నలుపుగా వున్నా చాలా బాగుంది. అపుడపుడు యిక్కడికి వస్తున్నాగానీ యీమె నెప్పుడూ చూల్లేదు. అనంతపురంలో కూడా చూచినట్లు గుర్తులేదు."

వెంకట్రాముడు మాట్లాడలేదు. రెండేళ్ళలో యే మూడు నాలుగు మాటలో మాట్లాడిన చంద్రావతి అంత చనువుగా మాట్లాడిందేమిటి అనే ఆశ్చర్యంలో వున్నాడు. అంత యిదిగా మాట్లాడినందుకు ఆనందంలో వున్నాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది- ఆశ్చర్యానంద తన్మయత్వంలో, యవ్వనోద్వేగంలో-

ఆ క్షణంలో వెంకట్రామునికి దిగులులాంటిది కలిగింది-

రెండేళ్ల వృధా అయినాయి. పుస్తకాల పురుగై తానేమీ పట్టించుకోలేదు. పుస్తకాల పురుగులు ఆడపిల్లల దీపాల దగ్గరకు పోవు. చనువు తీసుకొనివుంటే చంద్రావతితో పరిచయం పెరిగి వుండేదేమో! ఆమె సంస్కారం తనకు నచ్చింది. కానీ యూనివర్సిటీలో స్టూడెంట్సంతా పెద్ద 'టెక్కు'ది అనేవాళ్లు. అదేమీ లేదే! యూనివర్సిటీలో తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం పొక మాన సంరక్షణ కవచమేమో!

యింతకు మునుపు పొందని కొత్త అనుభూతులేవో తనకు విచిత్రంగా కలుగుతున్నాయి; యిప్పుడేదో గుండెల్లో కొత్తసవ్వడి విన్పిస్తోంది. చంద్రావతి తనతో పదినిముషాలు మాట్లాడిందో లేదో యీ కొత్త అనుభవం!

-తన ఆలోచనలకు, తన స్పందనలకు వెంకట్రామునికి నవ్వువచ్చింది.

దేవదానం వెంకట్రాముని నవ్వు పసిగట్టేడు. గుసగుసగా అన్నాడు-

"యూనివర్సిటీలో ఆ అమ్మాయి నీకు బాగా పరిచయమా?"

దేవదానం గుసగుసలోని అసూయను, ఆరాటాన్ని వెంకట్రాముడు గమ

నించలేదు. "అంత పెద్ద పరిచయంలేదు" అన్నాడు. అన్న తర్వాత అబద్ధ మాడేనా అనుకున్నాడు. నిజానికి చంద్రావతితో గాఢ పరిచయం వుండాలని మనసు కోరుతోంది. చంద్రావతితో పరిచయం పెంచుకొనే ఆలోచనలు వెంకట్రాముని కి అప్పుడే ప్రారంభమయ్యేయి.

గేటు తీసిన చప్పుడయింది. యిద్దరూ అటు చూచేరు. నిలబడ్డారు.

"వచ్చేరా? యెంతసేపైంది" అంటూ వాసు లోనికి వచ్చేడు.

"యిప్పుడే" అంటూ దేవదానం వెంకట్రామున్ని వాసుకు పరిచయంచేసేడు. వాసు నవ్వి అన్నాడు-

"అయితే మనకు మరో సభ్యుడు దొరికేడన్నమాట!"

—వెంకట్రామునికి వాసు నవ్వు నచ్చింది.

"సచ్చిదానందంగారు వచ్చినారా సార్?" దేవదానం వాసు నడిగేడు.

"వచ్చేరు. గెస్టుహవుస్‌లో వున్నారు."

"యింకా యెవరెవరు వచ్చినారు?"

"మన ప్రెసిడెంట్ పెంచలయ్యగారు వచ్చేరు. ఆయన యింకో మంచిపని చేసేరు. రాజంపేట ఎం.ఎల్.ఎ. చలపతిని వెంటబెట్టుక వచ్చేరు. చలపతిగారిని పబ్లిక్ మీటింగ్‌కు ప్రెసిడెంట్‌గా వుండమన్నాం. వొప్పుకున్నారు. యిలాటి పనుల్లో మన వుద్యమంమీద సానుభూతి చూపేవారినందర్నీ కూడగట్టుకు రావాలి- ముఖ్యంగా రాజకీయనాయకుల్ని. యేదో కేంప్‌కు వెళ్ళిన మన ఆనరరీ ప్రెసిడెంట్ డి.ఆర్.వో. ఓబయ్య గారు వస్తే అందరూ వచ్చినట్టే. యీ రెవెన్యూ వాళ్ళు పొద్దున లేచిన దగ్గరనుంచీ యెక్కడికి వెళతారో వాళ్ళకే తెలీదు. అనుకున్న టయానికి వచ్చే క్రమశిక్షణ మన డి.ఆర్.వో. ది. ఆయనపాటి వుత్సాహం, ఆదర్శాలు మన దేశంలోని అధికారులందరికీ వుంటే గాంధీగారు వూహించుకున్న రామరాజ్యం యెప్పుడో వచ్చేది.... మాటల్లోపడి మరిచేను. వుండండి. యిక్కడే భోంచేసి వెళ్దాం."

"వూరిదగ్గర్నే భోంచేసి వచ్చినాం సార్. మీరు కానివ్వండి."

"అయితే కాఫీ తాగుదురు." వాసు ఆత్మీయంగా అన్నాడు.

"తీసుకోండి" చంద్రావతి కాఫీ తెచ్చి వెంకట్రామునికి, దేవదానానికి యిచ్చింది.

"మా చంద్రావతికి తెలివితేటలు వుంది." వాసు నవ్వేడు. చంద్రావతి నవ్వింది.

"పది నిముషాల్లో భోంచేసి వస్తాను. మీరు మాట్లాడుకుంటూ వుండండి."

వాసు యింట్లోకి వెళ్ళేడు.

చంద్రావతి తానూ వొక కుర్చీలో కూచుంది. వెంకట్రాముడు కాఫీ ముగించి వొకమారు చంద్రావతి వంక చూసేడు. సంభాషణ యేవిధంగా మొదలు పెట్టాలో దిక్కు తోచక వెంకట్రాముని గుండెలు కొట్టుకుంటున్నాయి. అర్థ రహితంగా టీపాయ్ మీదవున్న వొక పుస్తకం తీసి చూడసాగేడు.

దేవదానానికి సిగరెట్టు తాగాలని మనసు పీకుతోంది. అరగంటనుంచీ కాల్చలేదు. జేబులో సిగరెట్లు లేవు. వాసు వస్తే ఆయన ముందు తాను కాల్చడు- ఆయనమీద గౌరవంకొద్దీ. వెంకట్రామున్ని, చంద్రావతిని వొంటరిగా వదలి వెళ్ళటం దేవదానానికి మనస్కరించలేదు. పురుష సహజమైన కుతూహలం వొకవైపు మనసులో పీకుతోంది. వెంకట్రాముని తోడుగా బయటకు తీసుకపోతే బాగుండుననుకున్నాడు. 'మర్యాద కాదే' అని సందేహించాడు. కాఫీ తాగేక సిగరెట్టు వెలిగించకుండా తానుండలేడు. సిగరెట్టు జయించింది. దేవదానం రోడ్డుమీదికి వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు. క్షమాపణ ధోరణిలో అన్నాడు-

"అయిదు నిముషాల్లో వస్తాను—అట్లా బయటకు పోయి."

వెంట్రాముడు తానూ వెంట వస్తాననలేదు.

చంద్రావతే మౌనాన్ని భగ్నం చేసింది.

"అంబేద్కర్ జీవితచరిత్ర చూస్తున్నారా?"

"యిటువంటి పుస్తకాల్ని చూడడం యిదే మొదలు"

"యూనివర్సిటీ లైబ్రరీలోనే యెప్పుడూ వుండేవాళ్ళుకదా - వేల పుస్తకాల మధ్య!"

"అన్నివేల పుస్తకాల మధ్య క్లాసు పుస్తకాలు మాత్రం చదువుతూవుండేవాణ్ణి. పైగా ఎప్పుడూ పుస్తకాలేనా అని హాస్టల్లో ఎగతాళి చేస్తోంటే తప్పించుకోటానికి లైబ్రరీలో గడిపేవాణ్ణి. క్లాసుపుస్తకాల్లో యీ రకంవి చేరలేదు కదా!"

వెంకట్రాముని నిజాయితీని చంద్రావతి మనసులో మెచ్చుకోకుండా వుండలేక పోయింది. చంద్రావతి తెలివితేటలపై వెంకట్రామునికి గౌరవం పెరిగింది.

చంద్రావతి మాట మార్చి అంది—

"గ్రూప్ వన్ సర్వీసెస్ ఎగ్జామినేషన్స్ రాసేరని విన్నాను. బాగా రాసేరా?"

"ఫర్వాలేదు. కానీ రిజల్ట్సు వచ్చిందాకా నమ్మకమేముంది అవి?"

"మీ వూళ్ళో యెలా పొద్దు గడుస్తోంది?"




యీ ప్రశ్నకు వెంకట్రాముడు వెంటనే సమాధానం చెప్పలేకపోయేడు. వెంకట్రామునికి తన స్థితి గుర్తుకొచ్చింది. తన దరిద్రం, కొట్టం, కుక్కిమంచం గుర్తుకొచ్చేయి. ఎం. ఏ. అయిపోయేక గత ఏడాదిగా తాను అనుభవిస్తున్న నరకయాతన స్మృతిలో మెదిలింది. వుద్వేగాన్ని సాధ్యమైనంత అణచుకోటానికి ప్రయత్నిస్తూ సమాధానించేడు.

"రాని యింటర్వ్యూలకోసం వుదయంపూట పోస్టాఫీసులో ఒకగంట, సాయంత్రం రెండు గంటలు—దేవదానంతో రోడ్డువెంట కబుర్లు, మిగతా రోజంతా మా యింటిముందు వేపచెట్టుకింద చదివిన పుస్తకాలే చదవడం!"

చంద్రావతికి పూర్తిగా అర్థంకాలేదు. కుతూహలంగా అడిగింది.

"మీది మరీ పల్లెటూరా?"

"షుమారైన వూరే."

"సినిమా హాలూ అదీ వుందా,"

"లేదు. మెయిన్‌రోడ్డు పక్కనే వుండడంవల్ల రెండు టీ బంకులు యీ మధ్య వచ్చినాయి. హైస్కూలుంది. ముగ్గురాళ్ళ గని వోనర్ల పుణ్యమా అని కరెంటు వచ్చింది. మా బ్రతుక్కు అదీలేదు.

చంద్రావతి "యెందుకు" అని అడగలేదు.

"పల్లెలను గురించి ప్రత్యక్షంగా నాకు తెలిసిందేమీ లేదు."

"తెలియకపోవడం ఒకరకంగా మంచిది." వెంకట్రాముడు నిరాశా పూర్వకంగా అన్నాడు.

"అదేం అలా అంటారు:" చంద్రావతి విస్మయం చెందింది.

"బాధపడే అవసరం వుండదు."

"అదేం మాట! టౌన్లలో, సిటీలల్లో బాధ లుండవా?"

"టౌన్లలో, సిటీలో సమాజం వేరు. అక్కడ యెవరి స్వేచ్ఛ వాళ్ళది. పల్లెల్లోని సమాజం అట్లాకాదు. అందరి మధ్యా వొకరకమైన సంబంధాలేవో వున్నట్లు కన్పిస్తాయి. కానీ ఆ సంబంధాలను కులం ఆడిస్తూ వుంటుంది.... ఆ రకమైన రొంపి అనుభవానికొస్తేగానీ అందులో యాతన అర్థంకాదు. పైగా యీ చదువువల్ల మా యింట్లో నేను పరాయివాణ్ణి."

వెంకట్రాముని మాటలు చంద్రావతికి అంతుపట్టలేదు. కానీ వాటి వెనుక వుండే ఆవేదనకు ఆమె స్పందించింది.

వాసు యింట్లోనుంచి వచ్చేడు. "దేవదానం యెక్కడికి వెళ్ళేడు" అని అడిగేడు.

"యిప్పుడే వస్తానని అట్లా బయటికి పోయినాడు."

"సిగరెట్టు కోసం వుంటుంది. యేం లాభమో కానీ తెగ వూదుతారు- యీ సిగరెట్టు తాగేవాళ్ళు. వీళ్ళను చూసినప్పుడల్లా మసినిండిన లాంతరు గ్లాసుల్లాగా వాళ్ళ గుండె లయిపోతాయని నేనే భయంతో వొణికిపోతాను. మరి వాళ్ళకు భయమున్నట్లు కనపడదు. డబ్బూ దండగే. ఆరోగ్యానికీ ప్రమాదమే. నువ్వు చెప్పు దేవదానానికి."

"అందరూ నీలాగే వుండటం సాధ్యమని యెందుకనుకుంటావు బావా?"

"నేను అనుకోలేదే. నా మీద దండయాత్రంటే నీ కిష్టం."

"అపుడే హిస్టరీ లెక్చరరు భాష మొదలు-"చంద్రావతి నవ్వింది.

"అవును. మేం మీ ఆంత్రోపాలజీ వాళ్ళలాగా కేవలం కార్య కారణాల్ని మాత్రమే చర్చించం. ఫలితాలను గూర్చి హెచ్చరించటం మా ధర్మం."

"ఆంత్రోపాలజీ వాళ్ళం యిద్దరమున్నాం. నువ్వొక్కడివే."

"వెంకట్రాముడు కూడా ఆంత్రోపాలజీ అన్నమాట."

"అన్నమాట కాదు. మరదలు మాట. వెంట్రాముడుగారు ఎం.ఏ.లో నా క్లాస్‌మేట్."

"అలాగా! మీరిద్దరికి యింతకు ముందే పరిచయమన్నమాట! ప్లెజెంట్ సర్‌ప్రయిజ్!"

"అన్నమాటా?"- చంద్రావతి పరిహాసంగా యెత్తిపొడిచింది. ముగ్గురూ మనస్ఫూర్తిగా నవ్వేరు.

"వెంకట్రాముడుగారు మంచి యింటలిజెంట్. బాగా చదివేవారు. సెకండ్ క్లాస్ రావటమే మా కందరికీ ఆశ్చర్యం! ప్రీవియస్‌లో ఫస్ట్‌క్లాస్ వచ్చింది."

చంద్రావతి ప్రశంసకు వెంకట్రాముడు గాలిలో తేలిపోయేడు. ఆమె వైపు ఆశ్చర్యంగా చూస్తూ మెచ్చుకోలుగా అన్నాడు-

"నా సంగతి పోనీండి సార్! చంద్రావతిగారికి రేంక్ వస్తుందనుకున్నాం. ఆమెకు కూడా సెకండ్ క్లాస్ రావటం!"

"ఆంత్రోపాలజీ స్టూడెంట్లు మీరు. కారణాలు చెప్పండి"- వాసు చంద్రావతి వైపు చూస్తూ కవ్వించేడు.

"మీరూహించే కారణాలు మాత్రం మా డిపార్ట్‌మెంటుకు వర్తించవు బావా! మా యూనివర్సిటీకి పెద్దపేరు వచ్చింది, వొకటి రెండు డిపార్ట్‌మెంట్లతోనే- కులాన్నిబట్టి మార్కులిస్తారని; వుద్యోగాలొస్తాయని. సరిగ్గా పరీక్షల ముందు స్టూడెంట్ ట్రబుల్స్, పరీక్షలు నాలుగుసార్లు వాయిదా పడ్డాయి. ఆ వాతావరణంలో చదవటంకన్నా, నరకంలో వుండటం మేలు.

చంద్రావతి తెలివితేటలకు వెంకట్రాముడు విస్తుపోయేడు.

"సరే బావుంది. వొప్పుకుంటాను. మరి మీ యూనివర్సిటీలో స్టూడెంట్ ట్రబుల్స్‌కు కారణాలు చెప్పలేదు."

చంద్రావతి నవ్వులాటగా అంది-

"నాతో కారణాలు చెప్పించి కుల నిర్మూలన సమితి అవసరంమీద లెక్చరు దంచాలని మీరు. మీతో వాదనకు నేను దిగలేను. క్షమించండి.... బావకు నన్ను వాగించటం యిష్టం."

"యెవరి ఆలోచనల లోతైనా కనుక్కోవచ్చునేమో కానీ నిన్ను అర్థంచేసుకోవటం గొప్ప చిక్కు."

"స్త్రీ యెవ్వరూ పూర్తిచేయలేని వొక పజిల్ అనండి సరిపోతుంది."

"ఆడవాళ్లు పజిల్లు అనటానికి నేనేం కవినికాదు. నాకు 'కీ సొల్యూషన్' దొరకని పజిల్ యేదైనావుంటే అది మొత్తం మీ యువతీ యువకులు. మీ తరం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వచ్చిన తరంతో నిండిన సంఘం! మిమ్మల్ని చూస్తే వొక్కోసారి ఆనందమవుతుంది— సమస్యల్ని మాకంటే లోతుగా చూస్తున్నారని. వొక్కోసారి భయమేస్తుంది— మీ గమ్యంలేని అశాంతి, ఆచరణ లేని ఆలోచనలు గమనిస్తూంటే. చాలాసార్లు మీ స్వార్థం...."

యెవరి నుద్దేశించి వాసు మాట్లాడుతున్నాడో వెంకట్రాముడికి అర్థంకాలేదు. చంద్రావతి నుద్దేశించి కావచ్చు; మొత్తం యువతరాన్ని గురించి కావచ్చు ననుకుంటూ కల్పించుకున్నాడు—

"అన్నిటిమీదా నమ్మకంపోయిన వాళ్ళకు అశాంతేకద సార్! అశాంతిలో దిక్కుతోచని తత్వం వుంటుంది కానీ ఆచరణ యేముంటుంది? స్వార్థానికి మరేవో సామాజిక కారణాలు వుండాల."

"చంద్రా! లోపలికిలా రా"- లోపలినుంచి కొంచెం కరుకైన స్వరం పిలిచింది. వాసు వులికిపాటు వెంకట్రాముడు గమనించేడు.

"వస్తానండి. అక్క పిలుస్తోంది. నాకు పనుంది. అపుడపుడూ రండి. మీ వూరు దగ్గరేగా."

చంద్రావతి లోపలికి వెళ్ళిపోయింది.

దేవదానం బయటినుంచి వచ్చేడు. వరండాలో వెంకట్రాముడు, వాసు మాత్రమే వుండటం చూసి సంతృప్తిపడ్డాడు.

వాసు టైం చూసుకుంటూ అన్నాడు-

"సరి, మాటల్లో పడితే యింతే. రెండున్నర అయింది. నాలుగు గంటలకు జనరల్‌బాడీ మీటింగ్- ట్రావలర్స్ బంగళాలో. ఆరు గంటలకు రామకృష్ణ సమాజంలో పబ్లిక్ మీటింగ్.... ముందు నేను డి. ఆర్. వో. వచ్చేరో లేదో కనుక్కుంటాను. అంగావి కూడా రావాలి. వస్తానని రాసేడు. పబ్లిక్ మీటింగ్ అయ్యేక తీరిగ్గా మాట్లాడుకుందాం. వీలుంటే మీరు టి. బి. దగ్గరకు రండి. యేర్పాట్లన్నీ అయ్యాయనుకుంటాను. యీపాటికి మన జాయింట్ సెక్రటరీ రాశ్రీమ వచ్చి వుంటాడు.

ఫాదర్ స్టీఫన్ దగ్గరకు వెళ్ళి ఒక అరగంటలో అక్కడినుంచి నేరుగా టి. బి. కి వస్తాం సార్."

"ఫాదర్ కూడా మీటింగుకు వస్తాడనుకుంటాను. అదీ మంచిదే. వీలుంటే ఆయనను రమ్మనండి. ఆయన వెంట నలుగురో, అయిదుగురో వస్తారు. ఆడియన్స్ బాధ వుండదు."

దేవదానం తల వూచేడు. ఆడియన్స్ బాధ యేమిటో వెంకట్రామునికి అర్థం కాలేదు. అంగావి, రాక్రీమ- ఆ పేర్లేమిటో దిక్కుతోచలేదు. యీ సమావేశం పుణ్యమా అని చంద్రావతిని కలిసే అదృష్టం కలిగినందుకు, సంస్కారుల మధ్య తాను కూడా వొక వ్యక్తిగా మసలగలుగుతున్నందుకు, తన అస్తిత్వానికేదో గుర్తింపు వస్తున్నందుకు వెంకట్రామునికి సంతోషంగా వుంది. తనవెంట కడపకు తీసుకొని వచ్చినందుకు దేవదానంమీద వెంకట్రామునికి కృతజ్ఞతా భావం కలిగింది.

ఫాదర్ స్టీఫన్ కోసం యిద్దరూ మరియాపురం బయలుదేరేరు.

వెంకట్రామునికి వుల్లాసంగా వుంది. తనకోసం కొత్త అనుభవద్వారాలు తెరచుకున్నాయని అనిపించింది. యీ ప్రపంచంలో తనుగా చెయ్యగలిగేదేమిటి అనే వితర్కం కూడా యే మూలో వెంకట్రాముని మనసులో పొడసూపింది.

## 3

వెంకట్రాముడు తన కుతూహలాన్ని ఆపుకోలేక దేవదానాన్ని అడిగేడు -

"అంగావి యెవరు? రాక్రీమ యెవరు?"

"అంగావి అనే ఆయన వొక సంఘసేవకుడు. ఆయనకు అదెక్కడో ఆశ్రమం వుంది."

"అదేం పేరు?"

"అంబేద్కర్ గాంధీ వినోభా! ఆయన పేరు నారాయణాచారి అయితే యిటీవల పేరు మార్చుకున్నాడు."

"రాక్రీమ?"

"రామ క్రీస్తు మహమ్మదు. వీరబ్రహ్మం అని సోషల్ వెల్ఫేరు ఆఫీసుక్లర్కు పెట్టుకున్న పేరు. మా జాయింట్ సెక్రటరీ"

"వాసూ, మీరంతా పేరెందుకు మార్చుకోలేదు. కుల నిర్మూలన సంఘ సభ్యులు పేర్లు మార్చుకోవాలా?"

"అదేం లేదు. అదొక చాదస్తం. కుల నిర్మూలన కోసం కృషి చేస్తే చాలు."

"చాద స్తమెందు కవుతుంది?"

"యెందుకు కాదు. దానికంటే నంబర్లు పెట్టుకోవడం మేలు కాదా?"

"అట్లాగా! తమాషా అయిన వ్యక్తులు పరిచయమవుతున్నారు, నీవల్ల. ఫాదర్ స్టీఫన్ చర్చి ఫాదరేనా?"

"కడపలోనే చదివినావు నీకు తెల్దా?"

"నాకేం తెలుసు? మొన్న మొన్నటిదాకా చదువు తప్ప బయటి ప్రపంచం నాకేమిటో తెల్దు"- వెంకట్రాముడు నొచ్చుకుంటూ, తానేదో పోగొట్టుకొన్నట్లు బాధపడ్డాడు.

"మనవాళ్ళ కోసం రాత్రింబవళ్ళు కష్టపడే సోషల్ వర్కర్ ఫాదర్ స్టీఫన్! ఫాదర్ స్టీఫన్ జిల్లా షెడ్యూల్డు కులాల కార్మిక సంఘం అధ్యక్షుడు. మంచి పలుకుబడి వుంది. మా చెల్లెలు మేరీ చదువుకెంతో సాయపడినాడు.

ఆ తర్వాత ఆమె సెకండరీగ్రేడ్ అయ్యిందంటే ఆయన సాయంవల్లనే. ఆమె వుద్యోగ విషయమే యిప్పుడు పెద్ద సమస్య అయింది."

"జిల్లాపరిషత్‌లో దొరక లేదా?"

"ఆ ఆశ లేదు. పదేళ్ళనుంచీ కొన్ని వందలమంది ఖాళీగా వున్నారు."

"యిప్పుడేం చెయ్యాలని?"

"అదే ఆలోచన తెగకుండావుంది. ఫాదర్ మన వూళ్ళో కూడా వొక సంఘం పెట్టమంటాడు. కానీ కుదరలేదు."

"యెందుకని?"

"మనకు ఆదర్శాలుంటేనే సరిపోతుందా? పరిస్థితులు చూసుకోవాలి. నేనేమో హైస్కూలు టీచర్ని. మీ వూరికి వచ్చింది యీ యేడే. యిట్లాంటివాటిలో జోక్యం కలుగజేసుకుంటే వూళ్ళో పెద్దరైతుల కండ్లు నామీద పడతాయి."


"పెద్దరైతులు యేంచేస్తారు?"— వెంకట్రాముడు బింకంగా అడిగేడు.

"మీ వూరు ఆవిషయమై జుట్లు ముడివెయ్యడంలో సామాన్యమైంది కాదు. దగ్గరగావుండి చూస్తావు కదా?"

జిల్లా పరిషత్ క్వార్టర్స్ ప్రాంతంలో వెనుకవైపు నుంచి దేవదానాన్ని యెవరో పిలిచేరు. వెంకట్రాముడు, దేవదానం వెనక్కి తిరిగి నిలిచేరు. దేవదానం విసుగ్గా గొణిగేడు —

"వీడెదురయ్యాడు?"

"యెవరతను?"




"పుల్లయ్య అని....."- యేం చెప్పాలా అని ఆలోచిస్తూవుండే లోపులే పుల్లయ్య వాళ్ళ దగ్గరకు వచ్చేడు.

"యెప్పుడొచ్చినావు? యితనెవరు? కులాన్ని నిర్మూలించడాని కొచ్చినారా?"

"మాకు అర్జెంటు పనుంది. తర్వాత కలుసుకుందాం"- దేవదానం పుల్లయ్య బారినుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేసేడు.

పుల్లయ్య వదిలేరకం కాదు. పంచాంగం విప్పేడు.

"మీ పని నాకు తెలుసులే. తైరు సంఘమే కదా- యెప్పుడోసారి మనకు పనికిరాకపోతారా అని. సభల్లో అంతకంటే మీరు చేసేదేముంది? కాకపోతే యెవడో వాకడు పైనుంచీ వచ్చినోని జొల్లుకూతలు!- రెడ్డి, శాస్త్రి పేర్లలో వుండకూడదు, వర్ణాంతర వివాహాలు ప్రోత్సహించాల, ప్రభుత్వ సన్మానాలు అందుకోవాల అని. బ్లాక్‌మార్కెట్ చేసేవాళ్ళు, లంచాలోండ్లు, సొంత పని గాండ్లు యీ దొంగ నా కొడుకులే కదా ఆడికి వచ్చేది. అందరికీ కుల పిచ్చోడు వాసు జతైనాడు. మీ అందరిమీద పాంప్లెట్లేసి గబ్బు పట్టించాల."

"నీ పని మొదట్నుంచీ అంతేలే. నువ్వింతకంటే పొడిచేదేముంది? తాగే నీళ్ళలో....."

-దేవదానం కోపం దిగమింగుకున్నాడు.

అంతలో పుల్లయ్యను మరెవరో "పుల్లయ్య సామీ" అని పిలిచేరు. పోతూ పోతూ పుల్లయ్య దేవదానంతో అన్నాడు-

"నువ్వెట్లాగా చెడిపోయినావు. అందరినీ యెందుకు చెడగొడ్తావు?"

షాక్ తగిలినట్లు కాసేపు దేవదానం మాట్లాడలేదు. "పద" అన్నాడు.

వెంకట్రాముని అంచనాకు పుల్లయ్య లొంగలేదు. యెవరో విపరీతమైన మనస్తత్త్వం వున్నవాడు లాగున్నాడు అనుకున్నాడు. వెంకట్రామునికి అతని గురించి వివరాలు అడగాలనేవుంది. అడగబుద్ధి కాలేదు. యెదురుగా నవ్వుకుంటూ వస్తున్న ముగ్గురమ్మాయిలను చూచి వెంకట్రాముడు గూఢంగా అన్నాడు-

"యీ రెండు మూడేండ్లలో కడప బాగా మారింది."

"యెట్లా?" దేవదానం అన్యమనస్కంగా ప్రశ్నించేడు.

"మీటింగ్ యెప్పటికవుతుందో? రాత్రి లాస్ట్ బస్ అయినా మనకు దొరుకుతుందా?"

"అప్పటికి చూద్దాంలే. మించిపోయిందేముంది?"

"లేనిపోని ఖర్చు."

"రోజూ పెడుతున్నామా?"

యెవరికేం మాట్లాడాలో తోచలేదు. దేవదానం సిగరెట్టు ముట్టించేడు. ఫాదర్ స్టీఫన్ లేడని తెలుసుకున్నారు. యిద్దరూ తిరుగుముఖం పట్టేరు. మునిసిపల్ టి. బి. చేరుకున్నారు. అక్కడ యే సందడీ లేదు.

టి. బి. లో యెడమపక్క కాంపౌండ్ గోడ నానుకొని వున్న వేపచెట్టు కింద యిద్దరూ నిలబడ్డారు.

వెంకట్రామునికి యేదో నిరుత్సాహం ఆవహించింది. మరేదో పోగొట్టు కున్నట్లుంది. కలయచూస్తూ అన్నాడు-

యిదేదో వొకరిద్దరికి పట్టిన వ్యవహారంగా వుంది. యింకా యెవ్వరూ రాలేదు.

దేవదానంనుంచి సమాధానం రాలేదు. వెంకట్రాముడు పక్క కాంపౌండ్‌లోని చర్చిని, సెయింట్ అంథోని యిండస్ట్రియల్ యెస్టేట్‌ను పరికించటంలో నిమగ్నుడయ్యేడు. ముఖ్యంగా యిండస్ట్రియల్ యెస్టేట్! చిన్నతమ్ముని యిందులో చేరిస్తే కొంతయినా బాగుపడతాడనిపించింది, వెంకట్రామునికి. యీ విషయం ఆలోచించాలి అనుకున్నాడు.

యెడమవైపు గేట్లోంచి నెమ్మదిగా వస్తున్నవాళ్ళను యిద్దరూ గమనించేరు. పది పదిహేనుమంది టి. బి. వరండాలో నిలబడ్డారు. వెంకట్రామునికి వాళ్ళలో తెలిసినవాళ్లంటూ లేరు.

"మనమూ అక్కడికి వెళ్లి నిల్చుందాం రా" అన్నాడు దేవదానం.

అక్కడికి వెళ్లటానికి, తెలియని ఆ గుంపులో కలవటానికి వెంకట్రామునికి మనస్కరించలేదు. బావుండదని "సరే" అన్నాడు.

దేవదానాన్ని యెవరో పిలిచి పక్కకు లాక్కుపోయేరు.

తనకిదేం జబ్బో నలుగుర్లో అరమరికలు లేకుండా తాను కలవలేదు, వెంకట్రాముడు. ఆ కొత్త లోకంలో వూపిరి సలపలేదు.

రెండు కార్లు వచ్చి ఆగేయి. వాటిలోంచి పదిమంది దిగేరు. నేరుగా వాళ్ళు మధ్య హాల్లోకి నడిచేరు. మిగతావాళ్ళు అనుసరించేరు.

వో మూల గోడకు అనుకుని యిద్దరూ కూర్చున్నారు. వెంకట్రాముడు హాలంతా కలయ చూసేడు. చంద్రావతి యెందుకు రాలేదో అని నిరుత్సాహ పడ్డాడు. సభలో యిద్దరు ఆడవాళ్లున్నారు: నడివయసులో వున్నా, నలుగురి దృష్టిని ఆకర్షించే విధంగా అలంకరించుకున్న వొకావిడా, ఆమెకు చెలికత్తెలా వుండే మరొక అమ్మాయి వెంకట్రాముని దృష్టిని ఆకర్షించేరు. ముఖ్యంగా వాళ్ల వాలకం వెంకట్రామునికి అనుమానాస్పదమైంది. దేవదానం చెవి కొరికేడు —

"యెవరు వాళ్ళు?"

వెంకట్రాముని కళ్ళ సైగను దేవదానం పసిగట్టి జవాబిచ్చేడు—

"పెద్ద కథలే. వొక స్కూలు కరెస్పాండెంట్. పేరు పుల్లమ్మ. యీమె నడిపే అనాథశరణాలయం యీ జిల్లాలో అందరికీ తెలుసు. ఆమె రాని మీటింగు వుండదు; ఆమె సహాయం పొందని సంఘాలు జిల్లాలో లేవు."

"ఆ అమ్మాయి?"

"తర్వాత చెప్తాలే."

వీళ్ళ వెనుక ఏదో రహస్యం వుంటుంది అనుకున్నాడు వెంకట్రాముడు. వీళ్ళంతా కులనిర్మూలన చేస్తారని వెంకట్రామునికెందుకో నమ్మకం కలుగలేదు. యెందుకు నమ్మకం కలుగలేదో దానికి కారణాలు మాత్రం వెంకట్రాముని బుర్రలో గజిబిజిగా వున్నాయి.

యిక్కడున్న ప్రేక్షకులంతా తానున్న పరిస్థితుల్లో వుంటే యేం చేస్తారు అనే ఆలోచన వెంకట్రామునికి కలిగింది. మాదిగిండ్ల మధ్య వాళ్ళను వూహించుకున్నాడు. వాళ్ళ మధ్య వాడలోని మనుష్యుల్ని వూహించుకున్నాడు.

మురికి-పరిశుభ్రతా; దరిద్రం-సుఖవిలాసాలు; అమాయకత్వం-గడుసుదనం; చీకటి-వెలుగు....

వెంకట్రాముని నలుపు-తెలుపు వూహాచిత్రం యెంతకూ పూర్తికాలేదు.

## 4

కడపజిల్లా కుల నిర్మూలన సర్వసభ్య సమావేశం మొదలయింది. వెంకట్రాముడు పరిశీలకుని స్థాయిలో సమావేశంలో వున్నాడు. సభకు వచ్చిన

వాళ్ళలో చాలామంది పరిశీలకులే. ప్రధాన అతిథి, రాష్ట్ర అధ్యక్షులు సచ్చిదానందంగారిని, అధ్యక్షులు ఎం. ఎల్. ఏ. పెంచలయ్యగారిని, కార్యదర్శి వాసు గారిని, జిల్లా సంఘం గౌరవాధ్యక్షులు డి.ఆర్.ఓ. ఓబయ్యగారిని తమ తమ ఆసనాలు అలంకరించవలసిందిగా, సంఘ సంయుక్త కార్యదర్శి రాత్రీమ వేదిక మీదికి ఆహ్వానించేడు.

కార్యక్రమం మొదలయింది.

సచ్చిదానందం తన సందేశంలో, కులనిర్మూలన విషయంలో ప్రభుత్వ సహాయ సానుభూతులను శ్లాఘించేడు. సాంఘిక సంక్షేమ శాఖామంత్రివర్యులు, తదితర మంత్రుల సమక్షంలో, హైద్రాబాదులో, గత యేడాది సంఘం జరిపిన అయిదు కులాంతర వివాహాలను, వొక మతాంతర వివాహాన్ని ప్రస్తావించేడు. ప్రతి జిల్లా సంఘం యీ విషయమై ముందుకు రావాలనీ, కనీసం ప్రతి జిల్లాలో యేడాదికి మూడు నాలుగు వర్ణాంతర వివాహాలను జరపటానికి స్థానిక సభ్యులు కంకణం కట్టుకోవాలనీ అభ్యర్థించేడు. ఆయా జిల్లాల కుల నిర్మూలన సంఘాలు సంఘంయొక్క ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే, వుద్యోగాలవంటి విషయాల్లో వర్ణాంతర వివాహం చేసుకున్న యువతీ యువకులకు ప్రభుత్వ సహాయ సంపత్తులు అందేలాగు రాష్ట్ర నాయకత్వం ప్రయత్నించగలదనీ సచ్చిదానందం వుద్ఘాటించేడు.

సచ్చిదానందం సందేశం తరువాత, కార్యదర్శి నివేదికను వాసు ప్రవేశ పెట్టేడు. గత యేడాది ఆచరణపూర్వకమయిన కార్యక్రమాలను సంఘం చేపట్టలేకపోయినందుకు చింతిస్తూ, ఆ యేడాది జరిగిన రెండు మూడు సమావేశాలను ప్రస్తావించి, ముందు ముందు కడప జిల్లా సంఘం శక్తివంచనలేని కృషి చేస్తుందని హామీ యిచ్చేడు.

తర్వాత రాత్రీమ తీర్మానాలను ప్రవేశపెట్టేడు. అధ్యక్షుడు వాటిపై చర్చలను ఆహ్వానించేడు.

యీ సందేశాలూ, నివేదికలూ, తీర్మానాలూ, కొంత అపరిచితంగా కన్పిస్తున్నా అక్కడి వాతావరణం వెంకట్రాముని కి వుత్తేజకరంగా వుంది.

"నువ్వు మాట్లాడు." దేవదానం మెల్లగా వెంకట్రాముడ్ని పొడిచేడు.

పూనకం వచ్చినవాడిలాగా వెంకట్రాముడు మాట్లాడటానికి లేచేడు.

"మాట్లాడతావా? యిక్కడికి వచ్చి మాట్లాడు." అధ్యక్షుడు పిలిచేడు.

వెంట్రాముడు టేబులు పక్క నిలబడి మాట్లాడసాగేడు.

"తీర్మానాలన్నీ చాలా బాగున్నాయి. కులాన్ని సూచించే రెడ్డి,శాస్త్రి,నాయుడు మొదలైనవాటిని వదలిపెట్టాలనే తీర్మానాలను చేయాలనుకునే మనం కొన్ని సంగతులు ఆలోచించడంలేదు. మనుషుల పేర్లు మాత్రమే మార్చాలంటుంది యీ తీర్మానం. కులం తెలిపే మనుషుల పేర్లతో, కులాల పేర్లతో యేర్పడిన వూరి పేర్లను, వీధుల పేర్లను మనం యేం చెయ్యాలి. వాటిని మార్చే సంగతేమిటి? అసలు పేర్లే లేని హరిజనవాడల గోడు యీ తీర్మానం పట్టించుకోలేదు. అస్థిత్వం లేకుండా మాదిగిండ్లనీ మాలిండ్లనీ, తరతరాల నీచత్వాన్ని సూచించే పేర్లు కొనసాగాల్సిందేనా? పెద్దకులాలవాళ్ళు హరిజనులను అమ్మా అబ్బాడు పెట్టిన పేర్లతో కాకుండా నోటికొచ్చిన పేర్లతో పిలవాల్సిందేనా? ప్రభుత్వ రికార్డులుసైతం వాటిని నమోదు చెయ్యాల్సిందేనా? అడుగడుగునా హరిజనులు పొందే అవమానాలు చాలవని యిక్కడకూడా యీ విషయాలు పట్టించుకొనకపోతే.... యింతకంటే నేను మాట్లాడాల్సింది లేదు."

—వెంకటాామిుడు విద్రలో నడిచేవాడిలాగా వెళ్ళి దేవదానం పక్క కూచున్నాడు. 'నేనేనా మాట్లాడింది–యింతసేపు' అనుకున్నాడు. వెంట్రాముని గుండె యేదో వింత శబ్దం చేస్తూ అతనికే విన్పిస్తోంది.

"బ్రహ్మాండంగా మాట్లాడినావు." దేవదానం వెంకట్రాముడ్ని మెల్లిగా ప్రశంసించేడు.

"రెండు మాటలు మాట్లాడటానికి అధ్యక్షులు అనుమతిస్తారనుకుంటాను." అంటూ సచ్చిదానందం లేచేడు. సభ అధ్యక్షుడు అంగీకారసూచకంగా చిరునవ్వు నవ్వేడు.

"యువ మిత్రుడు యెంతో ఆవేదనతో, చిత్తశుద్ధితో ప్రకటించిన అభిప్రాయాలతో నేను సంపూర్తిగా యేకీభవిస్తున్నాను. తీర్మానంలో యీ విషయాన్ని మనం పొందుపరుద్దాం. యీ తీర్మానాన్ని నేను ప్రభుత్వదృష్టికి తెస్తాను. యీలోపు జిల్లా సంఘం హరిజనవాడల్లో మన సభ్యులచేత సమావేశాలు యేర్పాటు చేయించి, కులాతీతమైన పేర్లు పెట్టించాలి– యిలా ప్రభుత్వదృష్టిని ఆకర్షించవలసి వుంటుంది. అప్పుడు ప్రభుత్వ శాసనం చేయించే అవకాశం కూడా మనకు లభిస్తుంది. మన యువ మిత్రుడులాంటి.... మీ పేరు?"

సచ్చిదానందం ప్రశ్నకు దేవదానం వుత్సాహంగా సమాధాన మిచ్చేడు–

"వెంకట్రాముడు."

"మిమ్మల్నికాదు అడిగింది, మీ పక్కనున్న మిత్రుణ్ణి."

"అతని పేరేనండి నేను చెప్పింది వెంకట్రాముడని."

సచ్చిదానందంతో సహా సభ అంతా నవ్వేరు. నవ్వుల మధ్య సచ్చిదానందం- "వెంకట్రాముడూ! మీలాంటి చదువుకున్న యువకులు చొరవ తీసుకోవాలి" అన్నారు.

"తీసుకుంటాను తప్పకుండా"- వెంకట్రాముడు ప్రతిజ్ఞచేస్తున్న ధోరణిలో ఆవేశంగా అన్నాడు.

సచ్చిదానందం, వాసు, దేవదానం మరో ముగ్గురు నలుగురు తప్ప సభలో వెంకట్రాముడ్ని మనసారా మెచ్చుకొన్నవాళ్ళు లేరు. ఓబయ్య, పెంచలయ్యలకు యీ ప్రతిజ్ఞ నచ్చలేదు. సాఫీగా జరిగే వ్యవహారాల్లో గొడవలు తెస్తారు వీళ్ళు' అని మొత్తం యువకుల్ని వుద్దేశించి వాళ్ళిద్దరూ అనుకున్నారు.

మాట్లాడేందుకు వొక యువకుడు లేచేడు.


"అనుమతిస్తే రెండు మాటాలు మాట్లాడతాను"- అన్నాడు.

తొందరగా సమావేశం పూర్తికాకుండా యేమిటీ పనికిమాలిన చర్చ అని సందేహిస్తూనే సభాధ్యక్షుడు ఓబయ్య మాట్లాడేందుకు ఆ యువకునికి అవకాశం యిచ్చేడు.

ఆ యువకుడు యే విధమైన వుద్రేకానికీ లోనుకాకుండా నెమ్మదిగా వుపన్యసించేడు.

"కార్యదర్శి తీర్మానం బాగుంది. వెంకట్రాముని సవరణ మంచిదే. అడుగడుగునా హరిజనులు పొందే అవమానాలను- ఆఖరుకు పిలుపుల్లో కూడా వెంకట్రాముడు ప్రస్తావించినాడు. నిజమే. ఆ బాధ అనుభవించినవాళ్ళకు తప్ప అర్థంకాదు. కానీ అంతకంటే ఘోరమైన అవమానం హరిజనులకు యిండ్ల పట్టాలు వూరి బయట యివ్వడం, వూరి బయటనే యిండ్లు నిర్మించడం, బావులు తవ్వించడం. హరిజనుల దేవాలయ ప్రవేశంలో, అంటరానితనం నిర్మూలన విషయంలో, యెన్నో బాధలుపడిన మహాత్ముడు యిప్పుడు జీవించి వుంటే హరిజనులు గ్రామం మధ్యలో అందరితోపాటు జీవించే యేర్పాట్లకోసం ప్రయత్నించి వుండేవాడు. అటువంటి చట్టం కోసం యీ సంఘం ప్రయత్నించే విధంగా తీర్మానాన్ని సవరిస్తుందని ఆశిస్తున్నాను. అట్లాగే యీ సందర్భంలో కుల నిర్మూలన సంఘం తన కార్యక్షేత్రంగా పట్టణాల్ని కాకుండా గాంధీజీ చెప్పినట్లు పల్లెల్ని యెన్నుకుంటే బాగుంటుంది."

ఒక మూలనుంచి మరొక కుర్రవాడు లేచి "వీరదాసు అభిప్రాయాలను నేను బలపరుస్తున్నాను. తీర్మానంలో చేర్చండి" అని కూర్చున్నాడు.




వెంకట్రామునికి వీరదాసు అభిప్రాయాలు చాలా బాగున్నాయనిపించింది. తనకింకా అనుభవం తక్కువ అనుకున్నాడు.

సభాధ్యక్షుడు డి. ఆర్. ఓ. గుండె అదిరింది.

—యీ తీర్మానం ప్రభుత్వం ఆమోదిస్తే యింకేమైనా వుందా? పల్లె పల్లెల్లో గలటాలు, ఖూనీలు!

—ఆ దృశ్యం డి. ఆర్. ఓ. కళ్ళల్లో మెదిలింది.

యీ తీర్మానంలోని రాజకీయాన్ని ప్రభుత్వం పసిగడితే యిటువంటి సభలతో యెందుకు సంబంధం కల్గించుకున్నావంటూ పైనుంచి తాఖీదులు వస్తాయి- యెంత ఎం. ఎల్. ఎ. లు పెంచలయ్య, చలపతుల చలవవున్నా. పైగా తాను ప్రొమోటీ. యీ బంజరుభూములు, యిండ్ల పట్టాల గొడవలే దిక్కుతోచటం లేదు. వుద్యోగాలో పాడో చూపించకుండా పల్లెల్లో గొడవలు లేపటం పనికిమాలిన పని. వీడెవడో వీరదాసు, వీణ్ణి వోకకంట కనిపెట్టమని ఎస్. పి. కి చెప్పాలి.

-ఓబయ్య అసహనంగా పెంచలయ్యవైపు చూసేడు.

పెంచలయ్యకు యీ విధంగా తీర్మానం చెయ్యటమయితే బాగుందనిపించింది కానీ యీ మార్పులన్నీ వస్తే రిజర్వుడు నియోజకవర్గాలు వుంటాయో లేదోనని అనుమానం వచ్చింది. రిజర్వుడు నియోజకవర్గాలు పోతే పెద్ద పెద్ద వాళ్ళతో తలపడడం యెంత కష్టం అనుకుంటూ వాసువైపు చూసేడు.

వాసు నిస్సహాయంగా సచ్చిదానందం వైపు చూసేడు.

"యువమిత్రుడు వీరదాసు అభిప్రాయాలను తీర్మానంలో పొందుపరచటం పట్ల వ్యక్తిగతంగా నాకు అభ్యంతరంలేదు. కానీ యిటువంటి తీర్మానం రాష్ట్ర కౌన్సిల్‌లో చేయటం బాగుంటుంది. యేమంటారు."

—సచ్చిదానందం జోక్యాన్ని చాలామంది హర్షించేరు.

వీరదాసు మళ్లీ మాట్లాడలేదు. నిమ్మకు నీరెత్తినట్లు కూచ్చున్నాడు. అత నేమంటాడో అని యెదురుచూస్తున్న వెంకట్రాముడు వీరదాసు గాంభీర్యాన్ని మనసులోనే మెచ్చుకోకుండా వుండలేకపోయేడు.

గండం గడిచింది. వీరదాసు బృందం యే గొడవలూ సృష్టించి సభను పాడు చెయ్యలేదు అనుకున్నాడు వాసు.

ఓబయ్య, పెంచలయ్యలు సంతోషించేరు.

సభ్యుల అనుమతితో కొత్త కార్యవర్గం సభలో ప్రవేశపెడుతున్నానని, పాత కార్యవర్గమే ఈ సంవత్సరం కూడా కొనసాగుతుందనీ, కొందరు యువ మిత్రులకు కొత్తగా కార్యవర్గంలో స్థానం కల్పించబడిందనీ, దీనికి సభ అమోదం తెల్పుతుందని ఆశిస్తున్నానని సభాధ్యక్షుడు లిస్టు చదివేడు.

కార్యవర్గంలో తన పేరుండటం విని వెంకట్రామునికి ఆనందం, ఆశ్చర్యం కలిగేయి. వీరదాసు పేరెందుకు లేదో అని మనసులో వితర్కించుకొన్నాడు. కొంత దిగులుపడ్డాడు. మనకెందుకులే అనుకున్నాడు.

కౌన్సిల్ సమావేశం ముగిసింది. వీరదాసు అతని మిత్రులూ బయటికి వెళ్ళేరు. కొత్త కార్యవర్గ సభ్యుల పరస్పర పరిచయాలు అయ్యేయి. వెంకట్రాముని సచ్చిదానందం అభినందించేడు. పుల్లమ్మ కూడా అభినందించింది. పుల్లమ్మ పక్కన అమ్మాయి మాటి మాటికి కళ్ళు అర్పుతూ వెంకట్రాముడిని చూసింది. వాళ్ళంతా ప్రత్యేకంగా తననెందుకు అభినందిస్తున్నారో వెంకట్రాముడికి అర్థం కాలేదు. అయినా సంతోషించకుండా వుండలేకపోయేడు.

తమతోపాటు కారులో రమ్మని సచ్చిదానందం వెంకట్రామున్ని ఆహ్వానించేడు. బజారులో కొంత పని చూసుకొని తానూ, దేవదానం నేరుగా రామక్రిష్ణ సమాజంవద్దకు వస్తామని వెంకట్రాముడు చెప్పి, కారులో వెళ్ళకుండా తప్పించుకున్నాడు. పుల్లమ్మ తన వ్యాన్‌లో రమ్మని యిద్దరినీ కోరింది. పుల్లమ్మ పక్కన పిల్ల, రమ్మని వెంకట్రాముడిని కళ్ళతో సైగచేసింది. వాళ్ల వాలకం వెంకట్రాముడికి బొత్తిగా నచ్చలేదు. నమస్కారంచేసి వెంకట్రాముడు, దేవదానం బయటపడ్డారు.

బస్స్టాండు దగ్గరకు వచ్చేవేళకు దేవదానం అన్నాడు—

"ఆకలిగావుంది. కాస్త టిఫిన్, కాఫీ తీసుకొని సభకు పోదాం రా. వీళ్ళందరూ వెళ్ళి, జనం వచ్చి, సభ మొదలయ్యేసరికి యెట్లాగూ ఆలస్యమవుతుంది."

యిద్దరూ హోటల్లోకి దూరేరు. వొక మూల టేబుల్ దగ్గర రెండు కుర్చీలు ఖాళీగా వున్నాయి. అక్కడికి వెళ్ళేరు. యెదురుగా కుర్చీల్లో వీరదాసు, అతని స్నేహితులిద్దరూ కూర్చొని వున్నారు.

వీరదాసే పలకరించేడు.

"మీటింగు దగ్గరకు వెళ్ళలేదా మీరు?"

"టిఫిన్ తీసుకొని వెళ్దామనుకుంటున్నాం." వెంకట్రాముడు సమాధానించేడు.

ఆ టేబిల్ దగ్గర కూచోవటం దేవదానానికి యిబ్బందిగా వుంది. తప్పలేదు.

"యిట్లాంటి సభలకు రావడం యిదే మొదలనుకుంటాను. దేవదానంగారిని రెండు మూడుసార్లు చూసినా- వాసుగారితో, ఫాదర్ స్టీఫన్‌తో."

"అవును. దేవదానం మా వూరి స్కూల్లోనే టీచరు. తోడుగా వచ్చినా- నాకూ మా వూళ్ళో దిక్కు తోచకుండా వుంటే."

"అయితే నాలాగే ఖాళీగా వున్నరన్నమాట!"

"మీరేం చదువుకున్నారు?"

"కులం పేరు చెప్పమని ఫైనలియర్ ప్రాక్టికల్స్‌లో అడిగితే చెప్పనందుకు నాలుగుసార్లు ఫెయిల్‌చేసి అయిదోసారి ఎం. బి. బి. ఎస్. డిగ్రీ యిచ్చి లోకం మీదికి తోలినారు. యిప్పుడు రోడ్లమీద....తింటూ మాట్లాడండి. ఫరవాలేదు. మాది అయిపోయింది."

"ఎం. బి. బి. ఎస్. చదివి ఖాళీగా వున్నారా!"

"ఆశ్చర్యమేముంది? మీరు?"

"ఎం. ఏ. ఆంత్రోపాలజీ."

"పల్లెలోనే వుంటున్నారా?"

"ఆఁ. గ్రూప్ వన్ పరీక్షలు రాసినా. వాటి రిజల్ట్స్‌కోసం యెదురుచూస్తున్నా."

"పాసయితే వుద్యోగం వస్తుందని అనుకుంటున్నారు."

"రిజర్వేషన్ పోస్ట్స్ మూడున్నాయి."

"నాకు మాత్రం యీ వుద్యోగాలమీద నమ్మకం పోయింది— యీ రకం సంఘాలమీదా పోయినట్లే."

"మరయితే యెందుకు వచ్చినట్లు — గందరగోళ పరచడానికా?" — దేవదానం ప్రశ్నకు వీరదాసు చిరునవ్వు నవ్వేడు.

"వస్తాం. పనుంది. కడప కెప్పుడన్నా వస్తే రండి" — వీరదాసు అడ్రసు చెప్పి పోయేడు.

"యిక్కడా దాపురించినాడు". దేవదానం కాఫీ తాగుతూ విసుగ్గా అన్నాడు.

వీరదాసు మనస్తత్వాన్ని అర్థంచేసుకోటానికి తంటాలుపడుతూ వెంకట్రాముడు దేవదానానికి సమాధానం యివ్వలేదు. వీరదాసు ప్రైవేటు ప్రాక్టీసు పెట్టినాడేమో లేకపోతే అంత నిర్విచారంగా మాట్లాడతాడా. మరి ఖాళీగా వున్నట్లు చెప్పినాడే. మొత్తంమీద లోతుమనిషి అనుకున్నాడు.

హోటల్‌నుంచి బయటికి వస్తుంటే మెట్లదగ్గర పదేండ్ల కుర్రవాడు ధర్మం కోసం చెయ్యి చాచేడు. దేవదానం పట్టించుకోలేదు. వాడిని చూస్తే, వెంకట్రాముని కి తన తమ్ముడు జ్ఞాపకం వచ్చేడు. పది పైసలు వాడి చేతిలో వుంచేడు.

యేదో జ్ఞాపకానికి వచ్చినట్లు వెంకట్రాముడు దేవదానంతో అన్నాడు —

"మా చిన్నతమ్ముణ్ని సెయింట్ ఆంథోని యిండస్ట్రియల్ ఎస్టేట్‌లో చేర్పిస్తే బాగుంటుంది కదా? వాడికింక చదువురాదు. అల్లరి చిల్లరగా తిరగటం కంటే యిట్లాంటి చోట యే వృత్తినో నేర్చుకోవడం నయం — రైతుల యిండ్లలోనో, గనుల్లోనో జీవితాంతం అవస్థపడడంకంటే...."

దేవదానం వులికి పడ్డాడు —

— తాను మీదిపెంట్లకు ట్రాన్స్‌ఫరయి యేడాది అయినా వెంకట్రాముని యింటి వివరాలు తెలీవు. కానీ హరిజనవాడలోని వ్యక్తుల జీవితాలూ, ప్రవృత్తులూ కొంత తెలుసు కాబట్టి వెంకట్రాముడు తన తమ్ముణ్ని, సభ్య సమాజంలో చేర్చాలనుకున్నా కుదరదేమో!

దేవదానం అన్నాడు —

"మీ నాయన వొప్పుకుంటాడా? వొప్పుకుంటే ఫాదర్ స్టీఫన్ యేదన్నా సాయం చెయ్యవచ్చు. మిగతావాళ్లెవరూ నాకు తెలీదు. చేర్చేముందు వాళ్ళ రూల్సు యేమున్నాయో కూడా తెలుసుకోవాల."

తనకు తెలియని ఆ రూల్సు మీద వెంకట్రాముడికి కోపం వచ్చింది. హరిజనుల జీవితం ఎన్ని రూల్సుకు లోబడివుంది అనుకున్నాడు.

## 5

రామక్రిష్ణ సమాజంలో —

సభ యింకా ఆరంభం కాలేదు. సభ యేర్పాట్లు జరుగుతున్నాయి.

హాలులోనికి వచ్చిన వెంకట్రాముడు దేవదానాలను గ్రంథాలయం ఆఫీసుగది కిటికీలోంచి చూసి, వాసు బయటికి వచ్చేడు. ముఖ్య అతిథులంతా లోపలున్నారు రమ్మని పిలుచుక వెళ్ళేడు. అంగావికి పరిచయంచేసేడు.

వెంకట్రాముని అంగావి అడిగేడు —

"మరేం చెయ్యాలనుకుంటున్నావు?"

"యేదైనా పుద్యోగం వస్తే—. గ్రూప్ వన్ పరీక్షలు. కూడా బాగా రాసిన"

సచ్చిదానందం, ఓబయ్య వెంకట్రాముని వైపు చూసేరు. ఎం.ఎల్.ఏ. పెంచలయ్య 'కుర్రవాడు చురుకైనవాడే' అనుకున్నాడు.

విషయం ఉద్యోగాలూ, రిజర్వేషన్ల మీదికి మళ్ళింది.

"యేర్పాట్లన్నీ పూర్తి అయ్యేయి. చలపతి గారొస్తే సభ మొదలుపెట్టవచ్చు" అందరినీ పుద్దేశించి హెచ్చరించేడు.

"యీ చలపతి యెప్పుడూ యింతే. అక్కడ యెవరో వొకరు పట్టుకొని పుంటారు. రాజకీయాల్లో దిగినవాళ్ళకు యెన్ని చిక్కులో...."— ఎం ఎల్.ఎ. పెంచలయ్య రాజకీయవాదులైన తమను ప్రజలు యెన్ని బాధలు పెడతారో, ప్రజాసేవ యెన్ని యిబ్బందులతో, కష్టాలతో నిండివుందో యేకరువు పెట్టేడు.

అంగావి, పెంచలయ్యను సమర్థిస్తూ సంఘసేవకులు యింకా యిబ్బందులూ, కష్టాలు పడుతున్నారని చెప్పుకొచ్చేడు.

వీళ్ళు యే రకం యిబ్బందులనూ, కష్టాలనూ పడుతున్నారో— వింటూంటే మతిపోతోంది అనుకున్నాడు వెంకట్రాముడు— తానున్న సమాజంలోని కష్టాలను తలచుకుంటూ.

చలపతి నింపాదిగా లోనికి వచ్చేడు. ఆయన వెంట పుల్లమ్మ; పుల్లమ్మ చెలి రావటం చూసి, అర్థమైనట్లు ప్రజాసేవ యిట్లాగే వుంటుందేమో అనుకున్నాడు.

సభికులతో హాలు నిండింది. సభ మొదలైంది. చలపతి అధ్యక్షస్థానంలో కూచున్నాడు. కుడి పక్కన అంగావి, ఎడమ పక్క సచ్చిదానందం కూచున్నారు.

చలపతి అధ్యక్షోపన్యాసం మొదలైంది.

—పెంచలయ్య వంటి రిజర్వుడు నియోజకవర్గం ఎం.ఎల్.ఎ. ల సహాయంతో తాను, తమ ప్రభుత్వం హరిజనుల విషయంలో చేస్తున్న కృషిని వివరించేడు. కుల నిర్మూలన విషయమే ప్రస్తావించకుండా, సచ్చిదానందం అంగావి వంటి పెద్దలు గొప్ప గొప్ప భావాలున్నవాళ్ళు, యిటువంటి సంఘాలద్వారా యెంతో

మేలు చేస్తున్నారని వాళ్ళను పదినిముషాలు పొగిడేడు. వాళ్ళకూ, తనకూ వున్న స్నేహాన్నీ, పరిచయాన్నీ వివరించేడు. దేశ ప్రధానిని పొగిడేడు. రాష్ట్ర ముఖ్యమంత్రిని పొగిడేడు. కాస్సేపు కులం యెక్కడా లేదంటూ మన ఎం.ఎల్.ఎ. పెంచలయ్యగారి కూతురిని తన కొడుక్కు చేసుకునేవాణ్ణని, కానీ తనకు కొడుకులు లేరనీ అందరినీ నవ్వించేడు.

చలపతి వుపన్యాసం వెంకట్రాముడికి పరమచెత్తగా కన్పించింది. హరిజనుల నేదో వుద్ధరించినట్లు పోజు పెడుతున్నాడు; కుల నిర్మూలన సంగతి మాట్లాడడు అనుకున్నాడు.

—యిదేదో పెద్ద వుపన్యాసమని ఆ పుల్లమ్మ నవ్వులు, చప్పట్లు!

చలపతిమీద వెంకట్రాముడికి యేమాత్రం గౌరవం కలుగలేదు.

వెంకట్రామున్ని, సభికుల్ని క్షమించి, చలపతి వుపన్యాసం ఆపి "అంగావి యిప్పుడు మాట్లాడతాడు" అని సూచున్నాడు.

అంగావి యేం మాట్లాడుతున్నాడో వెంకట్రాముడి బుర్ర కెక్కలేదు. మధ్య మధ్య తను విన్న పేర్లు, తనకు తెలిసిన పేర్లు అంబేద్కర్, గాంధీ, వినోభా, గోఖలే, వార్ధా ఆశ్రమం, భూదానోద్యమం, వుపన్యాసంలో దొర్లిపోతూ వుండటటం గమనించేడు. వొక్క ముక్కా అర్థంకాకుండా రెండుసంవత్సరాలు ఎం. ఏ. పాఠం చెప్పిన రీడరు వెంకట్రాముడికి జ్ఞాపకానికి వచ్చేడు.

సభలోంచి మెల్లగా జారుకుంటున్న సభికుల్ని చూచి కూడా అంగావి తన వుపన్యాసం ఆపలేదు.

"దరిద్రుడా! ఆపు! నీ వుపన్యాసమే యింత అధ్వాన్నంగా వుందే నీ సంఘ సేవ యింకెంత అధ్వాన్నంగా వుందో" అని వెంకట్రాముడు అరవాలనుకున్నాడు. కానీ అరవలేకపోయేడు.

దేవదానం యే లోకంలో వున్నాడో కానీ వుపన్యాసకుని వైపే చూస్తుండటం వెంకట్రాముడు గమనించి ఆశ్చర్యపోయేడు.


దయతలచి అంగావి తన వుపన్యాసాన్ని ముగించేడు.

వీళ్ళిద్దరి వుపన్యాసాలను విన్న తర్వాత బుద్ధివున్న వాడెవడూ రాజకీయాలు సంఘసేవలను గుర్తించడు, గౌరవించడు అనుకున్నాడు వెంకట్రాముడు.

సచ్చిదానందం వుపన్యాసారంభంతో సభలో సద్దు మణిగింది.

—కులవ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలను సప్రామాణికంగా ప్రస్తావించి, మానవులంతా వొకటేననీ, వర్ణవ్యవస్థ కొనసాగటం యిప్పట్లో అర్థరహితమనీ,

గుడ్డ చాలా మన్నికైన గుడ్డ! కాస్త వదులుగానే కుట్టు!!




తమ సంఘం ఆ ధ్యేయం కోసమే అవిరళ కృషి సల్పుతోందనీ సచ్చిదానందం వివరించేడు. తమది రాజకీయ మార్గం కాదనీ కులవర్గ ఘర్షణలు సృష్టించటం తమ ధ్యేయం కాదనీ బుద్ధుడు, జీసస్, గాంధీ, అంబేద్కర్, దయానంద సరస్వతివంటి మహనీయుల విశ్వాసాల సమ్మేళనంతో సర్వ మత సారాన్ని గ్రహించటం, వర్ణాతీతమైన సంఘం కోసం ప్రజలను సంసిద్ధం చేయటం తమ ధ్యేయమని అంటున్నప్పుడు సభలో చప్పట్లు మోగేయి.

నేటి యువకులను గురించి చెపుతూ, వెంకట్రాముడి తీర్మాన సవరణ ప్రస్తావన తెచ్చి వున్నత విద్యాధికుడైన ఆ యువకుని మనోవేదన మన సమాజ సంస్కారానికి హెచ్చరిక అన్నప్పుడు సభలోనివాళ్లు వెనక్కి చూసేరు— యెవరిని గురించా అని.

వినయభారంతో వెంకట్రాముడు తల యెత్తలేదు.

— వేదాలు, వుపనిషత్తులు, భగవద్గీత, ధర్మశాస్త్రల్లోని శ్లోకాలను, బైబిల్‌లోని నిబంధనలు, ఖురాన్‌లోని 'సురా' లను దృష్టాంతాలుగా సచ్చిదానందం చెపుతున్నప్పుడు సభికులు ఆశ్చర్యపోయేరు.

సచ్చిదానందం గురించి తెలియని సభికుల్లో చాలామంది యేదో గొప్ప బ్రాహ్మణ వంశంలో జన్మించి వుంటాడనుకున్నారు.

వెంకట్రాముడికి ఆ రకం ఆలోచన రాలేదు. కానీ సచ్చిదానందం పాండిత్యానికి ముగ్ధుడయ్యేడు; హృదయం రెక్కలు విప్పుకుంది. చప్పట్లు మోగినప్పుడు కానీ వెంకట్రాముడు తేరుకోలేదు. తేరుకున్న తర్వాత వెంకట్రాముడికి తట్టింది- ఆ వుపన్యాసంలో కొంత భాగం వీరదాసువంటి యువకులకు సమాధానమని. వీరదాసు అభిప్రాయాల్లో అసంగతత్వం యేముంది అని వితర్కించుకున్నాడు. వీరదాసులో యేదో తీవ్ర ధోరణి వుందనిపించింది.

సచ్చిదానందంవంటి గొప్పవ్యక్తి, వుపన్యాసంలో తనను పేర్కొన్నందుకు ఆత్మవిశ్వాసంతోపాటు, వెంకట్రామునికి ఏ మూలో గర్వంకూడా కలిగింది.

సభ ముగిసింది.

హాల్లో కొందరు సచ్చిదానందం చుట్టూ మూగేరు. పుల్లమ్మ సచ్చిదానందాన్ని వదలలేదు. ప్రశంసలతో ముంచెత్తింది. వొకరిద్దరు యువకులు 'రేపుకూడా వొక వుపన్యాసం వుంటే బాగుండు' నన్నారు. వుదయమే తాను జనతా ఎక్స్‌ప్రెస్‌లో మద్రాసుకు వెళ్ళవలసిన అవసరం వుందనీ, వీలుకాదనీ సచ్చిదానందం వాళ్ళకు సమాధాన మిచ్చేడు.

వెంకట్రాముడు అమితోత్సాహంతో సచ్చిదానందాన్ని ప్రశంసించేడు.

సచ్చిదానందం వెంకట్రాముడిని అభిమానపూర్వకంగా చూస్తూ అన్నాడు—

"నువ్వు హైదరాబాదుకు వస్తే తప్పకుండా కలవటం మరచిపోకు."

వెంకట్రాముడు సంబరపడిపోయేడు.

చలపతి, సచ్చిదానందం దగ్గరికి వచ్చి "యిప్పటికే లేటయింది. పోదాం" అంటూ వాసు వైపు తిరిగి "వాసూ! నువ్వూ రావయ్యా భోజనానికి. మీ గద్దె భోజనం వుంది రా" అని పిలిచేడు.

అందరూ నవ్వుకున్నారు.

"తిరిగ్గా వో ఆదివారం యిద్దరూ తప్పక రండి. చాలా విషయాలు మాట్లాడుకోవాలి." వాసు ఆహ్వానానికి ఇద్దరూ తల ఊచేరు.

యిక అక్కడ చాలాసేపు వుండటం మర్యాద కాదని, అందరికీ చెప్పి వెంకట్రాముడు, దేవదానం బయటికి తప్పుకున్నారు.

దారిలో వెంకట్రాము డనుకున్నాడు.

-యింత మంచి సభలకు చంద్రావతి యెందుకు రాలేదో! రాత్రి కడపలోనే గడిపితే బాగుండు ననిపిస్తోంది. వూరు వెళ్తే మళ్ళీ చిరాకు, ఆందోళన, విసుగు. మనసు దయ్యాల కొంప అవుతుంది. నోటికి యింపితం కాని తిండి, దుర్గంధ

భూయిష్ఠమైన పరిసరాలు, సంస్కారం లేని పిలుపులు, వేపచెట్టుకింద కుక్కిమంచం చదువు సర్వేంద్రియాలను తొలిచే చీకటివాడ బతుకు మళ్ళీ.... యీ రాత్రికి వుంటే.... తన దగ్గర నాలుగు రూపాయల చిల్లర మాత్రమే వుంది. దేవదానంతో ఖర్చుపెట్టించడం కంటే అందిన బస్సు పట్టుకొని వూరు చేరుకోవడం మేలేమో।

-తన విముక్తికి వుద్యోగమొక్కటే శరణ్యం. గ్రూప్‌వన్ పాసయితే సచ్చిదానందం సాయపడవచ్చు. తనమీద ఆయనకు గురి కుదిరింది. వుద్యోగమొస్తే.... చంద్రావతిని పెళ్ళాడితే....-

వెంకట్రాముడి ముసి ముసి నవ్వు చూసి దేవదానం అనుమానంగా అడిగేడు :

"యేమిటీ, నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?"

"యేం లేదు. స్టూడెంట్ డేస్‌లో కూడా నేనెప్పుడూ యిట్లాంటి మీటింగులకు వెళ్ళలేదు. యీ పరిచయాలు, యీ వుత్సాహం ఊరికి పోతే వుండవు కదా అని నవ్వు వచ్చింది."

"వూర్లో యేముంటుంది? నాకయితే బళ్ళో అరుపులు, యింట్లో సమస్యలు, నీకయితే...." దేవదానం యేం చెప్పాలో తోచక ఆగేడు.

"నాకయితే చెట్టుకింద తపస్సు"- వెంకట్రాముడు వుల్లాసంగా పూర్తి చేశాడు.

దేవదానానికి నవ్వు రాలేదు; వుత్సాహంగా లేదు. ఆలోచనలో మునిగిపోయేడు.

-వచ్చినందుకు ముఖ్యమైన పని కాలేదు. ఫాదర్ స్టీఫన్ యింట్లో లేడు. మీటింగుకు రాలేదు. యెక్కడికో వూరికి వెళ్లినాడని యెవరో చెప్పినారు. యెప్పుడొచ్చేది తెలియదు. ఫాదర్ వున్నట్లయితే మేరీ వుద్యోగ విషయం హెచ్చరించటానికి వీలుండేది. మేరీకీ వుద్యోగం రాదు. తన కాపురం చక్కబడదు. ఆలిస్ యెందుకో మారిపోయింది. తల్లిదండ్రులెప్పుడో చిన్నప్పుడే చనిపోయి యెవరి పంచనో పెరిగిన తన జీవితం యిట్లా భగ్నమైంది. పుల్లమ్మ అనాథల హాస్టల్లో పెరిగిన మేరీ భవిష్యత్తు చీకటిమయంగా ఉంది.

"యేమిటి, దిగులుగా వున్నావు?"- వెంకట్రాముని ప్రశ్నకు దేవదానం వులిక్కిపడ్డాడు.

"యేంలేదు.... యేంలేదు.... మనసేం బాగులేదు. సెకండ్‌షోకు యింకా టయిముంది. యెక్కడయినా భోంచేసి సినిమాకు వెళ్దాం. ఆ తర్వాత వాళ్ళనూ, వీళ్ళనూ యిబ్బంది పెట్టకుండా బస్‌స్టాండులో మాట్లాడుకుంటూ కూర్చుందాం. నాలుగు గంటల బస్సుకు మనం వూరికి పోవచ్చు."

"యేం సినిమాలే"

"నాకూ అట్లానే అన్పిస్తోంది. వెంకటేశ్వర లాడ్జిలో రూం తీసుకుందాం. పొద్దున్నే పోదాం."

"డబ్బు దండగ."

"ప్రతిరోజూ ఖర్చుపెడుతున్నామా? పద."

యిద్దరూ లాడ్జిలో సింగిల్ రూం తీసుకున్నారు. దేవదానం, వరండాలో హోటల్ బోయ్‌తో యేదో గుసగుసలాడటం వెంకట్రాముడు గమనించేడు. "సిగరెట్ల అవస్థ అయి వుంటుందిలే' అనుకున్నాడు.

గదిలోకి వస్తూనే దేవదానం క్షమాపణ ధోరణిలో అన్నాడు:

"నువ్వేమీ అనుకోవనుకుంటాను. నాకెందుకో తాగాలనిపించింది. నాకెప్పుడూ అట్లా అన్పించదు. పెద్ద అలవాటులేదు. యీ రోజు...."

"దానిదేముంది? వొకటి రెండుసార్లు హాస్టల్ డిన్నర్లప్పుడు మా ఫ్రెండ్ మా రూంకే తెచ్చుకున్నాడు. నా కెందుకో ఆ వాసన పడదు. నువ్వు తాగు. నాకు అభ్యంతరంలేదు."

"నువ్వు విచిత్రమైన మనిషివి."

హోటల్ బాయ్ క్వార్టర్ రమ్ము, రెండు పొట్లాల మిక్చరు తెచ్చి టేబులు మీద వుంచి "సోడాలు కావాలా సార్" అని అడిగేడు.

"అక్కర్లేదు. వొక అరగంట తర్వాత నాలుగు చపాతీలు, రెండు లివర్, రెండు ఖైమా తీసుకరా. డబ్బుంది కదూ."


"వుంద"ంటూ హోటల్ బాయ్ వెళ్ళిపోయేడు.

ఇద్దరూ పిచ్చా పాటీ మాట్లాడుకోసాగారు.

దేవదానం మంచినీళ్ళు తాగినట్లు రమ్ము పూర్తిచేసేడు. దేవదానంమీద రమ్ము ఆధిపత్యం మొదలయింది. శృతి హెచ్చింది.

"నీకు చాలా తెలియదు. నువ్వు బచ్చా. కానీ నువ్వంటే నా కిష్టం. నా యిష్టాలేమైతేనేం?.... నా జీవితం నాశనమయింది. నాకేం అక్కరలేదు, జీవితంలో.... నా భార్య నన్నొక మనిషిగా చూస్తే చాలు.... నా చెల్లెలు మేరీకి పెళ్ళయితే చాలు...."— దేవదానం పసిపిల్లవానిలా యేడ్వటం మొదలు పెట్టేడు. దేవదానాన్ని యేవిధంగా వోదార్చాలో వెంకట్రాముడికి అంతుపట్ట లేదు.

—దేవదానం గుండెలో బయటికి కన్పించని యేవో మంటలున్నాయి. తమ యేడాది పరిచయంలో తన వ్యక్తిగత విషయాలు యేవీ యెప్పుడూ తనకు



చెప్పలేదు- తన చెల్లెలు వుద్యోగం తప్ప. మొన్న మొన్నటివరకూ వొంటరిగానే వుండేవాడు. నెలరోజులనుంచి చెల్లెలు మేరీ తోడుచ్చింది. వెనుకా ముందూ యెవరూ లేరేమో!

దేవదానం పట్ల వెంకట్రామునికి అపారమైన జాలి కలిగింది.

"యిప్పటికే చాలా పొద్దుపోయింది. బాయ్ చపాతీలు తెచ్చి పెట్టి పోయినాడు. తిను...."

దేవదానం యేడుపు ఆపి "నువ్వు తిను. నాకు ఆకలిగా లేదు" అన్నాడు.

తనకు ఆకలిగా వున్నా, దేవదానం తినకుండా తాను కక్కుర్తిగా తినడం వెంకట్రాముడికి బాగుండదనిపించింది.

దేవదానం బలవంతం చేసేడు —

"నా మీద వొట్టు.... నువ్వు తినాలి.... యిదుగో నేను తింటున్నా."

దేవదానం పొట్లాలు విప్పేడు. కోడి గెలికినట్లు గెలికేడు.

వెంకట్రాముడు తినటం మొదలుపెట్టేడు.

తుంచిన చపాతీముక్క పార్సిల్ ఆకులో పడేసి దేవదానం అన్నాడు—

"నాకు వొక సహాయం చేస్తావా? నువ్వు తప్పకుండా స్టేట్ ఆఫీసరు

అవుతావు.... అప్పుడు నన్ను మరిచిపోవద్దు. మేరీని యేదో విధంగా గట్టెక్కించాల. వయసులో చిన్నవాడివైనా మంచివాడివి. నన్ను అర్థం చేసుకోగలవు.... సాయం చేస్తానని చెప్పు...."

—వెంకట్రాముడి రెండు భుజాలను పట్టుకొని దేవదానం మళ్ళీ యేడ్చేడు.

దేవదానం విపరీత ప్రవర్తన వెంకట్రాముడికి అర్థం గాలేదు. వూరినుంచి కడపకు చార్జీలు కూడా పెట్టుకోలేని దౌర్భాగ్యంలోవున్న తాను స్టేట్ ఆఫీసరు కావటం, దేవదానాని కేదో చేయి అందివ్వడం మాటల్లో యెంత సులభం అనుకున్నాడు.

"అదో! అప్పుడే ఆలోచిస్తున్నావు! ఆఫీసరు ఫోజు వచ్చింది. నువ్వు డి. అర్. ఓ. ఓబయ్యగాడి మాదిరి కావద్దు. చెప్పు సాయం చేస్తావు కదా?"

డి. ఆర్. ఓ. ఓబయ్యను గురించి వెంకట్రాముడు వివరాలు అడగాలనుకొని మాని "అట్లాగే" అన్నాడు.

తర్వాత దేవదానం యేమీ మాట్లాడకుండా పడుకున్నాడు. కాసేపు కూని రాగాలు తీసేడు. అడ్డదిడ్డంగా మంచంమీద పడి నిద్రపోయేడు.

వెంకట్రాముడు నేల కాస్త శుభ్రపరచి, పరుపు పరుచుకొని పడుకున్నాడు. నిద్ర రాలేదు. వుదయంనుంచీ జరిగినసంగతులు నెమరువేసుకోవటం ఆరంభించేడు. వొక్క రోజులో యెన్ని అనుభవాలు! అనుభవాల మధ్య తాను! తనతో నిమిత్తంలేని అనుభవాలు! వెంకట్రాముడికి నిద్ర ముంచుకొచ్చింది. నిద్రలో కల -తాను ఆర్. డి. ఓ. అయినాడు- రోశిరెడ్డి తన కాళ్ళు మొక్కుతున్నాడు. 'సోమీ' 'సోమీ' అంటూ.... మాదిగిండ్ల పేరు మారిపోయింది. పేరేమి? చంద్రాపురం! చంద్రావతి నవ్వుతోంది. తనకూ చంద్రావతికి వర్ణాంతర వివాహం జరుగుతోంది— సచ్చిదానందం, వాసు.... అందరూ అభినందిస్తున్నారు. పుల్లమ్మ 'మా కారు వాడుకోండి' అంటోంది.... యెవరిదా యేడుపు? దేవదానం.... దేవదానం యేడుస్తున్నాడు.... జమ్మిచెట్టు కింద- సారాయి తాగి అడ్డదిడ్డంగా పడి యేడుస్తున్నాడు పాపం! చంద్రావతి మేరీగా మారిపోయిందే! పుల్లమ్మ పక్క అమ్మాయి నవ్వుతోంది. వుపన్యాసాలు.... చప్పట్లు.... చప్పట్లు!

వులిక్కిపడి వెంకట్రాముడు నిద్రలేచేడు. దేవదానం గది అస్బెస్టాస్ అడ్డు గోడమీద దరువులు వేస్తున్నాడు- తనలో తాను మాట్లాడుకుంటూ.

"నువ్వు మంచోనివి వెంకట్రాముడూ.... ఆలిస్! నీకు నాకు సంబంధంలేదు. నువ్వు మోసం చేసినావు. డైవర్స్ నీకు.... మేరీ యేడ్వవద్దు.... వెంకట్రాము

డున్నాడు.... హి యీజ్ అవర్ సేవియర్। వో లార్డ్,.... వారే రోశిరెడ్డిగా నీ పని పడతా వుండు...."

దరువు ఆగింది. చేతులు వేలేసి దేవదానం నిద్రపోతున్నాడు.

వెంకట్రాముడికి భయం వేసింది. రోశిరెడ్డి పేరెందుకు తాగిన మైకంలో దేవదానం తలచుకుంటున్నాడో తలబద్దలు కొట్టుకున్నా అర్థంకాలేదు. కలలో చంద్రావతి మేరీగా మారిపోవటం వెంకట్రామునికి మరింత ఆశ్చర్యాన్ని కలుగచేసింది.

యింకా కొన్నాళ్లు వుద్యోగం లేకుండా, వూళ్ళోనే వుంటే యిప్పటికే చెడిపోయిన బుర్ర పనికిరాకుండా పోతుంది, తప్పక అనుకున్నాడు— యెప్పుడు తెల్లవారుతుందా అని యెదురుచూస్తూ।

## 6

చిక్కటి వేపచెట్టులోంచి, తెలి వెన్నెల చీలికలై పాయలు పాయలైన నీటి జాలులా జారుతోంది. వేపచెట్టు కింద ఆ వెలుగు నీడల్లో అగడాల కట్ట తెగిన కుక్కిమంచంలో పడుకొని వెంకట్రాముడు కడప అనుభవాలను నెమరు వేసుకుంటున్నాడు. 'మళ్ళీ యీ నిజమైన పరిసరాల్లోకి రాక తప్పలేదే' అని విచారిస్తున్నాడు.

యెదురుగా కొట్టం పక్కన జాలాట్లో వెంకట్రాముడి తల్లీ చెల్లెలు బోకులు కడుగుతున్నారు ఆ శబ్దం వెంకట్రాముడికి కర్ణకఠోరంగా వుంది. రాములు గుడిదగ్గర రోజూ సందడి నెమ్మదిగా మొదలవుతోంది. వెన్నెల్లో ఆడపిల్లలు చిరుగుల దుస్తులతో పిస్తుళ్ళు ఆడుతున్నారు. సగం గోచిపాతల మగపిల్లలు సినిమానాయకులై వుత్తుత్తి కత్తియుద్ధాలు చేస్తున్నారు. కుక్కల అరుపులు, తాగినవాళ్ళ తిట్లూ, ఒకరిద్దరి ఆడవాళ్ళ యేడుపులూ, తిట్లూ, తప్పెట నేర్చుకుంటున్న దరువులూ వినిపిస్తున్నాయి.

వేపచెట్టు కొమ్మల మధ్యనుంచి కన్పించే చంద్రుడ్ని చూస్తూ వెంకట్రాముడు ఆలోచనల్లో పడ్డాడు. వెన్నెల చంద్రావతి సాన్నిధ్యం మాదిరి వుంది; వెన్నెలను అడ్డగించే వేపచెట్టు తన జీవితం మాదిరి వుంది అనుకుంటూ ఆలోచనల్లో వెంకట్రాముడు.

—కడపలో వొక్కరోజు యెంత వుత్తేజకరంగా గడిచింది! చంద్రావతి.... వాసు.... సచ్చిదానందం.... వాళ్ళు వెలుగులో వున్నారు. తాను చీకట్లో. తనను వొక్కరోజు మనుషుల మధ్య తిప్పిన దేవదానం నాలుగురోజులనుంచి

సాయంకాలాలు కన్పించడంలేదు. ఆ మొన్న పులివెందులకు పోయినాడని, మొన్న స్కూలునుంచి రాలేదనీ, నిన్నా, యీరోజూ యెక్కడికి వెళ్ళినాడో తెలియదనీ మేరీ చెప్పింది. మేరీ తనను యెందుకట్లా తినేటట్లు చూస్తుంది? స్నేహితుని చెల్లెలు! దేవదానం కడపనుంచి వచ్చింది మొదలు ముఖం చాటు చేసుకోవడ మెందుకో ....కడపలో తాగిన మాటలు జ్ఞాపకానికి వస్తున్నాయేమో! పాపం! మంచివాడు! రేపు యెక్కడున్నా పట్టుకోవాల. అతనే తనను కడపకు తీసుకెళ్ళకపోతే చంద్రావతితో తనకు పరిచయం పెరిగి వుండేదికాదు. తన చదువుకూ, సంస్కారానికీ చోటు యిదికాదు. కడపలాంటి చోటు! కడపలో యేదైనా వుద్యోగం తాత్కాలికమైందైనా దొరికితే ఎంత బాగుండు.

యే వుద్యోగమూ తనకు దొరకదు. యీ కుక్కిమంచం బతుకు తప్పదు. యిక్కడేం చెయ్యాలో తోచదు. యిక్కడ తాను ఎం.ఏ. అయినా, కుల నిర్మూలన సంఘ కార్యవర్గ సభ్యుడైనా వొకటే; మరేవో కొమ్ములు మొలిచినా వొకటే.

కులనిర్మూలన కార్యవర్గ సభ్యుడై తాను చేసేదేమిటి? కులాన్ని తెల్పే నాయుడు, శాస్త్రి, రెడ్డి— వీటితో వుండే పేర్లు యేవీ హరిజనవాడలో లేవు. వూళ్ళో వున్నాయి. వూళ్ళోని పెద్దకులాల వాళ్ళకున్నాయి. వాటిని వదులుకోమని వాళ్ళకు చెప్పాలా? చెపితే రైతులు నవ్వుతారు. తాకేకులు కడతారు. తన్నినా తంతారు! తనవాళ్ళే నవ్వుతారు. చదువూ సంధ్యా లేనివాళ్ళకు ఇవేం తెలుస్తాయి? తనతోపాటు హైస్కూల్లో, కాలేజీల్లో చదువుకొని చదువు ఆపేసిన రైతుపిల్లలు రైతులకంటే నయమేమీకాదు. రైతుల కుటుంబాల నుంచి యూనివర్సిటీకి వచ్చినవాళ్ళూ అంతే. అబ్బల్ని మించిన కొడుకులు! అదే పొగురు, కొవ్వు. అవే తిట్లు! హాస్టలో మెస్‌కు వెళ్ళినప్పుడు క్లీనర్లనూ, సర్వర్లనూ బండతిట్లు తిట్టడం యెన్నిమార్లు వినలేదు? కట్టకడపటిన తన మాదిరి నిరుద్యోగులుగా వున్న పల్లెలోని చదువుకున్నవాళ్ళు కూడా అంతే. యెవరైనా తనతో కలిసి వచ్చేవాళ్ళున్నారని చూచేందుకైనా అడ్డుగోడ! రెండు ప్రపంచాల మధ్య అడ్డుగోడ! మరెందుకీ కులనిర్మూలన సంఘం? సచ్చిదానందం హరిజనవాడల్లో సమావేశాలు యేర్పాటుచేయమన్నాడు. యెందుకు? యీ సమావేశాలకు అర్థం వీళ్ళకేం తెలుసు? వర్ణాంతర వివాహాలు యెవరికి యిక్కడ జరపాల? చంద్రావతి అక్కడ....

వెంకట్రాముడు, తన ఆలోచనలకు కేంద్రం చంద్రావతి అని గుర్తించేడు.

—చంద్రుడిన్ని చూస్తోంటే చంద్రావతి మరీ మరీ గుర్తుకొస్తోంది. మనసు కలవరపడుతోంది. చంద్రావతితో సావకాశంగా మాట్లాడేది యెప్పుడో అని హృదయం తహతహ లాడుతోంది.

కడపకు కూడా తన యిష్టం వచ్చినప్పుడు వెళ్ళలేని తన పరిస్థితి గుర్తుకొచ్చి వెంకట్రాముడికి తనమీద తనకు జుగుప్స కలిగింది.

నిర్వేద ప్రపంచంలో మునిగివున్న వెంకట్రాముడికి రాములగుడి దగ్గర అలికిడి విన్పించింది. వెంకట్రాముడు అటువైపు చూసేడు. ముసలోడి సైన్యం వస్తోంది; యిక పనికిమాలిన కబుర్లు మొదలవుతాయి అనుకున్నాడు.

ప్రతిరోజూ అర్ధరాత్రిదాకా వాళ్ళ పాతకాలం కబుర్లంటే వెంకట్రాముడికి వొళ్ళు మంట. యెవరెవరు చేరేరని గమనిస్తూ అనుకున్నాడు.

— యే వికాసంలేని వీళ్ళ జీవితాలకు గమ్యం యేమిటి? వీళ్ళ అనుభవాలకు పరమార్థం యేమిటి? గొడ్డుచాకిరి, పీకలదాకా తాగుడూ, తందనాలు, పొద్దుపోని మాటలు!

వెంకట్రాముడి తండ్రి సుబ్బడు, మరో నలుగురు వెంకట్రాముడికి కొంచెం దూరంలో కూచున్నారు. వాళ్ళతోపాటు చిన్నతమ్ముడు వుండటం వెంకట్రాముడు గమనించేడు. వాడినికూడా సారాయి అంగడికి తిప్పి పాడు చేస్తున్నాడని తండ్రిమీద వెంకట్రాముడికి రోత కలిగింది.

తన విషయమేదో చర్చకు వచ్చినట్లు వెంకట్రాముడికి విన్పించింది. చెవులు రిక్కించి విన్నాడు —

పెంచలు సుబ్బడ్ని అడిగేడు —

"మన వెంకట్రాముడి పేరు యేందో పేపర్లో పడినాదంటనే— రోడ్డుమీద కాసిం సాయిబు టీ అంగట్లో యెవరో అంటే యిన్నా. కులాలు లేకుండా సేసే సంగంలో మనోడు నంబరంట!"

మంచంలోని వెంకట్రాముడు ఆ రోజు పేపరు చూడనందుకు బాధపడ్డాడు.

"అయితే నీ కొడుకు యే బ్యాపనోళ్ళ పిల్లనో సేసుకుంటాడా మామా"- ఆ ప్రశ్న వేసింది మునిమామ అని వెంకట్రాముడు గుర్తించేడు. నవ్వుకున్నాడు.

మిగతావాళ్ళ నవ్వుల మధ్య "బ్యాపనోళ్ళ కాలంపోయింది. రెడ్డేరి పిల్లనో నాయనోరి పిల్లనో సేసుకుంటాడేమో" అని పెదవోబులు సందేహం వెలిబుచ్చేడు.

పెద్దవోబులు చిన్నాయన సందేహం బాగుంది అనుకున్నాడు వెంకట్రాముడు.

"పిచ్చినాయండ్లారా! కులం పోవాలే కానీ బ్యాపనోండ్లేంది? రెడ్లేంది?

కమ్మోళ్లేంది? నానా సబ్బండు కులాలేంది? తతవం వొంటబట్టాలే కానీ బెమ్మం గారిదే కులం? సిద్దయ్యదే కులం? వొకడు కంసాలోడు. మరొకడు దూదేకులోడు. యేమంటావురా సుబ్బడూ?"

వెంకటేశు పెదనాయన తత్వం పెద్దదే అనుకున్నాడు వెంకట్రాముడు. వాళ్లు వేసుకొనే ప్రశ్నలకూ యిచ్చుకునే సమాధానాలకు వెంకట్రామునికి నవ్వు వచ్చింది; కుతూహలం కూడా కలిగింది. వీళ్ళింకా యేం మాట్లాడతారో విందాం అనుకున్నాడు.

"మీ యవ్వారాలు బాగానే వుండాయర్రా. మన మాదిగిండ్లు లేచి యెన్నేండ్ల యింది? మీదిపెంట్లను కట్టినప్పుడు రయితులు తూర్పునాటి నుంచి మన పూర్వీకుల్ని మూడిండ్లోళ్ళను యిక్కడికి తెచ్చినారంట! మీదిపెంట్ల కోట పాడయ్యే యిన్నూరేండ్లయిందంట? అంతకు ముందు వూరుకట్టి యెయ్యేండ్లంట వూళ్ళో సింతల రాయల దేవల ముందే అంతకంటే ముందు సంగతి. అంత పాతకాలం సంగతి యెవరికీ తెల్దు. మన అసాది రామదాసుకు కూడా తెల్దు.


నందన కరు వొచ్చి యెక్కడపడితే అక్కడ గొడ్డూ గోదా, మనుషులు సచ్చి దూము తగిలినప్పుడు పల్లె తిరగగట్టినారంట! మళ్ళా దాత కరువొచ్చి నప్పుడంతే అయిందంట! నా సిన్నప్పుడు మా యబ్బ సెప్పేవాడు. అప్పుడు రెండుసార్లూ రైతులతోపాటు మన మాదిగిండ్లు తిరగగట్టినారంట! యిన్నేండ్లుగా మనం మనమే. రయితులు రయితులే. కులం పోయిందా? వూరు మారిందా పనిలేనోండ్ల కబుర్లుగానీ!"

తండ్రి ఆఖరు మాట మంచంలోని వెంకట్రాముడికి తగిలింది. కోపం వచ్చింది. 'సరే విందాం యింకా యేమేం మాట్లాడుకుంటారో', అని ఆలకించేడు.

"టౌన్లల్లో, సదువుకునోళ్ళలో కులం పోయింది మామా."

మునిమామ పరిశీలనకు వెంకట్రాముడు ఆశ్చర్యపోయేడు.

"మన పల్లెల్లో యెక్కడా పోలేదు. మన యెంకటమ్మ సారా యంగట్లో పోలేదు. కాశిం సాయిబు టీ అంగట్లో పోలేదు. రయితుల గలాసులు వేరే. మన సత్తులోటాలు వేరే. యెర్రి నాయాండ్లారా! కులం పోతే యింతకంటే బాగా బతకుతామా? కులం లేకపోతే సచ్చిపోతామా. యింతకంటే సెడిపోతామా? యెవడి కులం వాడికి గొప్ప. మనది అందరికంటే గొప్ప. పెండ్లికి, సావుకు మనం లేకుంటే జరుగుతుందా? మనం లేకపోతే వూరు వూరంతా వొక్క రోజులో సస్తారు- గబ్బు పట్టి."



ఇదుగో! పిచ్చి పిచ్చిగా ఆలోచించడం
మానేసి నే చెప్పేదేదో రాసుకో!!

---

వాళ్ళ సంభాషణ రాను రాను అనేక విషయాలపైకి మళ్ళింది.

"అది సరే! మన పిల్లను పెద్దకులపోడు సేసుకోడం యేం గొప్ప? వాళ్ళ పిల్లను మనోడేమన్నా కతల్లో సేసుకున్నాడా?" పెంచలు ధర్మసందేహానికి మునిమామ పరిహాసంగా జవాబు యిచ్చేడు:

"నువ్వే వున్నావుగా. పెండ్లి చేసుకోలేదనుకో. పెద్దిరెడ్డికి కొడుకును కన్నావుగా!"

రోశిరెడ్డి జన్మ రహస్యం తెలిసి, వెంకట్రాముడు విస్తుపోయేడు. యిది నిజమై వుంటుందా అనుకున్నాడు.

సుబ్బడు తీక్షణంగా మునిమామను మందలించేడు.

"పనికిమాలిన నాయాలా! నోటికి యేదొస్తే అది. కొంపలు కూలే మాట లెప్పుడూ అనకు. యిక్కడయితే సరిపోయింది."

తొడలమీద తలపెట్టి నిద్రపోతున్న కొడుకును భుజాన వేసుకొని సుబ్బడు "పొద్దుపోయింది. పడుకుందాం పదంర్రా" అన్నాడు.

అందయే కింద పరచుకున్న తలగుడ్డలు విదిలించి, భుజాలమీద వేసుకొని వెళ్ళిపోయేరు. వెంకట్రాముడు తండ్రిని అనుసరించేడు.

అప్పటికే అందరూ పడి నిద్రపోతున్నారు. చిన్నకొడుకును గోనెపట్టమీద పడుకోబెట్టి, సుబ్బడు వెంకట్రాముడితో "పడుకో" అన్నాడు.

"మన చిన్నోణ్ణి కడపలో వదిలిపెడితే బాగుంటుంది"- వెంకట్రాముడు అనుమానంగా అడిగేడు.

"యేదన్నా హోటల్లోనా?"

తండ్రి ప్రశ్నకు వెంకట్రామునికి మతిపోయింది.

"కాదు కొయ్యపని. కుమ్మరపని- వాడి కిష్టమయిన పని నేర్చుకోవచ్చు"- కార్పెంట్రీ, బ్లాక్‌స్మిత్ అనే యింగ్లీషు మాటలు నోట్లోకి వస్తుంటే ఆపుకొని ప్రయత్నపూర్వకంగా తండ్రికి అర్థమయే భాషలో చెప్పేడు.

"యాడ?"

"క్రిష్టియన్లు నడిపే దాంట్లో"

"యాడికీ అవసరంలేదు. ఆడ పని నేర్చుకున్నా వొకటే, యీడ పని నేర్చుకున్నా వొకటే. యిదేం పెద్ద సదువా? రెక్కల కష్టానికి యే వూరైనా వొకటే.... యీ పొద్దే యీశ్వరరెడ్డి యింట్లో పేడకాళ్ళు తియ్యటానికి చిన్నోణ్ణి మాట్లాడినా. యిన్నూరు రూపాయలు అప్పు యిచ్చినాడు. నీకు వుద్దోగమొస్తే అప్పటి గొడవలు సూద్దాంలే. యింకోమాట! ఆ దేవదానం యింటికి మాటి మాటికి పోవద్దు. మంచోడే.... పోవద్దు...."

వెంకట్రాముడు "యెందుకు" అని అడుగుదామనుకొన్నాడు. తండ్రివైపు తిరిగి చూచేవేళకు చిన్నకొడుకు పక్కలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

ఎం.ఏ. లో పరీక్ష కోసం, క్లాసుకోసం, చదివిన కులవ్యవస్థ పుట్టు పూర్వోత్తరాల సిద్ధాంతాలు- రిస్లే, బోగెల్, కేట్కర్, మేయర్, హట్టన్, ఘుర్యే, శ్రీనివాస్‌ల సిద్ధాంతాలు, వెంకట్రాముని మనసులో మెదిలేయి. అదే విధంగా అస్పృశ్యులమీద తాను చదివిన కొన్ని వ్యాసాలు స్మృతిపథంలో మెదిలేయి!

యెంత హీనమైన జీవితంతోనయినా సమాధానపడడానికి యెన్ని కథలు అని అన్పించింది వెంకట్రామునికి.

తాను చదివిన చదువులోని అసంగతత్వం వెంకట్రామునికి మొట్టమొదటి సారిగా అర్థమైంది. చదువును చుట్టూ జీవితంతో సరిపోల్చి చూడనందుకు చింతించేడు. పరీక్షల చదువు వ్యర్థం అనుకున్నాడు.

వెన్నెల్లో అందరూ పగటి అలసటతో ఆదమరచి నిద్రపోతున్నారు. వేపచెట్టు కింద వెలుగు నీడల్లో వెంకట్రామునికి మాత్రం ఆ రాత్రి అంతా నిద్రలేదు.

## 7

పోస్టాఫీసు దగ్గరకు వెంక్రటాముడు పోయేవేళకు, అప్పుడే పోస్ట్ వచ్చింది. వుత్తరాల కోసం వచ్చిన వాళ్ళ మధ్య రోశిరెడ్డి కూడా వున్నాడు. 'వీడిది పోస్టాఫీసు యెదురిల్లే కావడం పెద్ద న్యూసెన్సుగా వుంది' అనుకుంటూ వెంక్రటాముడు వొక పక్క నిలబడ్డాడు. అందరూ పరిశీలనగా వెంక్రటాముని చూశేరు.

వయసు పైబడిన వొక రైతు వెంక్రటాముని అడిగేడు:

"యేరా! వెంక్రటాముడూ! కులాలు గిలాలు పోవాలనే సంఘంలో చేరినావంట! ఆ సంఘాన్ని యెవరో కడపలో పేపర్లేసి గబ్బుపట్టించినారంటనే-మా రోశిరెడ్డి చెప్తున్నాడు."

రోశిరెడ్డి పెద్దమనిషిలాగా అన్నాడు:

"నేను చెప్పేదేముంది పెదనాయనా! కడపంతా మోగిపోతాంటే. యెవడో పాంపెట్లు బాగా తగిలించినాడు"... జేబులోని వొక పాంప్లెట్ తీసి రోశిరెడ్డి, వెంక్రటామునికి యిచ్చేడు.

చలపతి, ఓబయ్యా, పెంచలయ్యా, పుల్లమ్మా, యింకో అమ్మాయి ఫలాని లాడ్జిలో, కులనిర్మూలన సంఘ సమావేశం రోజు వున్నారని, పాంప్లెట్ లోని విషయాలను రోశిరెడ్డి యేకరవు పెట్టేడు.

వెంక్రటామునికి తలకొట్టేసినట్లయింది. కడపలో తనకూ దేవదానానికీ కన్పించిన పుల్లయ్య పనే అయివుంటుంది అనుకున్నాడు, రూఢిగా. వెంక్రటామునికి అక్కడ నిలవబుద్ధి కాలేదు. వెళ్దామనుకొనేలోగా పోస్టుమాస్టర్ కార్డు చదివి యిస్తూ అన్నాడు: "నువ్వేదో పరీక్ష పాసయినావంట! నీకు వుద్యోగం దొరుకుతుందని వుత్తరం వచ్చిందిరా." యిదుగో యీ కార్డు గాక యింకొక కవరుంది నీకు."

'రా' అన్నందుకూ, ఆ కార్డు వుత్తరం పోస్టుమాస్టరు చదివినందుకు ఆ క్షణంలో వెంక్రటామునికి కోపం రాలేదు.

రోశిరెడ్డి వుపన్యాసం ఆగిపోయింది.

"యేం వుద్యోగం?— రోశిరెడ్డి కుతూహలంగా అడిగేడు.

"ఆర్. డి. వో."- అసంకల్పితంగా వెంక్రటాముడు కసితో ఆ మాటను నొక్కేడు- యింకా యింటర్వ్యూ గండం వొకటి వుందనే విషయం జ్ఞాపకానికి వస్తున్నా.

రోశిరెడ్డి నోరు పడిపోయింది.

వెంకట్రాముడు, రోడ్డు వైపు బయలుదేరేడు. తనకు కలిగిన సంతోషాన్ని పంచుకోటానికి నలుగురు మిత్రులు కూడా యీ కొంపలో లేరని నిరుత్సాహపడ్డాడు.

వెనుక యెవరో అంటున్న మాటలు వెంకట్రామునికి విన్పించేయి-

"మాదిగోళ్ళ రాజ్యం అయిందిరా. వీళ్ళ పనే బాగుంది."

దానిమీద రోశిరెడ్డి వ్యాఖ్యానమేమీ లేనందుకు వెంకట్రాముడు నవ్వుకున్నాడు. రోశిరెడ్డి యిక కుక్కమాదిరి పడివుంటాడు అనుకున్నాడు.

తను పరీక్ష పాసయిన సంగతి, స్కూలు దగ్గరకు వెళ్ళి దేవదానంతో చెప్పాలనిపించింది, వెంకట్రామునికి. స్కూలు దగ్గరకు పోవడంకంటే సాయంత్రం తీరిగా కలవటం బాగుంటుందని నిర్ణయించుకున్నాడు.

సంతోషంలోపడి తనకు వచ్చిన కవరు సంగతి, కరపత్రం విషయం మరచిపోయానే అనుకుంటూ ముందుగా కరపత్రాన్ని చదివేడు. పరమ జుగుప్సాకరంగా వుంది అనుకున్నాడు. అందులో సచ్చిదానందం ప్రస్తావన లేనందుకు, వాసు పేరు లేనందుకు వెంకట్రాముడు సంతోషించేడు. 'అమాయకులైన యువకులు యీ పెద్దల సాలెగూట్లో చిక్కుకుంటున్నారు; వారికి మా హెచ్చరిక' అనే మర్యాదపూర్వకమైన వాక్యాలు తమ నుద్దేశించి రాసినవి' అనుకున్నాడు. హరిజనవాడ పేరు మార్పుకోసం, వాళ్ళందరినీ వూరికి పిలవనంపనందుకు వెంకట్రాముడు యిన్నాళ్ళూ పడుతున్న పశ్చాత్తాపం దీనితో తీరింది.

కవరు యెక్కన్నుంచీ వచ్చినట్లు అనుకుంటూ చించి వుత్తరం చదివేడు.

"కంగ్రాచ్యులేషన్స్- కడపకు వస్తే యింటి వైపు రండి- చంద్రావతి."

వుత్తరంలోని మూడు వాక్యాలు వెంకట్రాముని గాలిలో తేలించేయి.

"కండ్లు నెత్తిమీది కొచ్చినాయి. సూసుకొని నడుసు" అన్న యెవరో రైతు మునలామె మాటల్తో వెంకట్రాముడు యీ లోకంలోకి వచ్చేడు. తన కలలను భగ్నం చేసినందుకు, తన ఆనందాన్ని పటాపంచలు చేసినందుకు, అడ్డదిడ్డంగా మాట్లాడినందుకు మునలామెమీద వెంకట్రామునికి కోపం వచ్చింది. 'పోనీలే ముసల్ది' అనుకొని రోడ్డుమీదికి వచ్చేడు.

రోడ్డుమీద దోసెలసెట్టి అంగడి, కాశీం సాహెబ్ టీ అంగడి, మునెయ్య బీడీలంగడి వెంకట్రామునికి యేవో హర్మ్యాలుగా ఆ క్షణంలో కన్పించేయి.

-తన ఆనందం యెవరితో పంచుకోవాల.... యెవరితో....

యీ కూపంలో యెవరితోనూ యే ఆనందం పంచుకోవడం కుదరదు. కడప వెళ్ళాలి. చంద్రావతితో యీ సంతోషాన్ని పంచుకోవాలి.

కడప వెళ్ళేందుకు డబ్బు అవసరం అన్న విషయం గుర్తుకొచ్చింది. వెంకట్రాముడు నిరుత్సాహపడిపోయేడు. సాయంత్రం దేవదానంవద్ద అప్పు తీసుకోవాలి. వొక నెలలోపలే యింటర్వ్యూ రావచ్చు. యింటర్వ్యూకు బట్టలూ అవీ ముందే జాగ్రత్తపడటం మంచిది; తర్వాత వుద్యోగంలో చేరేక నెమ్మదిగా దేవదానం అప్పు తీర్చవచ్చు అనుకున్నాడు.

సాయంత్రం వరకూ చెట్టుకింద కుక్కిమంచంలో వెంకట్రాముడు స్థిమితంగా వుండలేక అవస్థలు పడ్డాడు వెంకట్రామునికి ఆ పగలల్లా వొకటే ఆలోచనలు-

-యీ దుర్భర పరిసరాలనుంచీ త్వరలో తనకు విముక్తి కలుగుతుంది. కలిగి తీరుతుంది. చంద్రావతితో వర్ణాంతర వివాహం జరిగి తీరుతుంది.

సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో దేవదానం యింటికి వెంకట్రాముడు బయలుదేరేడు. దేవదానం వుంటున్న కొట్టం దగ్గరకు వచ్చేవేళకు కొట్టంలోంచీ వస్తున్న రోశిరెడ్డి కన్పించేడు. యెదురుగా దేవదానం వస్తున్నాడు. రోశిరెడ్డి తలవంచుకొని నేరుగా వెళ్ళిపోయేడు.

దేవదానం ముఖంలో నెత్తురు చుక్కలేదు వెంకట్రామునికి యేదో అనుమానం కలిగింది. పోయిన రాత్రి దేవదానం యింటికి వెళ్ళవద్దు అన్న తండ్రి హెచ్చరిక గుర్తుకొచ్చింది.

దేవదానం వెంకట్రామున్ని చూచి, తలవంచుకొని వొక్క మాట పలకరించ కుండా కొట్టంలోకి పోయేడు. మేరీని దేవదానం కొడుతున్న శబ్దమూ, మేరీ యేడుపూ వెంకట్రామునికి విన్పించేయి.

వెంకట్రాముని మనసు వికలమయింది.

—కులం పెద్దరికాన్ని చూపే రోశిరెడ్డి, తనది యే కులమో తెలీని రోశిరెడ్డి, పాంప్లెట్ గొడవ తెచ్చి ధర్మపన్నాలు పలికిన రోశిరెడ్డి, తను అసహ్యించు కొనే కులం యిండ్లలో దూరటానికి జంకడు. వీణ్ణి....వీణ్ణి ....

రోశిరెడ్డిని యేం చేయాలో దిక్కుతోచని మనసుతో, దేవదానం, మేరీలపట్ల యేయే భావాలు యేర్పరచుకోవాలో తెలీని స్థితిలో వెంకట్రాముడు ఆ క్షణం నలిగిపోయేడు.

కడపలో దేవదానం తాగి, యేడ్చి తనతో మాట తీసుకోవటానికి ప్రయ త్నించిన సన్నివేశం వెంకట్రామునికి గుర్తుకొచ్చింది. తాగిన మైకపు నిద్రలో రోశిరెడ్డిని తిట్టిన సంగతి గుర్తుకొచ్చింది.

వెంకట్రాముడు నిలువెల్లా వణికిపోయేడు.

పులివెందుల రోడ్డు వెంట మూడు నాలుగు మైళ్ళు నడిచి బాగా చీకటిపడ్డాక వెంకట్రాముడు యిల్లు చేరుకున్నాడు. గ్రూప్‌వన్ పాసయిన ఆనందం, చంద్రావతి శుభాకాంక్షలు హృదయంలో పెట్టిన గిలిగింత వెంకట్రామునికి ఆ రాత్రి యే కోశానా లేవు.

## 8

వూళ్ళో, వెంకట్రాముని యింట్లో చాలా పరిణామాలు కలిగేయి.


దేవదానం అవమానాన్ని భరించలేక కమలాపురం టౌన్‌కు ట్రాన్స్ఫరు చేయించుకొని వెళ్ళిపోయేడు. దేవదానం వెళ్ళిపోయిన రెండుమూడు దినాలకు, వొకరోజు రాత్రి రోశిరెడ్డిని చీకట్లో ముగ్గురాళ్ళ దొడ్డిదగ్గర యెవరో బాగా తన్నేరు. ఆ సంఘటనను గురించి వూళ్ళో రకరకాలుగా చెప్పుకున్నారు. 'యెవరో వడ్డెవాళ్ళ అమ్మాయితో పోతున్నందుకు వాళ్ళు తన్నారని' కొందరన్నారు. 'కాపోళ్ళ పిల్లనే యేదో అంటే వాళ్ళ వాళ్ళు ఆ కొడిదోనికి మా పోకనాటి పిల్ల చులకనైందా అని పోకనాటోళ్ళే తన్నారని' కొందరన్నారు. దేవదానమే యెవర్నో మనుషుల్ని పంపి కొట్టించేడని మరికొందరనుకున్నారు.యెందుకో గానీ, పదిరోజులు ఆసుపత్రిలో వుండి వూళ్ళోకి వచ్చినా రోశిరెడ్డి మాత్రం యెవరి మీదికీ వెళ్ళలేదు. ఆ సంబంధంగా గొడవలూ జరగలేదు.

ముగ్గురాళ్ళ లారీల్లో తిరిగే వెంకట్రాముని అన్న, కడపనుంచీ వొకామెను తెచ్చుకొని వేరుకాపురం పెట్టేడు. 'హోటల్ యేదో యెత్తిపోతే బజార్న పడిన రాజంపేట కాపామెను 'తెచ్చుకున్నాడని' వాళ్ళూ వీళ్ళూ అన్నారు. ఆమె రోడ్డుమీద బీడీ బంకును కూడా పెట్టింది. యీలోగా యీశ్వరరెడ్డి యింట్లో పనికి పెట్టిన వెంకట్రాముని చిన్నతమ్ముడు యెక్కడికో పారిపోయేడు.

యీ సంఘటనలకు తోడు, వూరు వూరంతా మరొక సంఘటనతో కదిలి పోయింది.

మాలిండ్లకు యెగువన వుండే వడ్డెలు, గొల్లవాండ్ల యిళ్లకు సమీపంలోని ప్రదేశంలో వొకరిద్దరు మాలలు కొట్టాలు వేసుకోవటం ప్రారంభించేరు. ఆ చోటు మొదటినుంచీ తమ అనుభవంలో వుంది కాబట్టి తమ హక్కుభుక్తమని వడ్డెలు,గొల్లలు ఆక్షేపణ తెలిపేరు. గవర్నమెంటు పోరంబోకని మాలపెద్దలు వాదించేరు. వూళ్ళో వుద్రిక్తత మొదలయింది.

కొత్తరూపంలో పాత కక్షలు తిరిగి తలెత్తేయి.




---

వూళ్ళోని కాడిదరెడ్లు తండ్రీ కొడుకులు పెద్దిరెడ్డి, రోశిరెడ్డి నాయకత్వం కింద మాలలను సమర్థించేరు. పోకనాటి పెద్దరైతులు వడ్డెల్ని యెగదోశేరు. రెండు పక్షాలవాళ్లు తమ తమ పార్టీల వాళ్ళతో ప్రోనోట్లు వ్రాసుకొనే కట్టుబాట్లు చేసుకున్నారు.

మాదిగలు యెటువైపూ యింకా చేరనందుకు యిరుపక్షాల వాళ్ళకీ గుర్రుగా వుంది. వాళ్ళకు యిరుపక్షాల రైతుల యిళ్ళల్లోనూ పనిచేయటమే దుస్తరమైంది. వత్తిడుల మధ్య వాళ్ళు దినదిన గండంగా జీవిస్తున్నారు.

'ముగ్గురాళ్ళ గనిలో డబ్బు లీమధ్య బాగా సంపాదించి పలుకుబడి పెంచుకున్న పెద్దిరెడ్డితో తలపడడం అంటే మాటలా' అనే సందేహం అవతల పక్షానికుండటం వల్ల ప్రత్యక్ష యుద్ధవాతావరణం వూళ్ళో లేదు. రాయబారాలు మొదలయ్యేయి గనులమీద ఆధారపడ్డ వడ్డెలు కొందరు పెద్దిరెడ్డి పక్షంలో చేరేరు. కొందరు గొల్లలు 'రైతులందరి మీదా ఆధారపడవలసిన వాళ్ళం' అని తప్పుకున్నారు. బలాబలాలు రాత్రిళ్ళు రాత్రిళ్లే మారిపోతున్నాయి.

వూరెట్లున్నా, వెంకట్రాముడు మాత్రం వేరొక ప్రపంచంలో జీవిస్తున్నాడు. చంద్రావతికి రెడు మూడు రోజులకొక వుత్తరం రాయటం, ఆమె వుత్తరం కోసం యెదురు చూడటం, యింటర్వ్యూ కోసం ఆతురతపడటం, తీరిక వేళల్లో యెక్కడికీ కదలకుండా యింటిదగ్గరే వుండటంతోనే రోజులు వెళ్ళబుచ్చుతున్నాడు. అపుడపుడూ సాయంకాలాలు రోడ్డుమీద యే రెండు మూడు మైళ్లో వొంటరిగా నడిచి చీకటిపడ్డాక యింటికి తిరిగి వచ్చేవాడు.

రాత్రి తండ్రి బృదంద్వారా వూరి విషయాలు తెలిసేవి.


యీ గొడవలన్నిటిని వెంకట్రాముడు తన సంసారక్కంతో కొలిచేవాడు. అది తప్పేమో అని అన్పించినా వెంకట్రాముడు ఆ పనిని చెయ్యకుండా వుండలేక పోయేవాడు.

దేవదానం వూరు విడిచిపోయినందుకు వెంకట్రాముడు చాలా బాధపడ్డాడు. వూరినుంచీ వెళ్ళిపోతూ దేవదానం వెంకట్రాముని యింటికి వచ్చేడు. వెంకట్రామునికి యేం మాట్లాడాలో దిక్కు తోచలేదు. వోదార్పుగా "పల్లెటూర్లలో మనలాంటి వాళ్లు బతకలేరు" అని దేవదానంతో అన్నాడు. దేవదానం వెంకట్రాముని వోదార్పు మాటలు నిర్లిప్తంగా విని వెళ్ళిపోయేడు. దేవదానం విషయంలో తన ప్రవర్తన సహజంగా లేదేమో అని దేవదానం వెళ్ళిపోయేక వెంకట్రాముడు బాధపడ్డాడు.

రోశిరెడ్డి తన్నులు తిన్న వార్త విన్నప్పుడు వెంకట్రామునికి ఆనందమే కలిగింది. అయితే మేరీపట్ల వెంకట్రామునికి పూర్తిగా సానుభూతి మాత్రం కలగలేదు. డబ్బుకోసం గడ్డి తిని వుంటుంది అనుకున్నాడు. పనీ పాటా లేక వొళ్ళు కొవ్వెక్కి వుంటుందనికూడా అనుకున్నాడు.

తన అన్న చర్యపట్ల వెంకట్రామునికి యే విధమైన వ్యతిరేక భావాలు కలగలేదు. వొకరకంగా సంతోషించేడు కూడా-- ఆమె కాపస్త్రీ అని తెలిసినప్పుడు. రెండుసార్లు "సదువుకునోళ్ళిడివి, కర్చులుంటాయి" అని అన్నకు తెలిసేటట్లే తన చేతిలో అయిదో పదో వుంచిన 'వదిన' అభిమానానికి వెంకట్రాముడు సిగ్గుపడిపోయేడు. అలా సిగ్గుపడినప్పుడు ఆమె అనేది; "నీదేదో పెద్ద సదువంటగా! నీకు పెద్ద వుద్యోగం వస్తుందని మీ యన్న అంటున్నాడులే అప్పుడు వసూలు చేసుకుంటాను- వడ్డీతో కూడా." ఆమె యెప్పుడూ నమిలే వక్కాకు, ఆమె మొరటు హాస్యం మాత్రం వెంకట్రామునికి చికాకు కలిగించేవి. ఆమె కులాన్ని యెందుకు వదిలిపెట్టాలో అని ఆలోచించినప్పుడు స్త్రీ పురుషుల శృంగార సంబంధాలకు కులంలేదు, మట్టీలేదు అని తరచు వెంకట్రామునికి అనిపించేది. తనలో తాను నవ్వుకునేవాడు.

చిన్న తమ్ముడు యింట్లోంచి పారిపోయినందుకు యింట్లోవాళ్లు వొకటి రెండు రోజులు మొత్తుకున్నారు. వెతికేరు. వెతికించేరు. తర్వాత వాళ్ళ పనుల్లో వాళ్ళు పడి మరచిపోయేరు. యెప్పుడయినా రాత్రిళ్ళు ప్రస్తావనకు వస్తే బాధపడేవాళ్ళు- ఆ తీరిక సమయంలో మాత్రం.



'యిక్కడ ప్రేమలకూ, కన్నీళ్ళకూ, బాధపడడాలకూ కూడా తీరికవుండదు' అన్న ఆలోచన వచ్చినప్పుడు, రెక్కలు ముక్కలు చేసుకుని అవస్థపడుతున్న తల్లిదండ్రులు, సోదరులు, చెల్లి పట్ల వెంకట్రాముడికి విపరీతమైన అనుకంప కలిగేది. ఒక్కొక్కమారు తమ్ముని కోసం తానే మిగతావాళ్ళకంటే యెక్కువ బాధపడుతున్నట్లు అనుకునేవాడు. అటువంటి సమయంలో వీళ్ళంతా 'యీ గొడ్డు బతుకు బతక్కపోతే యేం' అని వాళ్ళందరిమీదా మనసులో విసుక్కొనేవాడు.

అదేవిధంగా గ్రామ రాజకీయాల్ని తన సంస్కారంతో కొలిచి వెంకట్రాముడు పరిశీలించి 'అంతా పనికిరాని మనుషులు' అనుకున్నాడు. యిక వీళ్ళ జీవితం ఖూనీలతో, కోర్టుచుట్టూ తిరగడాలతో గడిచిపోతుందనుకున్నాడు.

యేదో వొకరోజు తను ప్రత్యక్ష జీవితంలోకి విసిరివేయబడతాననీ, అప్పుడు తన సంస్కారం దమ్మిడీ విలువచెయ్యదనీ, అలాగే గ్రామ కక్ష స్వరూపం

మారిపోతుందనీ వెంకట్రాముడు వూహించలేదు. చుట్టూ జీవితానికీ, తన సంస్కారానికీ పునాదులేవో వెంకట్రాముడు వొక్కనాడూ ఆలోచించలేదు.

సర్వీస్ కమీషన్ యింటర్వ్యూ రానే వచ్చింది.

యీ వూబినుంచి తొందర్లోనే బయటపడే అవకాశాలు తనకు అతి సమీపంలో వున్నట్లు వెంకట్రాముడు భావించుకొన్నాడు.

'నా పరీక్ష పోయింది. నువ్వు పాసయినందుకు సంతోషం. ఈపాటికి ఇంటర్వ్యూకూడా వచ్చివుంటుంది. నువ్వు హరిజనుడవైనా, గిరిజనుడవైనా చేసుకోగలిగిన ప్రయత్నాలేవైనా వుంటే చేసుకో. లేకపోతే నీ గతి అంతే'- యీ ధోరణిలో సాగిన క్లాస్‌మేట్ రంగనాథం వుత్తరం వచ్చేక వెంకట్రాముడు హడలిపోయేడు.

రంగనాథం వుత్తరంలో దేవదానం అవసరం తెలిసివచ్చింది. మంచీ చెడ్డా తెలిసిన దేవదానం వూళ్లో వుంటే బాగుండేది; బలవంతం చేసి ఆపినా బాగుండేది అనుకున్నాడు. దేవదానందగ్గరకు వెళ్ళి సంగతి సందర్భాలు చర్చిస్తే బాగుండు ననిపించింది; సిగ్గుపడి వెళ్ళలేకపోయేడు.

ఆ సమయంలో కడప పరిచయాలు వెంకట్రాముడి మనసులో మెదిలేయి. ముఖ్యంగా డి.ఆర్.వో. ఓబయ్య, ఎం.ఎల్.ఏ. పెంచలయ్యలు మాటిమాటికి గుర్తుకొచ్చేరు. వాళ్ళు తన కులంవాళ్ళు సాయం చెయ్యకపోతారా అని అనుకోవటానికి వెంకట్రాముడు సిగ్గుపడలేదు. అడ్మిషన్ల సందర్భంలో, సోషల్ వెల్‌ఫేర్ స్కాలర్‌షిప్ ఫారాలు గతంలో పూర్తిచేస్తున్నప్పుడు కలిగిన అనుకూల భావాలే, వాళ్ళను గుర్తుకుతెచ్చుకున్నప్పుడు కూడా వెంకట్రాముడికి కలిగేయి.

కడపకు వెళ్ళి అక్కడొకరోజో రెండురోజులో వుండి వాసు ద్వారా అన్ని ప్రయత్నాలూ చేయడం మంచిదని వెంకట్రాముడు అనుకున్నాడు. సచ్చిదానందం సర్వీస్‌కమీషన్ మెంబరుకాబట్టి, ఆయన సాయం కూడా అర్థించే మార్గం చూడాలి అనుకున్నాడు.

రాత్రి పొద్దుపోయేక, సుబ్బడు యింటికి వచ్చేడు. అప్పటికే అందరూ నిద్రపోతున్నారు. కొట్టానికి అంతదూరంలో పట్టా తీసుకొనిపోయి సుబ్బడు కూర్చున్నాడు. వెంకట్రాముడు తండ్రిదగ్గరకు వెళ్ళి పక్కనే కూచుంటూ యింటర్వ్యూ విషయం చెప్పేడు.

యేదో పెద్ద వుద్యోగం కొడుకుకు వస్తుందని సుబ్బడు ఆనందపడిపోయేడు.

"యెంత కావాల?" అన్నాడు, వుదారంగా.

"కనీసం మున్నూరు రూపాయలు."

సుబ్బడు తెల్లమొగం వేసేడు. అంత డబ్బు యెక్కడనుంచి తేవాలో, అర్థంకాక, యింటి గొడవల్ని చెప్పటం మొదలుపెట్టేడు—

సిన్నోన్ని యిూశ్వర్రెడ్డి దగ్గర యిన్నూర్రూపాయలు తీసుకొని పనికి పెడితే వాడిట్లా ముంచినాడు. ఆ డబ్బు కట్టమని యిూశ్వర్రెడ్డి తొందర సేస్తున్నాడు. మీ యన్నను సూస్తామా అంటే వాడు దాన్ని తగులుకొని వేరుకుండ పెట్టినాడు. వాడి సంపాదనకూ మనకూ సమ్మందం లేదు. నేనూ, మీ యమ్మా యిద్దరు పిల్లోళ్ళ సంపాదన తిండికే సాలటంలేదు. రయితులు కూడా యింతకు ముందు మాదిరి కాదు. పాతకాలంలో యింత అన్నేయం లేదు. యిప్పుడు అంతా లెక్కే. మనమీద వాళ్ళకు నమ్మకం లేదు. రయితు బాగుపరుస్తాడని మనకు నమ్మకంలేదు. వడ్డీకయినా, మన దగ్గర యేముందని యిస్తారు? ఆ మధ్యన నూరో యిన్నూరో వుంటే అదేదో పట్టాలు యిప్పిస్తామంటే ఆశకొద్దీ కరణం సేతిలో, కార్కూను సేతిలో పడేశినా- నలుగురితో పాటూ. ఆ కరణపోడు యేం సేస్తాడో? దానికి తోడు యిప్పుడు వూళ్ళో గొడవలు.... యెవరి దగ్గరికి పోడానికీ బయమే."

"యేంది మామా బయమంటున్నావు?"

మునిమామ, పెంచలు, పెద్దవోబులు, వెంకటేశు రావటం చూసి వెంకట్రాముడు విసుక్కున్నాడు. 'పొద్దుపోని ముసలి పక్షులు' అప్పుడే తయారయినాయి అనుకున్నాడు.

"యేందీ లేదులే. మావాని గొడవ. ఆ పెద్ద వుద్యోగానికి అయిద్రాబాదు పోవాలని వచ్చింది."

నలుగురూ తలగుడ్డలు పరుచుకొని కూచుంటూ "వుజ్జోగం దొరికిందా" అన్నారు.

"యింకా లేదు. దానికోసం ముందుగా అయిద్రాబాదు పోవాలంట! మున్నూరు రూపాయలు కావాలంటే మనూర్లో మనమాదిరోళ్ళకు యాడ దొరుకుతుంది?"

నలుగురూ మౌనంగా కూర్చున్నారు. అఖరుకు మునిమామ నోరు తెరిచాడు:

"యింట్లో ఆడోళ్ళు కూడబెట్టింది యెంత వుంది?"

"యాడిదిరా? నలబయ్యో యాబయ్యో వుంటుంది."

"పెద్దోన్ని అడుగు. వాడు తొడకచ్చుకున్నది వడ్డీకి తిప్పుతాంది"

"సరే వాడు వొక నూరు యిస్తాడనుకో, మిగతాది?"

"మేం నలుగురం మనోని కోసం తలా యిరవై యిస్తాం"– మునిమామ ప్రతిపాదనలో లోపల యిష్టం లేకపోయినా మిగతావాళ్ళు వొప్పుకున్నారు. అంతటితో మునిమామ వూరుకోలేదు—

"'తతవం' మామ యింకొక యిరవై సందా యెక్కువ యేస్తాడు,"

"నా దగ్గిర యాడిదిరా?" వెంకటేశు మూలిగేడు.

"మరి 'తతవం' మాట్లాడదమనుకున్నావా? యిద్దరు కొడుకులు, యెద్దులాంట్లోళ్ళు గని పనికి పోతున్నారు. వడ్డీకి కూడా తిప్పుతున్నావని అందరూ అనుకుంటూంటే."

అవుననీ, కాదనీ వెంకటేశు అనకుండా "సరే మనోని కోసం యేదో తంటాలుపడదాంలే" అన్నాడు.

మునిమామ ప్రతిపాదన, వందరూపాయలు వాళ్లివ్వటానికి ముందుకు రావటం చూచి, తను అంత నిస్సహాయ పరిస్థితిలో వున్నందుకు బాధ కలిగినా, వెంకట్రాముడిలో వాళ్ళ పట్ల కృతజ్ఞతాభావం కలిగింది. వీళ్లనేనా తానిన్ని రోజులూ అసహ్యించుకున్నది. అన్నభావం మనసులో మెదిలి వెంకట్రాముడు సిగ్గుపడ్డాడు.

"నువ్వెప్పుడు పోవాలి?"– మునిమామ అడిగేడు.

"డబ్బు దొరికితే రేపే".

"మర్నాడు పో. రేపు పైటేలకల్లా డబ్బు వొకసోట సేర్చే పూచీ నాది.... యిది అయిపోయింది. మనోడు ఆఫీసరు అవుతాడు. బాగుంది.... యిదుగో అల్లుడా నువ్వు ఆపీసరు అయినాక మేం యెప్పుడన్నా వస్తే యీళ్ళు నా పనోళ్ళు అని సెప్పేవు? నా కత నీకు తెల్సు. గబ్బ గడుగుతాను."

వెంకట్రాముడు నవ్వి "లేదులే మామా" అన్నాడు, మనస్ఫూర్తిగా.

"సరే.... సుబ్బడు మామా, యేదన్నా కత సెప్పు"

"యిప్పుడు వూళ్ళో వుండే కతలు సాలకనా?"

"యేం కతలుండాయి లచ్చనంగా యెవరి పనులు వాళ్ళు సేసుకుంటున్నారు?. నోట్లో మట్టిగానిపోయింది మాలోళ్ళు, వడ్డోళ్ళు, గొల్లోళ్ళు– వొకరికింద వాదిగి బతికే వాళ్ళంతా."

"యేందిరా. తతవం యిసిత్రంగా వుందే, యేం కత? వూర్లో కొట్టుకోరంటావా?" వెంకటేశు కుతూహలంగా అడిగేడు.

"యింక కాపోళ్ళు మాత్రం కొట్టుకోరు. వాళ్ళు వాళ్ళు"- మునిమామ "కొట్టుకోరు" అనే మాటను సాగదీశేడు.

వెంకట్రాముడికి గ్రామరాజకీయాలు విచిత్రంగా కన్పించేయి.

"యెందుకు?" అని అడిగేడు.

"అవతల పార్టీవాళ్ళు యివతల పార్టీవాళ్ళకు పిల్లనిస్తున్నారు."

"యేందో సరిగ్గా సెప్పు"- పెంచలు విసుక్కున్నాడు.

"సరిగ్గా సెప్పేదేముంది? రోశిరెడ్డికి అవతల పార్టీ లీడరు గంగిరెడ్డి తన కూతురుని యిస్తున్నాడు. కల్యాణం జరుగుతాంది."

వెంకట్రాముడితో సహా అందరూ ఆశ్చర్యపోయేరు.

"యెట్లా?"

"పెద్దోళ్ళు కలుసుకున్నారు. పోకనాటోళ్ళకు రాజంపేటలో సుట్టాలున్నారా? వాళ్ళ తరపున సెలపతి అని ఎం. ఎల్. ఏ., కోడిదోళ్ళ తరపున మన ఎం.ఎల్.ఏ. కలిసినారు. ఫైసలు సేసినారు. విన్నరాత్రి పులివెందల్లో...."

"మరి మాలోళ్ళు, వడ్డోళ్ళు, గొల్లోళ్ళు?"

"పెద్ద రయితులు పార్టీలు పెట్టేటప్పుడు యిచ్చిన అడ్వాన్సు దబ్బులు మన సారాయి యెంకటమ్మకు సేరినాయి. యింక వాళ్ళ సావులు వాళ్ళ సావులే."

వెంకట్రాముడికి గ్రామరాజకీయాలు మబ్బు విడినట్లు విడిపోయేయి.

మునిమామ మరో వార్త చెప్పేడు.

"యీలోగా మన కొంపలంటుకునేది మొదలయింది."

అందరూ కుతూహలంగా మునిమామ వైపు చూసేరు. మునిమామ నింపాదిగా అన్నాడు—

"కరణమయ్య మాట విని మనం యిండ్ల పట్టాలకు పెట్టుకున్నామా? అది.... రేపు సెప్తాలే.... మన వెంకట్రాముడు ఆఫీసరు కావాలా.... యీ కరణమయ్య పని పట్టాలా...."

-మునిమామ లేచిపోయేడు.

"యీడి తతవమేందో! అట్లా అంటించి యిట్లా పోతాడు"- వెంకటేశు లేచి పైపంచ విదిలిస్తూ అన్నాడు.

వెంకట్రాముడికి నవ్వాగలేదు.

ఆ రాత్రి కలలో వెంకట్రాముడు ఆర్. డి. వో. అయి రోశిరెడ్డి గని చేనును అందరికీ పట్టాలు యిప్పించేడు.

## 9

కడప బస్‌స్టాండులో దిగుతూనే తన సంకెళ్ళేవో విడినట్లు, స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చినట్లు వెంకట్రాముడు భావించేడు. జేబులోవున్న రెండు వందల డెబ్బయి రూపాయల చిల్లరను చూసుకున్నాడు. యేదైనా హోటల్లో దిగాలనుకొని, తనదగ్గరున్న డబ్బును సేకరించటంలో తండ్రిపడ్డ కష్టాలు గుర్తుకొచ్చి డబ్బు దండగ అనుకున్నాడు. సోషల్ వెల్ఫేరు హాస్టల్లో వుంటున్న అసాది రామదాసు కొడుకు అంకన్న గుర్తుకొచ్చి అక్కడికి బయలుదేరేడు. వెంక్రటాముడి హృదయం తొందరపడింది.

—అంకన్న యింకా కాలేజీకి పోయివుండడు. అక్కడ సూట్‌కేస్ పారేసి వాసు సార్‌ను యింటిదగ్గరో, కాలేజీలోనో కలుసుకోవచ్చు. యింటిదగ్గరే మేలు. చంద్రావతి కూడా వుంటుంది.

సోషల్ వెల్ఫేర్ హాస్టలున్న ప్రైవేటు బిల్డింగును చూచి, లోపలికి అడుగు పెడుతూ 'యిది హాస్టలా!!' అని విస్తుపోయేడు.

వెంకట్రాముడికి యూనివర్సిటీ హాస్టల్స్ చప్పున స్మృతికి వచ్చేయి.

హాస్టల్లో అంకన్న వున్నాడు. డైనింగు హాలుకు తట్ట, గ్లాసు పట్టుకొని గది లోంచీ పోతున్న అంకన్న, వెంకట్రాముడ్ని చూచి సిగ్గుపడ్డాడు. వెంకట్రాముడికి కూడా ఆ దృశ్యం రైతుల పెళ్ళికి తట్టా తపేలా తీసుకవెళ్ళే వాడలోని వాళ్ళను గుర్తుకు తెచ్చింది.


వెంకట్రాము డెప్పుడూ చదువుకునే రోజుల్లో సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో వుండి చదువుకున్నవాడు కాదు. స్కాలర్‌షిప్పులు యిచ్చేది యిస్తూ యిక్కడ కూడా వెలివాడలు నిర్మించాలా అనుకున్నాడు. వెంకట్రాముడు తన కొత్త అనుభవం నుంచీ తేరుకోక మునుపే, అంకన్న తన సిగ్గునుంచి బయటపడి తట్టా, గ్లాసు పక్కన పెట్టి కుశల ప్రశ్నలు వేసేడు. వెంకట్రాముడు సమాధానించి "పాపం! యింటికి ముఖం వాచిపోయినాడు" అనుకున్నాడు.

"యేం యిక్కడ అన్నమూ అదీ బాగుండదా?"

అంకన్న సిగ్గుతో సమాధానం చెప్పలేదు. ఆ కుర్రవాన్ని యిబ్బంది పెట్టలేక "నువ్వు పద! నేను అట్లా బయటకు వెళ్ళి వస్తా - రాత్రికి మాత్రమే నేను తిరిగి వచ్చేది- పని అయిపోతే రాత్రే హైదరాబాదు పోతా" అన్నాడు.

అంకన్న స్కూల్లో కొత్తగా చేరిన కుర్రాడిలాగా తలాడించేడు.

వెంకట్రాముడు అంకన్న గదిలో సూట్‌కేస్ పడవేసి బయలుదేరపోతూంటే అంకన్న మెల్లిగా అన్నాడు.




"సూట్ కేస్‌లో డబ్బూ అదీ పెట్టొద్దు."

అంకన్న జాగ్రత్తకు వెంకట్రాముడికి నవ్వు వచ్చింది. "లేదులే" అని బయటికి నడిచేడు.

గేటు తీసుకొని, వాసు యింటి కాంపౌండులోకి ప్రవేశించేడు. వరండాలో

యెవ్వరూ లేరు. యింట్లోకి వెళ్ళే తలుపు వేసి వుంది. 'వాసు సార్ లేదేమో' అనుకున్నాడు. వరండా మెట్ల దగ్గరకు వెళ్ళి, చంద్రావతిని పిలుద్దామా అనుకున్నాడు. గొంతు సవరించుకొని "సార్ సార్...." అని నాలుగైదుసార్లు పిలిచేడు.

తలుపు తెరచుకుంది. వొక లావుపాటి పొట్టి ఆవిడ బయటకు వచ్చింది. కరుస్తున్న ధోరణిలో "యెవరు?" అంది.

"సార్ యింట్లో లేడామ్మా?"

"కాలేజీకి వెళ్ళేరు"- అమె చూపుల్లో 'నువ్వెవరు' అన్న ధోరణి వుంది.

"చంద్రావతిగారు లేరా?"

యీమారు అమె అడగనే అడిగింది.

"యెవరు నువ్వు?"

ఆమె కంఠ మాధుర్యానికి వెంకట్రాముడు జడుసుకున్నాడు. తప్పు చేసినట్లు చెప్పేడు.

"వెంకట్రామున్నండి. అమె క్లాస్‌మేట్‌ను''

వెంకట్రాముడి వాలకం ఆవిడకు నచ్చలేదు. 'యింత పొడుగు వుత్తరాలు చంద్రావతికి రాసింది వీడేనా? వీడూ వీడి అవతారం....' అనుకుంది.

"నీకు సార్ కావాలా? చంద్రావతి కావాలా?"

అనుకోని ప్రశ్నకు వెంకట్రాముడు అదిరిపోయేడు.

"సార్ కోసమే వచ్చేనాండీ" అన్నాడు పీలగొంతుకతో.

వెంకట్రాముడి నాలుక తడి ఆరిపోతోంది. వెంకట్రాముడి కళ్ళకు ఆవిడ తనను నములుకొని తినటానికి సిద్ధంగా వున్న ఆడరాక్షసిలా కన్పించింది.

"అయితే కాలేజీలో వున్నారు. కలుసుకో."

--ఆమె యింట్లోకి వెళ్ళి దభాలున తలుపు వేసుకుంది.

గేటుదాటి రోడ్డుమీదికి వస్తూనే వెంకట్రాముడికి కలిగిన మొదటి ఆలోచన 'అంత మృదుస్వభావం కలిగిన వాసుసార్ యీమెను యెట్లా ప్రేమించినాడా' అని చంద్రావతికీ, యీవిడకూ రూపంలో, స్వభావంలో యెంత తేడా వుంది అనుకున్నాడు. 'వాసుసార్‌ది ఖచ్చితంగా ప్రేమ వివాహమైవుండదు; దేవదానం పొరపాటు పడివుంటాడు' అనుకున్నాడు. చంద్రావతి యింట్లో వుందో లేదో ఆ ఆడరాక్షసి యేద్వలేదు అని మండిపడ్డాడు.

కాళ్ళీడ్చుకుంటూ వెంకట్రాముడు కాలేజీకి వెళ్ళేడు. డిపార్టుమెంట్‌కు వెళ్తే

వాసు క్లాసులో వున్నట్లు అక్కడున్న లెక్చరరు చెప్పేడు. సందేహిస్తూనే వాసు రూంలో కూచున్నాడు. వెంకట్రామునికి అనుమానం కూడా వచ్చింది 'వాసు- సార్' నన్ను గుర్తిస్తాడా అని.

వాసు క్లాసు నుంచీ వచ్చేడు వెంకట్రాముడ్ని గుర్తించేడు. వెంకట్రాముడు లేచి నిలబడ్డాడు.

వాసు చిరునవ్వుతో "కూర్చో. యెప్పుడొచ్చేవు?" అడిగేడు.

"వుదయం బస్సుకు వచ్చినా సార్."

"మీ వూరినుంచేనా?"

అవునని వెంకట్రాముడు తలవూపేడు.

"యింటి దగ్గరకు వెళ్ళి వచ్చేవా?"

"అవును సార్. మీరు కాలేజీలో వున్నారని తెలిసింది. నేరుగా వచ్చినా"

చంద్రావతిని గురించి అడగాలని వెంకట్రాముని మనసు తొందర పెట్టింది, కానీ ఆ కోరికను అణచుకున్నాడు.

"మన సంఘం అక్టివిటీస్ యేమైనా జరిగినాయా సార్?"

"ఆ తర్వాత యేమీ జరగలేదు. అన్నట్లు దేవదానం కమలాపురంలో వుంటున్నాడు కదూ! యేమిటి మీ వూళ్లో యేవో గొడవలకు తట్టుకోలేక ట్రాన్స్ఫరు పెట్టుకున్నానన్నాడు-- ఆ మధ్య. అందరం కలిసి తంటాలుపడ్డాం అనుకో- ట్రాన్స్ఫర్ అయింది. యింతకూ మీ వూళ్లో గొడవలు అంత తీవ్రంగా వున్నాయా?"

ఆయన యే గొడవలను గురించి మాట్లాడుతున్నాడో, వాటికీ దేవదానం ట్రాన్స్ఫర్‌కూ సంబంధమేమిటో వెంకట్రామునికి అర్థంకాలేదు. దేవదానం యెందుకు ట్రాన్స్ఫర్ చేయంచుకోవలసి వచ్చిందో ఆ కారణాలను సభ్యత అడ్డంవచ్చి వాసుకు వెంకట్రాముడు చెప్పలేకపోయేడు. మౌనంగా వుంటే వాసు యేమనుకుంటాడోనని అబద్ధమాడేడు.

"స్కూలు వాతావరణం సరిపోలేదని ట్రాన్స్ఫర్ కోసం ప్రయత్నిస్తున్నట్లు అప్పుడు నాతో అన్నాడు సార్"

"అదే నాతోనూ చెప్పింది. బ్రాహ్మడెవడో హెడ్‌మాస్టరుగా వుంటున్నాడటగా? వాళ్ళెవరో చెప్పినట్లు వీళ్లున్నారే బ్రాహ్మలు సేవచెయ్యటానికి పనికొస్తారుగానీ యజమానులుగా పనికిరారు."

"మీరు బ్రాహ్మలే కదసార్—" వెంకట్రాముడు చనువుగా అన్నాడు.

"నేనా? నా బ్రాహ్మణ్యం మండిపోనూ....ఆఁ... అది మంటకలిసినా అప్పుడప్పుడు తెలీకుండానే మాటల్లో బయటపడుతుంది చూడు--"వాసు నవ్వేడు.

వెంకట్రాముడికి ఆ చర్చ కొనసాగించటం యిష్టంలేకపోయింది.

---పాపం! దేవదానం అవసరంకోసం అబద్ధమాడినాడు: తనకోసం వేరు కులాన్ని వాడుకోడం హర్షనీయమేనా అనుకున్నాడు.

వచ్చిన పని యెలా మొదలుపెట్టాలా అని వెంకట్రాముడు సందేహంలో పడ్డాడు.

"నువ్వు గ్రూప్ వన్ పాస్అయ్యావట కదా—చంద్రావతి చెప్పింది."

తననుకుంటున్న విషయాన్నే వాసు ప్రస్తావించే వేళకు, వెంకట్రాముడికి ప్రాణం లేచివచ్చింది. చంద్రావతికి మనసులో ధన్యవాదాలు అర్పించుకున్నాడు.

"ఆ విషయమే మీతో మాట్లాడదామని వచ్చినా సార్."

"యింటర్వ్యూ యెప్పుడు."

"యీ శుక్రవారమే సార్."

"యెల్లుండి అన్నమాట! నీకు తప్పకుండా వస్తుంది."

వాసు విశ్వాసానికి కారణాలు తెలియకపోయినా, ఆ మాట వెంకట్రాముడికి సంతోషాన్ని కలుగచేసింది,

"రిజర్వుడు వేకెన్సీలు యెన్ని?"

"మూడు సార్."

"అయితే కాంపిటీషన్ బాగా వుంటుంది. దానిదేముంది? వోపన్ కాంపిటేషన్‌లోకూడా నీలాంటివాడు రావచ్చు."

యేమిటి యీయన ధోరణి, పరధ్యానమేమో అని వెంకట్రాముడికి అనుమానం కలిగింది. వాసు సలహాయిచ్చేడు;

నువ్వొకసారి మన డి. ఆర్. ఓ. ఓబయ్యగారిని, ఎం. ఎల్. ఏ. పెంచలయ్య గారిని కలిస్తే బాగుంటుంది. ఆ దినం మీటింగ్‌లో కలిశేవు కదా! నీలాంటి వాని సెలెక్షన్ కోసం మన కులనిర్మూలన సంఘం న్యాయంగా చెయ్యగలిగింది చెయ్యాలి. వాళ్ళను కూడా కలవటం మేలు."

వెంకట్రాముడు తలాడించేడు.

"పెంచలయ్యగారు వూళ్ళోనే వున్నారనుకుంటా. రేపో యెల్లుండో యేదో పనిమీద హైదరాబాదు వెళ్ళాలన్నాడు. మాట్లాడదాం."

"మీ యిష్టం సార్. మిమ్మల్ని నమ్ముకొని వచ్చినా"—తన వినయం తనకే అసహజమనిపిస్తున్నా వెంకట్రాముడు సాధ్యమైనంత వినయంగా అన్నాడు.

"చెయ్యగలిగింది చేద్దాం. నాకు మధ్యాహ్నం క్లాసులు లేవు...."

వొక పదిమంది విద్యార్థులు వాసు గదిలోకి వచ్చేరు. వాళ్ళలో అంకన్న కూడా వుండటం వెంకట్రాముడు గమనించేడు. వెంకట్రాముడ్ని చూసి,అంకన్న వెనుకకు తప్పుకున్నాడు.

యిద్దరు విద్యార్థులు ముందుకొచ్చి వాసుతో అన్నారు :

"యిట్లా అయితే మేం తట్టుకోలేం సార్! యిన్నాళ్ళూ మిమ్మల్ని చూసి వూరుకున్నాం."

"మళ్ళీ యేం జరిగింది?"

"రోజూమాదిరే సార్. రాత్రిళ్ళు బాగా తాగి రావడం; బయటనుంచి వేరే గెస్టలను తెచ్చి జొరబడి తినడం, బోర్డర్లకు అన్నం లేకుండా చేయడం! పొద్దున గలభా చేసినారు. కొంచెం ఆలస్యం అయ్యే వేళకు అంకన్నకు, మరొక నలుగురికి అన్నం లేదు. అంకన్నే వచ్చినాడు అడగండి సార్. డెప్యూటీ వార్డెను అండ చూసుకొని వాళ్ళ అరాజకం మరీ యెక్కువైంది సార్."

"యెవరు ఫైనల్ ఇయర్ వాళ్ళేనా?"

"అఁ. మునెయ్య, నరసింహులు సార్. వాళ్ళకు తోడు మరొక యిద్దరు యింటరువాళ్ళు తోడైనారు సార్"— గుంపులోనుంచి యెవరో అన్నారు.

"డెప్యూటీ వార్డెనుకు అక్కడ బాటిల్లు సప్లయి చేసేది. కలిసి తాగేది, దొంగ బిల్లులు రాసేది, యిక్కడ మా నోట్లో మట్టికొట్టేది"— గుంపులోంచి మరో గొంతు మూలిగింది.

వెంకట్రాముడికిదంతా నాటకంలాగుంది.

"అ రాత్రీమ వున్నప్పుడు వొకరకంగా నయం సార్. ఈయన స్టాఫ్ మెంబరని యినాళ్లూ వూరుకొన్నాం. మీరు ప్రిన్సిపాల్‌తో చెప్పి మునెయ్య నరసింహులు వాళ్ళమీద అక్షన్ తీసుకోమనాల సార్. ఈ డెప్యూటీ వార్డెన్‌ను తీసివేయమని కూడా చెప్పండి."

విద్యార్థి నాయకులకు వాసు పరమ శాంతంగా జవాబిచ్చేడు-

"ప్రిన్సిపాల్‌తో చెబుతాను. మీరు శాంతంగా వుండండి. యిక మీరు వెళ్ళండి. నేను చెబుతున్నానుగా?"

"మీరు చెప్తారనే వచ్చినాం సార్. చెప్పకపోతే మేం వెల్ఫేరు ఆఫీసరు దగ్గరకూ, కలెక్టర్ దగ్గరకూ పోవాల్సివుంటుంది"— గుంపులో ఒకడన్నాడు.

"వెల్ఫేర్ ఆఫీసరు దగ్గరకు యెందుకు? ముందు సార్ చెప్పనీ. తర్వాత కుదరకపోతే కలెక్టరు దగ్గరకే పోదాం — వీరదాసుతో మాట్లాడి"

విద్యార్థినాయకుని మాటకు సమ్మతించి అందరూ బిలబిల మంటూ బయటికి వెళ్ళిపోయేరు.

వాసు కొన్నిక్షణాలు తేరుకోలేకపోయేడు. వుదయం తనవల్లనే అంకన్నకు భోజనం లేకపోయింది అనుకుంటూ వెంకట్రాముడు బాధపడుతున్నాడు.

వాసు పేలవంగా నవ్వుతూ అన్నాడు.

"వెల్ఫేర్ హాస్టల్స్ అన్నతర్వాత రకరకాల కుటుంబ పరిస్థితులనుంచి వస్తారు. యేదో సర్దుకుపోవాలి. పిల్లలంతా మంచివాళ్ళే. యీ వీరదాసు ఒకడు వీళ్ళ అసంతృప్తిని రెచ్చగొట్టటానికి."

"వీరదాసేం చేసినాడు సార్,"

వాసు మొత్తం కథను పది పదిహేను నిముషాలు చెప్పేడు. జరిగిన సన్నివేశాన్ని, వాసు చెప్పిన వివరాలనుబట్టి వీరదాసుది యిందులో యేంతప్పుందో వెంకట్రాముడికి అర్థంకాలేదు. కులనిర్మూలన కార్యదర్శిగా తప్ప, వాసుకు వెల్ఫేర్ హాస్టలుతో వున్న ప్రత్యక్ష సంబంధ మేమిటో కూడా వెంకట్రాముడికి మాత్రం అర్థంకాలేదు. వెంకట్రాముడికి చూచాయగా అర్థమయిన విషయాలు–హాస్టల్లో అరాచకముందని, డెప్యూటీ వార్డెను తాగుబోతూ, లంచగొండి అని, అతనికి యెవరిదో బలమైన అభయ హస్తముందని, రౌడీ విద్యార్థులకు డెప్యూటీ వార్డెన్ ఆశీస్సులున్నాయని.


"తన అదృష్టమేమో యెక్కడున్నా, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనసును తొలిచే యీ అనుభవాలు తప్పవు; వీటిద్వారా తన కుల హైన్యస్థితి కళ్ళకు గట్టకుండా వుండదు అని వెంకట్రాముడు మధనపడ్డాడు.

"ముందు డి.ఆర్.వో.ను ఆఫీసులో కలు. ఆ తర్వాత మధ్యాహ్నం మూడు గంటలకల్లా యింటికొస్తే పెంచలయ్య దగ్గరకు వెళ్దాం. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వస్తాను. డెప్యూటీ వార్డెన్ కొలీగ్ కావటం నా దురదృష్టం...." గొణుక్కుంటూ వాసు ప్రిన్సిపాల్ దగ్గరకు బయలుదేరేడు.

వాసు గదిలోంచి బయటికి వచ్చేక, వెంకట్రాముడికి కాఫీ తాగాలనిపించింది. కాలేజీ కాంటీన్లోకంటె స్టేషన్ దగ్గర హోటల్‌ల్లో కాస్త విశ్రాంగా వుంటుంది అక్కడ కాఫీ తాగవచ్చు అనుకొంటూ బయలుదేరేడు.

స్టేషన్ దగ్గర వెంకట్రాముడికి వీరదాసు యెదురయ్యేడు. వీరదాసే గుర్తించి నవ్వుతూ ఆత్మీయంగా పలకరించేడు.

"బాగున్నావా? యెప్పుడొచ్చినావు?"




"పొద్దున"

"యెక్కడ దిగినారు?"

వెంకట్రాముడు చెప్పేడు. యిద్దరూ కలిసి రోడ్డంట బయలుదేరేరు.

అంకన్న రూంలోనా? ఆ కుర్రవాడు మంచి యింటలిజంట్. మీకంటే మెతక."

"వీరదాసు వ్యాఖ్యకు వెంకట్రాముడు ఆశ్చర్యపోయేడు. 'తను మెతక అని యెట్లా అనుకున్నారు' అని వెంకట్రాముడు వీరదాసును అడుగుదామనుకొనేంత లోగా వీరదాసు అన్నాడు—

"మీరు యీదినం హాస్టల్‌లో వుండకండి. వేరెక్కడయినా వుండడం మంచిది"

"యేం?"

"మీరు కాలేజీ నుంచే వస్తున్నారు. వాసు సార్‌ను కలిసే వుంటారు. అక్కడ జరిగింది చూచి అయినా వుంటారు."

'వీరదాసు అసాధ్యుడు' అనుకున్నాడు వెంకట్రాముడు.

"మీరనిందీ నిజమే. యెందుకీ గొడవలు?"

వున్నట్లుండి రోడ్డుమీద వీరదాసు ఆవేశంగా అన్నాడు;

"చూస్తూ సహించమంటారా?"

"సహించమనను.... స్టూడెంట్స్ తమలో తాము కొట్లాడుకోవడం!"

"అయితే వందమంది మంచివాళ్ళూ, అమాయకులూ వొకరిద్దరు వెధవల కోసం బలి కావాలంటారా?"

"ఆ వొకరిద్దరూ మనవాళ్ళే కన!"

వీరదాసుది యే కులమో తెలుసుకోకుండానే 'మనవాళ్ళు' అని మాట జారి నందుకు వెంకట్రాముడు నాలిక కరుచుకున్నాడు. వీరదాసు అదేమీ పట్టించుకో లేదు. మండిపడుతూ అన్నాడు.

"ఆ ప్రయత్నమూ జరిగింది. నాలుగు దమ్మిడీల సుఖంకోసం వాళ్ల అందర్నీ తాకట్టుపెట్టేవాళ్లు. యిటువంటివాళ్ళ సాయంతో ఆ డెప్యూటీ వార్డెను దేశాన్ని కూడా తాకట్టు పెట్టగలిగిన వాడు కులనిర్మూలనం ఎం.ఎల్.ఏ. పెంచలయ్య పెట్టుకున్న బలిజామె కొడుకు. ఆ డెప్యూటీ వార్డెన్."

"ఆమె తప్పేముంది?"

"సారీ! ఆమె కులం పేరెత్తడం నా వుద్దేశ్యం కాదు. యిప్పటికి యేడెనిమిది వేలు తిని వుంటాడు, పిల్లల నోట్లో మట్టి గొట్టి. చార్జి తీసుకొని యింకా సంవత్సరం పూర్తికాలేదు. వొక్కొక్క స్టూడెంటుకిచ్చేది నెలకు యెనభై రూపాయలు. దాంట్లో యీ గతుకుడు. ఎం.ఎల్.ఏ.కు కావలసినవాడని వెల్ఫేరు ఆఫీసరు కలుగజేసుకోడు. అతని భాగం అతనికీ. యీ కులనిర్మూలన సంఘంవాళ్ళకు యీ విషయాలు పట్టించుకోవాలంటే భయం! వీళ్ళందర్నీ చూసి చూసి విసుగెత్తిపోయింది .... నరికితే గానీ బాగుపడరు.... సారీ మీకు బోర్ కొట్టినా"

"అదేం లేదు. కాఫీ తాగుదాం రండి."

యిద్దరూ కాఫీ తాగుతుంటే వీరదాసు అడిగాడు;

"యేం పని మీద వచ్చినారు?"

"సర్వీస్ కమీషను యింటర్వ్యూ వుంది. హైదరాబాదు వెళ్తూ యిక్కడ దిగినా— యీ రోజు మిత్రులను చూచిపోదామని" — వీరదాసుదగ్గర నిజం దాచినందుకు వెంకట్రాముడు లోలోపల బాధపడ్డాడు.

వీరదాసు సాలోచనగా అన్నాడు:

"మీ మాదిరి వాళ్ళన్నా ఆఫీసర్లుగా వస్తే కొంతయినా నయం! అయినా యీ చట్రంలో యెంత మంచి ఆఫీసరయినా చెయ్యగలిగిందేముంది?.... అదే ఆలోచిస్తున్నా. సారీ వస్తాను. హైద్రాబాదునుంచి వచ్చేప్పుడు రా...."

వీరదాసు మెరుపులా వెళ్ళిపోయేడు.

వెంకట్రాముడి మనసులో రకరకాల ప్రశ్నలు తలయెత్తేయి.

—కులనిర్మూలన సంఘ సమావేశంలో పట్టణాలను కాక పల్లెలను కార్య

క్షేత్రంగా తీసుకోవాలని వాదించిన వీరదాసు పట్టణానికే యెందుకు పరిమిత మయినట్లు? పరిమితం కాలేదేమో! వెలివాడల మాదిరి ప్రభుత్వం యేర్పాటు చేసిన సోషల్ వెల్ఫేరు హాస్టళ్ళను రద్దుచేసి సవర్ణ హిందువులతోపాటు వాళ్లు చదువుకొనే యేర్పాటు చేయాలని ఆందోళన యెందుకుచెయ్యనట్లు? చేస్తున్నాడేమో ఒకే కులంలో ఘర్షణలు వీరదాసు యెందుకు తెస్తున్నట్లు? తమ కుల సమస్యలతో వీరదాసు మమైక్యం చెందినట్లు తానెందుకు చెందలేకపోతున్నాడు? వీరదాసు గమ్యం యేమిటి? తన గమ్యం కేవలం వుద్యోగమేనా? ఈ రోజు సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో యేమి జరుగుతుందో?

వెంకట్రాముడికి స్పష్టమైన సమాధానాలు తోచలేదు. ఆలోచించేకొద్దీ వెంకట్రాముడి మనసు గిజిగాని గూడులా తయారైంది.

## 10

కలెక్టరాఫీసు మేడమీద వరండాలో మాసిన చిరుగు దుస్తుల్లో, రేగినజుట్టుతో యిరవైమంది వరకూ వెంకట్రాముడికి కన్పించేరు. వాళ్ళు హరిజనులని వెంకట్రాముడు వెంటనే పోల్చుకున్నాడు. వాళ్ళ మధ్యగా వెళ్ళి, అక్కడ జవానును విచారించేడు—డి.ఆర్.ఓ. ను చూడాలని. ఆ జవాను వెంకట్రాముడిని నఖశిఖ పర్యతం చూచి, వొక స్లిప్ యిచ్చి "దొర చానా పనిగా వున్నారు. స్లిప్ రాస్తే లోపల పెడతాను సార్" అన్నాడు.

వెంకట్రాముడు క్షణం తటపటాయించి "వెంకట్రాముడు ఎం. ఎ., ఎగ్జిక్యూటివ్ మెంబర్. 'కుల నిర్మూలన సంఘం, అని స్లిప్‌రాసి జవాను చేతికిచ్చాడు.

"ఆ రూంలో కూచోండి సార్. యీ తంబ తంబ పోతూనే...." అంటూ జవాను స్లిప్ లోపలికి తీసుకువెళ్ళేడు.

'తంబ, తంబ' అంటే వెంకట్రాముడికి వెంటనే స్ఫురించలేదు. కాసేపటికి ఆ మాటకు మంద అనే అర్థం స్ఫురించింది వీళ్ళు వీడికి కూడా లోకువేనా? అన్న భావం మనసులో మెరిసింది.

వరండాలోని హరిజనులపట్ల వెంకట్రాముడికి తీవ్రమైన అనుతాపం కలిగింది. వాళ్ళ మురికిని చూసి, తన వాడ, వాడలోని జనం గుర్తుకొచ్చి వెంకట్రాముడు నిర్వేదానికి గురి అయ్యేడు.

హరిజనులకు పిలుపు వచ్చింది. వాళ్ళంతా లోపలికి వెళ్ళేరు. అయిదు నిముషాలు గడిచింది. వాళ్ళింకా బయటకు రాలేదు.

"దొర పిలుస్తున్నారు" అన్న జవాను పిలుపుతో వెంకట్రాముడు యీ

లోకంలోకి వచ్చేడు. అయితే డి. ఆర్. వో. తనను గుర్తించేదన్నమాట అనుకొని సంతోషంతో లోపలికి వెళ్ళేడు.

హరిజనులంతా ముకుళిత హస్తాలతో నిల్చొనివున్నారు. లోపలికి వస్తున్న వెంకట్రాముడికి వాళ్ళు అతిగౌరవంగా దారి యిచ్చేరు. వెళ్ళి డి. ఆర్ వో. ఓబయ్యకు నమస్కారం చేసేడు. కూర్చోవాలా వద్దా అని సందేహిస్తూంటే "కూర్చో" అని ఓబయ్య లోలోపల విసుక్కుంటూ అన్నాడు వెంకట్రాముడు కూచున్నాడు.

హరిజనుల వైపు తిరిగి ఓబయ్య అన్నాడు—

"మీ పిటిషన్ తప్పకుండా చూస్తా. యిచ్చినారు కదా. యిక వెళ్ళండి."

"మీరు సూడకపోతే లాబంలేదు సోమీ. తాసిల్దారు, కార్కొను కరణం మమ్మల్ని తింటారు"— వొక యువకుడన్నాడు.

"అరే. నేనెన్ని మార్లు చెప్పింది—పై ఆఫీసర్లమీద తంటాలొద్దని. నేను చూస్తానని చెప్తున్నాకదా."

"సిత్తం సోమీ" — యేక కంఠంతో అందరూ తమ రాజభక్తిని ప్రకటించేరు.

వాళ్ళు వెళ్ళిపోయేరు.

యిక్కడ కూడా అవే దండాలేనా, యిక్కడ కూడా అదే బానిస బ్రతుకేనా అన్పించింది, వెంకట్రాముడికి. వూళ్ళో రైతులకు, ప్రభుత్వాధికారులకు వెంకట్రాముడికి తేడా కన్పించలేదు. వెంకట్రాముడి మనసు చిరాకుగా తయారైంది.

"యస్! యెప్పుడొచ్చినావు?"— ఓబయ్య డి. ఆర్. వో. దర్పంతో అడిగేడు.

వెంకట్రాముడు, తను వుదయం వచ్చిన సంగతి, గ్రూప్ వన్ పాస్ అవటం, సర్వీస్ కమీషను యింటర్వ్యూ విషయం చెప్పేడు. అయిష్టంగా నే "మీరేదైనా సహాయం చేస్తే నా కష్టాలు తీరతాయి" అన్నాడు.

ఓబయ్య తూచినట్లు మాట్లాడేడు—

"సర్వీస్ కమీషన్ యింటర్వ్యూల సంగతి మీలాంటి వాళ్ళకు తెలియదు. గ్రూప్ వన్ పాసవుతూనే యేదో పెద్ద వుద్యోగం వచ్చినట్లు అనుకుంటారు. వున్న విషయం మాట్లాడుతున్నందుకు కోపగించుకోవద్దు. నేనేం చెయ్యగలను చెప్పు? మెరిట్ వుంటే దానంతకు అదే వస్తుంది. రాకపోతే నేను చెయ్యగలిగిన సహాయం వొకటి వుంది. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ దేనికైనా డెప్యూటి వార్డెనుగా

వేయించగలను— అదీ వచ్చే యేడాది. నీ యిష్టం.... అర్జంట్ ఫైల్సున్నాయి-"

ఓబయ్య ఫైల్స్‌లో మునిగినట్లు నటించేడు.

"థాంక్స్ వస్తాను సార్."— వెంకట్రాముడు లేచి, వొక్క వూపున బయటపడ్డాడు.

వెంకట్రాముడికి ఓబయ్యమీద, ఓబయ్యను కలుసుకోమన్న వాసుమీద తెగ కోపం వచ్చింది. ఓబయ్య హరిజనులతో మాట్లాడిన తీరుకు, తనతో మాట్లాడిన తీరుకు పెద్ద తేడా లేదని వెంకట్రాముడు నిశ్చయంగా అనుకున్నాడు. వెంకట్రాముడికి కన్పించిన తేడా అల్లా— 'ఓబయ్య తనను కుర్చీలో కూర్చో నిచ్చేడు. వాళ్ళను కూర్చోనివ్వలేదు;"

—ఎం. ఎల్. ఎ. పెంచలయ్య కూడా యిట్లాగే మాట్లాడవచ్చు. అయినా ఓబయ్య వుద్దేశ్యమేమిటి? తన యేడ్పల్లా యింటర్వ్యూలో యేదైనా అన్యాయం జరుగుతుంది, వీళ్ళంతా కలిసి సచ్చిదానందంలాంటి పెద్దలకు చెపుతారని. హరిజన సేవలని, కుల నిర్మూలనలని కబుర్లు!

మధ్యాహ్నం యెండ, రోడ్డుమీద దుమ్ము, పొద్దున నుంచీ తిరిగిన కాళ్ళ నొప్పులు, విసుగు, కళ్ళ మంటలు, కడుపులో ఆకలి, వెంకట్రాముడికి మరింత మంటను పుట్టించేయి.

హోటల్లో చల్లటి ఫానుగాలి కింద ప్లేటు భోజనం తిన్న తర్వాతగానీ వెంకట్రాముడికి కొంత శాంతి కలగలేదు.

వెంకట్రాముడికి అలసటతో నిద్ర ముంచుకొస్తోంది.

అంకన్న హాస్టలుకు వచ్చి వుంటాడు; యేమైతే అది అవుతుంది! హాస్టలుకు వెళ్ళి గదిలో పడుకొని రాత్రికి హైదరాబాదు బస్సెక్కేస్తే సరిపోతుంది అనుకున్నాడు. వీరదాసు హెచ్చరిక జ్ఞాపకంవచ్చింది. అంకన్నకు యేమీ కావదు కదా అని ఆందోళనపడ్డాడు. అందరూ కలిసి కట్టుగా వుంటే యేం జరుగుతుంది అనుకున్నాడు.

రోడ్డుమీద యెండల్లో నడిస్తే నిద్ర దానంతకు అదే పోతుందనుకొంటూ, వెంకట్రాముడు హోటల్ సుఖం నుంచి బయటపడ్డాడు. రోడ్లంట తిరిగేడు.

రోడ్డంట వెళుతున్న వొక కుర్రాన్ని టైం అడిగి "మూడు కావచ్చి"ట్లు వెంకట్రాముడు తెలుసుకున్నాడు. 'వాసు యింటికి పోవలసిన టైం అయింది' అనుకున్నప్పుడు వాసు భార్య సంస్కారం వెంకట్రాముడికి గుర్తుకొచ్చింది. భయమేసింది. చంద్రావతి మనసులో మెదలటంతో మళ్ళీ వుత్సాహం వచ్చింది.

యింటిదగ్గర వాసు, వరండాలో కూచొని వున్నాడు. వెంకట్రాముడు వుత్సాహంగా గేటు తీసుకొని లోపలికి వెళ్ళేడు.

"రా కూర్చో. ఓబయ్యగార్ని కలిసేవా?"

"కలిసినాను సార్"— ఆ తర్వాత యేం చెప్పాలా అని ఆగేడు.

"యేమన్నారు?"

"మెరిట్ వుంటే దానంతకు అదే వస్తుందని అన్నారు సార్."

"మెరిట్ వుండబట్టే కదా పాస్ అయ్యేవు.... పోనీలే మరొక మార్గం ఆలోచిద్దాం. అన్నట్లు ఎం. ఎల్. ఎ. పెంచలయ్య రాత్రి హైదరాబాద్ వెళ్ళేరట! నీకు వీలుంటే హైదరాబాదులో ఎం. ఎల్. ఎ. క్వార్టర్స్‌లో కలుసుకో. అడ్రస్ యిస్తాను. యిలాంటివి సచ్చిదానందంగారికి యిష్టం లేకపోయినా యింటర్వ్యూకు ముందు యింటి దగ్గర కలువు, చేయగలిగిన సాయమేదైనా వుంటే తప్పక చేస్తారు ఆయనకు వుత్తరం కూడా కావాలంటే యిస్తాను."

"అక్కరలేదు సార్. యింటి అడ్రస్ మాత్రం యివ్వండి."

"వుండు!"— వాసు లోనికి వెళ్ళేడు.

వెంకట్రాముడు టీ పాయ్ మీదున్న అవాళ దినపత్రిక తిరగేస్తూ, విసుగేసి 'చంద్రావతి వూళ్ళో లేనట్లుంది' అని తలుపు వైపు చూసేడు. గాంధీబొమ్మ ఖాదీ కర్టన్ అడ్డంగా వుంది.

లోపలనుంచి కరుకుగొంతు విన్పించింది.

"అడ్డమైనవాళ్ళూ సమయా సందర్భాలు లేకుండా వస్తారు."

"ప్లీజ్ సూర్యా! నెమ్మదిగా మాట్లాడు."

"యేదైనా హోటల్ పెట్టండి. కావాలన్నప్పుడు తాగొచ్చు. యివ్వొచ్చు."

"ప్లీజ్ సూర్యా! అతనికి విన్పిస్తుంది. మన చంద్రావతి క్లాస్‌మేట్ కూడా."

"తెలుసు. వాడు రాసిన కట్టలు కట్టలు చెత్త చదివేవాన్ని — అదే నవ్వుతూ చూపేది — 'చూడు లోకంలో యెలాంటి ఫూల్స్ వున్నారంటూ.' అదేదో పొద్దు పోక రాస్తే. వీడు అది ప్రేమ అనుకున్నట్లుంది. యిలాంటివాళ్ళను చుట్టూ చేర్చుకుంటారు. యేం మనుషులో! సరేలే! వొక కప్పు కాఫీ పోస్తే నాదేం పోతుంది — పనిమనిషికి పోసాననుకుంటా." దాని భాగం వుండనే వుంది.—

వరండాలోని వెంకట్రాముడికి కాళ్ళకింద నేల కంపించింది. అక్కడినుంచి పారిపోదామనుకున్నాడు. వాసు లోపలినుంచి వచ్చి, పేలవంగా నవ్వుతూ అనుమానంగా అడిగేడు.

"పేపరు చూస్తున్నావా? యివిగో అడ్రసులు. సచ్చిదానందంగారిని అడిగేనని చెప్పు."

"అట్లాగే సార్! పోయొస్తాను. మీకు చాలా శ్రమ యిచ్చినా."

"శ్రమ యేముంది? కాస్త కాఫీ తాగి వెళ్దువుగానీ...."

"యిప్పుడే తాగి వచ్చినా సార్, మీ యింటికి వచ్చే ముందరగానే."

వెంకట్రాముడు గేటు వద్దకు వెళ్ళేడు. మర్యాద సూచకంగా వాసు వెంట వచ్చేడు

గేటు తీసుకొని, రోడ్డుమీదికి వచ్చి నిర్వికారంగా వెంకట్రాముడు వాసును అడిగేడు.

"చంద్రావతిగారు వూళ్ళో లేరా సార్?"

తన భార్య సూర్యావతి, తన మధ్య జరిగిన సంభాషణ వెంకట్రాముడు వినలేదని వాసు అనుకున్నాడు.

"లేదు. డిల్లీలో వాళ్ళ అన్న దగ్గరకు వెళ్ళింది."

"రాత్రికే హైదరాబాద్ వెళతాను సార్. సెలక్షన్ వస్తే మీకు తెలుపుతాను"

కదిలిపోతున్న వెంకట్రాముడిని చూస్తూ "అమాయకుడు పాపం." అనుకున్నాడు వాసు. వెంకట్రాముడి విషయంలో చంద్రావతి ప్రవర్తన వాసుకు అర్థంకాక ఆలోచిస్తూ గేటువేసి వరండాలో కూలబడ్డాడు. 'వీళ్ళు మెదళ్ళను తినే రాక్షసులు' అనుకున్నాడు.

తనను తెలివితక్కువవాన్ని చెయ్యడానికి, తనకు పొద్దుపోవడానికే చంద్రావతి వుత్తరాలు రాసిందన్న వాసు భార్య మాటలు వెంకట్రాముడి చెవుల్లో మారుమ్రోగేయి.

వాసు భార్యకంటే అన్న తోడుకొని వచ్చి కాపురం చేస్తున్న ఆమె నయం అనుకున్నాడు.

చంద్రావతితో పోల్చటానికి వెంకట్రాముడికి యే పోలికా దొరకలేదు. అప్పుడుకానీ చంద్రావతి రాసిన వుత్తరాల్లో యే ప్రేమా లేదని వెంకట్రాముడికి తోచలేదు.

## 11

అఫ్జల్‌గంజ్ బస్‌స్టాండులో దిగిన వెంకట్రాముడికి యెటు వెళ్ళాలో, యెక్కడ దిగాలో తోచలేదు. రిక్షాలూ, ఆటో వాళ్ళ పిలుపులూ అయోమయంగా తోచేయి.

—తనకు హైదరాబాదు కొత్త. బాల్యంనుంచి యీ రోజువరకు తనకు తెలిసింది మీదిపెంట్ల మాదిగిండ్లు; కడప; తిరుపతి— అప్పుడో యిప్పుడో షలి వెందుల వంటి వొకటి రెండు టౌన్లు.

తన భౌగోళిక జ్ఞానంమీద వెంకట్రాముడికి మొదటిసారిగా కోపం వచ్చింది

"నువ్వెక్కడ పోవాల?—" ప్రశ్నించిన ఆగంతకుడు యెవరా అని వెంకట్రాముడు చూసేడు. తనతోపాటు బస్సులో వచ్చిన ప్రయాణీకుడని గుర్తించేడు.

వొకటి రెండు ముక్కల్లో, తాను వచ్చిన కారణం, తనకు నగరం కొత్త అనే విషయం చెప్పేడు.

ఆగంతకుడు తన్ను తాను పరిచయం చేసుకున్నాడు. తన పేరు నరసింహరావని, తాను హైదరాబాదు వచ్చిన సంగతీ సందర్భాలు వివరించేడు.

వెంకట్రాముడు తటపటాయిస్తూ నరసింహరావును అడిగేడు.

"నాకేదైనా చీప్ లాడ్జి చెప్తారా?"

నరసింహరావు క్షణం ఆలోచించి అన్నాడు.

"నాంపల్లి మీదుగానే నేను వెళ్ళేది. నిన్నక్కడ యేదన్నా లాడ్జిలో దించి వెళ్తాలే."

వెంకట్రాముడు, నరసింహరావు కలిసి రిక్షాలో నాంపల్లి బయలుదేరేరు. అప్పుడే నిదుర లేస్తున్న మహానగర శోభను తిలకించటంలో వెంకట్రాముడు నిమగ్నుడయ్యేడు. నరసింహరావు ముభావంగా తన ఆలోచనల్లో తాను పడ్డాడు.

రిక్షా ఆగింది.


"యీ లాడ్జి కాస్త చీప్. నువ్వు దీంట్లో దిగు. అన్నిటికి కాస్త దగ్గిరే.... నేనొస్తా! యిక్కన్నుంచి నడిచిపోతాలే. మా బంధువుల యిండ్లు దగ్గిరే"

"థాంక్స్"— వెంకట్రాముడు రిక్షావానికి డబ్బులు యిచ్చి పంపేడు.

పోతూ పోతూ నరసింహరావు అన్నాడు.

"నీకు తప్పకుండా వుద్యోగం వస్తుంది. మా బ్రాహ్మలను యెవరు పట్టించుకుంటారు? యీ రోజుల్లో మీది, రెడ్లది, కమ్మవాళ్ళది బాగుంది. మీకు కుల ముంది. వాళ్ళకు డబ్బులున్నాయి! మంత్రులూ, ఎం. ఎల్. ఏ లు వున్నారు. వుద్యోగం వస్తే నన్ను మరిచిపోకు.... నేను అయిదేండ్లనుండి వుద్యోగం లేకుండా చస్తున్నా."

నరసింహరావు వొక్కొక్కమాటా వెంకట్రాముడి గుండెను, కత్తుల్లా దూసుకు వెళ్ళేయి.




యేమిటి యితని ప్రవర్తన, ఆక్రోశం అనుకుంటూ లాడ్జిలోకి వెళ్ళేడు.

సాయంత్రం వరకూ ప్రయత్నించినా, వెంకట్రాముడికి ఎం. ఎల్. ఏ. క్వార్టర్స్‌లో పెంచలయ్య దొరకలేదు: యింట్లో సచ్చిదానందం దొరకలేదు.

తిరుగుళ్ళకు ప్రతిక్షణం జేబులోని డబ్బు కరిగిపోవటం చూసుకుంటూ 'దయ్యం పట్టిన మనిషి కుంభం తిన్నట్లుంది యీ మహానగర జీవితం' అని విసుక్కున్నాడు.

రాత్రి పడింది.

రంగు రంగుల వెలుగుల్లో నగరం మెరిసిపోతోంది. అమాయికంగా దీపాల వెన్నెల నవ్వుల్ని వెదజల్లుతోంది. గడుసుగా బస్సులు కార్ల వెలుతుర్లను కళ్ళల్లోకి చిమ్ముతోంది. కొంటెగా షాపుల నాగరికతతో ఆహ్వానిస్తోంది. సందడిగా జనసందోహంతో రోడ్లు నిండివున్నాయి.

రిక్షాలో గదికి వెళ్తున్న వెంకట్రాముడికి పగలు అద్భుతంగా కన్పించిన నగర నాగరికత, మూర్తీభవించిన స్వేచ్ఛలా కన్పించిన నగర సంస్కారం, వుత్తేజకరంగా కన్పించిన నగర వేగం ఆ రాత్రి భయంకరంగా కన్పిస్తున్నాయి.

తన వద్ద వుండే డబ్బునే కాదు; తననే మింగివేసేటట్లుంది, యీ రంగుల నగరం అనుకున్నాడు.

లాడ్జి గదిలో చేరి, 'రేపు యేమవుతుందో అది అవుతుందని' వెంకట్రాముడు దీక్షగా అర్ధరాత్రి దాటినవరకూ యింటర్వ్యూకోసం సిద్ధమయ్యేడు.

మరునటిరోజు యింటర్వ్యూ ముగిసింది.

యింటర్వ్యూలో సచ్చిదానందం తనను గుర్తించినందుకు సూచనగా చిరునవ్వు నవ్వేడనీ, అనుకూలమైన ప్రశ్నలు వేసేడని, పక్క మెంబర్లతో కూడా తనను గురించి చెప్పేడని వెంకట్రాముడు భావించేడు. యింటర్వ్యూలో తాను యిచ్చిన సమాధానాలకు తానే మురిసిపోయేడు. యీ ఆనందంలో, అదే యింటర్వ్యూకు వచ్చి తనను తప్పించుకొని తిరిగిన నరసింహరావును పట్టించుకోలేదు.

—తనకు యీ వుద్యోగం తప్పకుండా వస్తుంది. యింటర్వ్యూకు ముందు సచ్చిదానందం గారిని కలుసుకోక పోవడమే మేలైంది. తన శక్తి సామర్థ్యాలను హీనంగా అంచనా వేయకుండా మంచిపనే జరిగింది. రేపు వుదయం ఆయన ద్వారానే శుభవార్త విని బస్సెక్కాలి.

వెంకట్రాముడు వుదయం కోసం యెదురు చూసేడు.

మామూలుగానే వుదయం, వుదయించింది.

వెంకట్రాముడు సచ్చిదానందం యిల్లుచేరేవేళకు, ఆయన యింట్లోనే వున్నారనీ, యెవరితోనో మాట్లాడుతున్నారనీ విని, అది తన అదృష్ట సంకేత మనుకొన్నాడు.

వరండా కుర్చీల్లో వొకదాంట్లో దర్జాగా కూచొని, సచ్చిదానందం పిలుపు యెపుడు వస్తుందా అని వెంకట్రాముడు ఆతురతతో వున్నాడు. అరగంట గడిచింది. లోపల వున్నవాళ్ళు బయటికి రాలేదు. గంట గడిచింది. వెంకట్రాముడికి విసుగు పుట్టింది. లేచి వెళ్ళి, కాంపౌండులోని వొక చెట్టు కింద నిలుచున్నాడు.

ఆ పక్కగా ఆగిన కారులో వెనుక సీట్లో విలాసంగా కూచొని, ముందు సీట్లోని డ్రైవరుతో నవ్వుతూ మాట్లాడుతున్న అందమైన అమ్మాయిని చూడ్డంలో వెంకట్రాముడు మునిగిపోయేడు. యీలోపు వొకటి రెండు కార్లు రావటం, పోవటం కూడా వెంకట్రాముడు పట్టించుకోలేదు.

వరండాలో బిగ్గరగా నవ్వులు విన్పించేయి. వెంకట్రాముడు అటువైపు చూసేడు.

ఎం.ఎల్.ఏ.లు పెంచలయ్య, చలపతి, సంఘసేవకురాలు పుల్లమ్మ, మరో యిద్దరు సైడు బర్న్సు, యెలిఫెంట్ బాటమ్స్ యువకులు నవ్వుతూ కన్పించేరు.

ఆ యువకుల్ని వెంకట్రాముడు గుర్తించేడు.

—వాళ్ళు నిన్న తనతోపాటు యింటర్వ్యూకు వచ్చినవాళ్ళు. అందులో

వొకడు తన హాస్టల్ మేట్. తమలో కలవని తమ కులంవాడు ; తమకంటే పున్నతంగా బతికినవాడు— స్కాలర్ షిప్ డబ్బు తో, యింటిదగ్గరనుంచి వచ్చే పందలాది ఎం.ఒ లతో.

వెంకట్రాముడికి నీరసం ముంచుకొచ్చింది.

సచ్చిదానందం వాళ్ళను సాగనంపి లో-లికి వెళ్ళిపోయేడు.

వాళ్ళు అయిదుగురూ మెట్లు దిగుతున్నారు. వాళ్ళకు యెదురుపడటమా, మానటమా అనే సంకోచం వెంకట్రాముడికి కలిగింది. మర్యాద కాదని వెంకట్రాముడు యెదురు వెళ్ళి వాళ్ళకు నమస్కరించేడు. చేతులాడించి వాళ్ళు కారువైపు నడిచేరు. ఓబయ్య మాత్రం 'వో నువ్వా ? బాగున్నావా ? అని మాత్రం పలకరించి కారు యెక్కేడు.

కదిలిపోతున్న కారులోంచి నవ్వులు వినిపించేయి.

తనను గురించే అనుకున్నాడు వెంకట్రాముడు. ఓబయ్యనుద్దేశించి 'నీకోసం మొన్నంతా పడిగాపులు పడినానురా' అని వెంకట్రాముడికి అరవాలనిపించింది. నోరు పెగలలేదు.

సచ్చిదానందం ప్యూన్ వచ్చి 'సాబ్ ; సాబ్ రమ్మంటున్నారు' అనటంతో వెంకట్రాముడు గబగబా హాల్లోకి వెళ్ళి సచ్చిదానందానికి నమస్కరించేడు.

"బాగున్నారా ? కూర్చోండి."

సచ్చిదానందం అప్యాయత కింద వెంకట్రాముడు సేదతీర్చుకున్నాడు. సోఫాలో కూచొని, యే విధంగా మొదలుపెట్టాలో అని సందేహంలో పడి గుండె చిక్కబట్టుకొని చివరకు మాట్లాడేడు-

"మొన్న మీకోసం రెండు మూడుసార్లు యింటికి వచ్చినా సార్ ; వాసు సార్ మిమ్మలను కలవమన్నారు. మీరు యేవో మీటింగులకు వెళ్ళినట్లు తెలిసింది."

"అవును సికింద్రాబాదులో మన మీటింగులకే "

'మన' శబ్దంతో వెంకట్రాముడికి మరికొంత ధైర్యం వచ్చింది.

"వాసు సార్ మీకు నమస్కారాలు తెల్పమన్నారు సార్."

"అయన బావున్నారా ?"

"బావున్నారు సార్.... నిన్న యింటర్వ్యూ...."

"బాగా నే చేసేవు."

"రిజల్ట్స్ ?"—వెంకట్రాముడు నీళ్ళు నమిలేడు.

సచ్చిదానందం గభీరంగా మారిపోయేడు.

వెంకట్రాముడు తన దుర్దశను వివరించేడు మౌనంగా విని సచ్చిదానందం మరింత గభీరంగా మారిపోయేడు.

"మీకు అభ్యంతర మయితే క్షమించండి. నామీద నాకు విశ్వాసముంది. నా భయమల్లా నాకు కాకుండా జరుగుతుందని."

వెంకట్రాముడివైపు వాత్సల్యంగా చూస్తూ సచ్చిదానందం ఆత్మీయంగా అన్నాడు.

"ముందు ఆ కాఫీ తీసుకో....చల్లారిపోతుంది.... నువ్వు మొన్ననే నన్ను కలిసినా చెయ్యగలిగింది పెద్దగా యేమీ వుండదు. నువ్వెక్కడా అనని మాట యిస్తే నీతో వొక్క నిజం చెబుతాను— నా సంతృప్తి కోసం— నీ అమాయకత్వాన్ని చూసి."

సచ్చిదానందం క్షణం తటాపటాయించేడు. అదురుతున్న గుండెతో వెంకట్రాముడు అమాయకంగా తల వూచేడు.

"డి. ఆర్ వో. గారి తమ్ముడు యింటర్వ్యూకు వచ్చేడు. పుల్లమ్మ మరెవరినో రికమెండ్ చేస్తోంది. యిద్దరికీ ఎం. ఎల్ ఏ. లు, మంత్రులు, నేను వాళ్ళకు సహాయం చెయ్యకపోయినా, మిగతా ముగ్గురు మెంబర్లు వున్నారు. డిపార్ట్ మెంట్ హెడ్ వున్నాడు. వాళ్ళతో చేయించుకునే శక్తి వుంది వీళ్ళకు. వాళ్ళు కాకపోతే ముఖ్యమంత్రితోనే...."


"మరొక పోస్ట్ వుంది సార్."

వెంకట్రాముడి హీనస్వరంలోని ఆక్రందనకు సచ్చిదానందం చలించేడు.

"యీ వుద్యోగం నీకు రాదు.... వోపన్ కాంపిటీషన్లో కూడా— వీలుంటే మళ్ళీ రాయి. నా వ్యక్తిగత హోదాలో చెయ్యగలిగిన సహాయం యేదైనా వుంటే నీకు తప్పక చేస్తాను ... "

వెంకట్రాముడి మనసు స్తంభించిపోయింది. సచ్చిదానందం వాగ్దానం వెంకట్రాముడికి యే సంతోషాన్నీ యివ్వలేదు.

బయటకు నిర్వికారంగా వెళ్ళిపోతున్న వెంకట్రాముడి వంక సచ్చిదానందం కలతచెందిన మనస్సుతో, బాధగా, నిస్సహాయంగా చూసేడు. యిటువంటివాళ్ళకు సహాయం చెయ్యలేని యీ వుద్యోగాలూ, సంఘాలూ, సేవలూ యెందుకనుకున్నాడు. వెంకట్రాముడి భవిష్యత్తుపట్ల ఆందోళనతో ఆయన హృదయం కరుణార్ద్రి




మైంది. యేదో వొక బతుకు తెరువు చూపమని వెంకట్రాముడు యెందుకడగలేదు అన్న ఆలోచన వచ్చి సచ్చిదానందం 'యేమవుతాడో?' అనుకున్నాడు.

నాంపల్లికి అనిచెప్పి అబీడ్స్ సెంటర్‌లోనే దిగిన వెంకట్రాముడిని రిక్షావాడు విచిత్రంగా చూసేడు. డబ్బులు తీసుకొని వెళ్ళిపోతూ మళ్ళీ వెంకట్రాముడి వైపు చూసేడు.

వెంకట్రాముడు వొక మూల నిలబడి, తన అస్తిత్వంతో నిమిత్తం లేకుండా సాగిపోతున్న నగరాన్ని చూస్తున్నాడు. రోడ్ల కూడలిలో, మెరిసే యెండలో అత్యున్నతంగా వున్న నెహ్రూ, యెగరేస్తున్న శాంతి కపోతాన్ని మాటి మాటికి చూస్తున్నాడు.

ఆ సమయంలో వెంకట్రాముడికి తన అనుభవాలన్నీ గుర్తుకొచ్చేయి. ఆత్మ శోధన చేసుకున్నాడు.

—పుట్టి పెరిగిన సమాజంనుంచి తాను వేరైనాడు. ఆ వెలివాడల్లో తాను యిమడలేదు; యిమడలేక పోయినాడు. ఆ జీవితంపట్ల తనకు సానుభూతిలేదు; వాళ్ళ కష్టాల్లో భాగంలేదు; వాళ్ళ కోసం వీసమెత్తు చెయ్యలేదు. వాళ్ళ ఘోర జీవితం తనను కదిలించలేదు. ఆ జీవితాన్ని దర్శించగలిగిన మానవత్వం తను కోల్పోయినాడు— తన చదువుతో, చదువు పెంచిన వేరు సంస్కారంతో;

స్కాలర్‌షిప్పులతో అవి పెంచిన దయ్యాల మర్రిచెట్టు వూడల్లాంటి భ్రమలతో, స్వార్థంతో, దురాశలతో తన మానవత్వం కోల్పోయినాడు.

—తాను అర్రులు చాచింది తనను కదిలించిన చంద్రావతి సమాజంకోసం; ఓబయ్యల అధికారం కోసం; తన కవి దక్కలేదు. చంద్రావతి ప్రేమ దక్కలేదు; ఆర్. డి. ఓ. దక్కలేదు

—'హరిజనుడైనా గిరిజనుడైనా నీ ప్రయత్నాలు నువ్వు చేసుకోలేకపోతే నీ గతి అంతే' అని రంగనాథం రాసినాడు. తన ప్రయత్నాలు తను చేసినాడు; తన గతి అంతే అయింది.

—నరసింహరావు మొన్న యేదో అక్రోశాన్ని వెల్లగక్కేడు— 'మీకు కులముంది, నీకు తప్పకుండా వుద్యోగంవస్తుందని. వుద్యోగంమాత్రం రాలేదు.

—వీరదాసు చెప్పింది నిజమేనేమో! 'యీ చట్టంలో యెంత మంచి ఆఫీసరు మాత్రం చెయ్యగలిగేదేముంది?" సచ్చిదానందం యేం చెయ్యగలిగేడు. తనకు వుద్యోగం రాదని చెప్పగలిగేడు. చలపతి, ఓబయ్య, పెంచలయ్య, పుల్లమ్మలు మరెవరో తలచుకుంటే వస్తుందని చెప్పినాడు....

చట్టం!.... చట్టం!

యిప్పుడు తనేం చెయ్యాలి?

—నెహ్రూ యెంత వున్నతంగా వున్నాడో!

నెహ్రూ కాదు 'వుహూరు'

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం!

'వుహూరు' చేతుల్లో పావురం!

అదేమిటి పావురం డేగగా.... డేగలుగా!

గొడ్డుమాంసం కోసం జమ్మిచెట్టుమీద పొంతగద్దలుగా !?

కాదు....

తన కళ్ళు తిరుగుతున్నాయి, చెదిరిపోతున్నాయి.

అంతేనా....

వెంకట్రాముడి సత్యశోధన సాగుతూనేవుంది....

———